SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 3
August-2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఆగస్టు 2022
వెల రూ.5/-
పుటలు-56



శ్రీకృష్ణాష్టమి
(19-08-2022)

తిరుపతి సమీపంలోని పాతకాల్వ (పేరూరుబండ) వద్ద నూతనంగా నిర్మించిన శ్రీవకుళమాతఆలయ మహాసంప్రోక్షణ (23-06-2022) క్రతువు దృశ్యాలు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు, మాన్యశ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఆం.ప్ర. రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, సైన్స్ & టెక్నాలజీ, భూగర్భగనులశాఖా మాత్యులు శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంటు సభ్యులు శ్రీ మిథున్ రెడ్డి, ఆం.ప్ర. ప్రభుత్వ విప్ డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., తదితరులు పాల్గొన్నారు.




















## గీతాశ్లోకార్థసారం

**శ్లో :** యద్యప్యేతే న పశ్యన్తి లోభోపహతచేతసః ।
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥

**శ్లో :** కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 38, 39వ శ్లోకాలు)

**ప్రతిపదార్థం:** జనార్దన= ఓ కృష్ణా!; లోభోపహతచేతసః= రాజ్యలోభంచే చెడిన మనస్సులు గల; ఏతే= ఈ దుర్యోధనాదులు; కులక్షయకృతమ్= వంశనాశనంవల్ల గలుగు; దోషమ్= దోషాన్ని; మిత్రద్రోహే= మిత్రద్రోహమందలి; పాతకం చ= పాపాన్ని; యద్యపి న పశ్యన్తి= తెలిసికొనకపోయినా; కులక్షయకృతం= కులనాశనంవల్ల గలుగు; దోషమ్= దోషాన్ని; ప్రపశ్యద్భిః= చక్కగా తెలిసికొనుచున్న; అస్మాభిః= మనచేత; అస్మాత్ పాపాత్= ఈ పాపంనుండి; నివర్తితుమ్= తొలుగుటకు; కథమ్= ఎట్లు; నజ్ఞేయమ్= తెలియబడదు?

**భావం:** ఓ కృష్ణా! రాజ్యలోభంతో భ్రష్టచిత్తులైన దుర్యోధనాదులు వంశనాశనం వల్ల కలిగే దోషాన్ని, మిత్రదోహంవల్ల కలిగే పాపాన్ని ఒకవేళ ఎఱుగకపోయినా, ఆ రెండూ బాగా తెలిసిన మనమెందుకు ఈ పాపకృత్యంనుండి విరమింపగూడదో అర్థం కాకుండా ఉంది.

---

## పరమపురుషుడు


పరమపురుషుఁడు గోపాలబాలుఁ డైనాఁడు
మురహరుఁడు యెదుట ముద్దుగారీనిదివో

వేదపురాణములలో విహరించే దేవుఁ డు
ఆదిమూలమైనట్టి అలబ్రహ్మము
శ్రీదేవిపాలిటఁ జెలఁగే నిధానము
సేదదేరి యశోదకు శిశువాయ నిదివో

మొక్కేటి నారదాదుల ముందరి సాకారము
అక్కజపు జీవులలో అంతర్యామి
గక్కన బ్రహ్మఁ గొడుకుఁ గాఁ గన్న పరమము
అక్కరతో వెన్నముచ్చై యాటలాడీ నిదివో

దేవతలఁ గాచుటకు దిక్కయిన విష్ణుఁడు
భావము లొక్కరూపైన భావతత్త్వము
శ్రీవేంకటాద్రిమీఁద జేరున్న యా వరదుఁ డు
కైవసమై గొల్లెతల కౌఁగిళ్ల నిదివో

(సంపుటం-12, సంకీర్తన-17)





*"ఆహా.. ఎంతటి ఆశ్చర్యం..!! పరమోన్నతమైన పరాన్ని వరంగా ప్రసాదించే పరమపురుషుడే కదా ఈ గోపాల బాలుడై ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నాడు... అంటూ సుందరమైన భావాలన్నీ ఒకచోట అపురూపంగా, అపూర్వమైన రీతిలో అనూహ్యమైన తీరులో కలగలిస్తే, ఆ మహోన్నతమైన రూపుకు మరో పేరుగా నిలిచే కోమలమైన, పావనమైన భావతత్త్వం ఈ దైవమే.. శ్రీవేంకటాద్రిశిఖరాలపై భక్తులపాలిటి కరుణాసముద్రునిగా చేరి ఉన్న ఈ దైవం, ఎంతో రమణీయమైన రీతిలో, మొల్లమైన కూరిమిని గోపికలపై కురిపిస్తూ, వారిని ఆ పేరిమితో వలపిస్తూ, గోపకాంతల బలమైన కౌగిళ్లనే చెరసాలలో సరసాల బందీగా నిరతమూ కైవశమై, పరవశిస్తున్నాడు. ఇదిగో.. చూసి ఆనందించండి...." అంటూ ఉన్నతోన్నతుడైన శ్రీమన్నారాయణుడే ఈ ధరిత్రి చరిత్రను మార్చడానికి శతకోటి సవిత్రులకాంతితో గోపాలబాలునిగా అవతరించాడని ఈ సంకీర్తనలో తెలియజేస్తున్నాడు అన్నమయ్య.*

# తిరుమల తిరుపతి దేవస్థానములు

# పంచగవ్య ఉత్పత్తులు

**ఉర్వి నాసల్ డ్రాప్స్**
జలుబు, తలనొప్పులను నివారిస్తుంది. (కన్ను, ముక్కు, చెవి).

**భూమి హెర్బల్ ఫ్లోర్ క్లీనర్**
నేలపై ఉన్న బ్యాక్టీరియాను నిర్మూలిస్తుంది.

**నందిని గౌ-ఆర్క్**
క్రమం తప్పక వాడిన దీర్ఘాయుర్దాయం, జీవనప్రమాణకాలం మెరుగుపడతాయి.

**క్షమా కౌ డంగ్ కేక్స్**
యజ్ఞాలు, యాగాల్లో... మంచి వాతావరణం కల్గిస్తుంది.

**భువతి డంగ్ లాగ్స్**
యజ్ఞాలు, హోమాల్లో... మంచి వాతావరణం కల్గిస్తుంది.

**అవని ధూప్ చూర్ణం**
సువాసనను కల్గిస్తుంది.

**ధరణి అగరుబత్తి**
ఆహ్లాదకర వాతావరణం కల్గిస్తుంది.

**ధాత్రి సాంబ్రాణి కప్స్**
మంచి ఆరోగ్యానికి ఆలంబననిస్తుంది.

**వైష్ణవి ధూప్ స్టిక్స్**
వాతావరణాన్ని శుభ్రపరుస్తుంది.

**వారాహి ధూప్ కోన్స్**
చుట్టుప్రక్కల వాతావరణాన్ని పవిత్రపరుస్తుంది.

**పృథ్వి విభూతి**
ఈశ్వరానుగ్రహప్రాప్తి కల్గిస్తుంది.

**ధన్విక హెర్బల్ టూత్ పౌడర్**
దంతములు, దంతచిగుర్లకు రక్షణనిస్తుంది.

**హిరణ్మయి హెర్బల్ ఫేస్ప్యాక్**
రంగు, ముఖవర్చస్సులను మెరుగుపరుస్తుంది.

**మహి హెర్బల్ సోప్**
చర్మాన్ని సంరక్షిస్తుంది.

**కశ్యపి హెర్బల్ షాంపు**
శిరోజాలను సంరక్షిస్తుంది.

కస్టమర్ కేర్: 1800 425 4141
ఇ-మెయిల్: helpdesk.ttd@tirumala.org





వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


52 వసంతాలు
1970-2022

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 53 ఆగష్టు, 2022 సంచిక : 03


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| నవనీతహృదయుడికి నవనీతసేవ | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్ | 10 |
| పుడమిని బ్రోచిన నారాయణా..! | ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు | 12 |
| గణపతి నేర్పే పాఠాలెన్నో... | డా॥ కప్పగంతు రామకృష్ణ | 14 |
| ఏ లక్ష్మికి పూజ ఎప్పుడెప్పుడు ? | బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 17 |
| తిరువెళ్ళత్తై (శ్వేతగిరి) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 20 |
| హయగ్రీవావతార వైభవం | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 22 |
| అమ్మలాంటి దైవం | డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు | 23 |
| రక్షాబంధనం | బ్రహశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 25 |
| గరుడపంచమి | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 26 |
| తిరుమలలో శ్రీకృష్ణజయంతి | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| శ్రీమన్నారాయణునికి మార్చి మార్చి సేవ చేస్తుంటాడు! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 33 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 36 |
| వెంగమాంబ దర్శించిన శ్రీకృష్ణుడు | డా॥ సంగీతం కేశవులు | 37 |
| పండుగపూట పసందైన నైవేద్యాలు | డా॥ వైజయంతి పురాణపండ | 38 |
| భక్తులతో మాట్లాడే స్వామి | శ్రీ ఎస్.వి.నరసింహం | 41 |
| రసజ్ఞత లేని చదువు వ్యర్థం | డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు | 43 |
| కొండంతదేవునికి గోరంతపత్రి... | శ్రీమతి అన్నంగి వేంకటశేషలక్ష్మి | 44 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 46 |
| రాజదండన పొందితే యమదండన తప్పతుంది | శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 47 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 49 |
| చవితి చంద్రుణ్ణి చూస్తే..! (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 52 |
| బాలవినోదం | | 54 |


ముఖచిత్రం : నవనీతకృష్ణుడు (తిరుమల)
వెనుక చిత్రం : శ్రీవరలక్ష్మీదేవి, చిత్రకారుడు: శ్రీ పేరూరు శివప్రసాద్


గౌరవ సంపాదకులు
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఎ.సి.), తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 2233333

వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# శుభాలమాసం శ్రావణం!!

భారతీయులదృష్టిలో ఒక్కొక్క కాలభాగానికి ఒక్కొక్క విశిష్టత ఉంది. సంవత్సరంలో మేఘావృతమై మేఘాన్ని తిరోగమించే కాలాన్ని చాతుర్మాస్యదీక్షాకాలంగా మన మహర్షులు నిర్ణయించారు. కాళిదాసమహాకవి ఆషాఢశుద్ధఏకాదశినుండి కార్తికశుద్ధఏకాదశిదాకా చాతుర్మాస్యదీక్షా కాలమనీ, ప్రజలందరూ అప్రమత్తులై, ఆహారనియమాలతో, భగవదారాధన చేస్తూ గడపాలనీ మేఘసందేశకావ్యంలో తెలిపాడు.

ఈ చాతుర్మాస్యదీక్షాసమయంలో శ్రావణమాసం వస్తుంది. ఈ నెలలోని మంగళ, శుక్రవారాలు హైందవస్త్రీలకు ముఖ్యమైన పండుగరోజులు. మంగళవారాల్లో మంగళగౌరిని, శుక్రవారాల్లో శ్రీవరలక్ష్మిని ఆరాధించి, సకలసన్మంగళాలను పొందుతున్నారు. ఇక పురుషులకు శ్రావణపూర్ణిమ ఒక పవిత్రమైన రోజు. ఆనాడు వటువులకు అధ్యాయోపాకర్మసంస్కారం చేసి వేదాధ్యయనమారంభిస్తారు. ఇది అనూచానంగా వస్తున్న శాస్త్రసంప్రదాయం. అయితే, సాధారణంగా పూర్ణిమ అనధ్యయనదినం. అనధ్యయనదినాల్లో వేదాధ్యయనం చెయ్యరు. కానీ, శాస్త్రం శ్రావణపూర్ణిమనాడు ఉపాకర్మసంస్కారాన్ని, కొత్తగా వేదాధ్యయనం ప్రారంభాన్ని విధిస్తోంది.

శ్రావణపూర్ణిమనాడు శ్రవణానక్షత్రంలో శ్రీమహావిష్ణువు హయగ్రీవుడుగా అవతరించి సర్వకల్మషనాశకమైన సామగానం చేశాడు. కనుక ఆనాడు అందరూ శంఖచక్రగదాధరుడైన హయగ్రీవుణ్ణి పూజించాలని కల్పతరువు అనే గ్రంథం ఉపదేశిస్తోంది. శ్రావణమాసంలో హయగ్రీవారాధన సమస్త పాపక్షయకరం.

గ్రీష్మతాపానికి భూమి ఎండి, వానలు కురవగానే శ్రావణమాసంలో అనేకఔషధాలు పుడతాయి. గనుక, ఈ మాసం ప్రశస్తమైంది. స్త్రీలు వేదమాతృస్వరూపిణి అయిన శ్రావణమంగళగౌరిని, శుక్రవారవరలక్ష్మిని, మాతృస్వరూపిణులైన ముత్తయిదువులను ఆరాధిస్తారు.

శ్రావణమాసంలోని మరొక పర్వదినం శ్రీకృష్ణాష్టమి. దీన్నే కృష్ణజయంతి అంటారు. జయంతి అంటే రాత్రి అని అర్థం. జయంతి అంటే సర్వపాపాలను నశింపజేసే రాత్రి. శ్రీకృష్ణునికి గల గోపాల, గోవింద అనే పేర్లు ఆయన వేదస్వరూపుడు, వేదరక్షకుడని తెల్పుతున్నాయి. కాబట్టి, వేదపురుషుడు శ్రీకృష్ణపరమాత్మను పూజిస్తే ఆయన మానవుల మనస్సుల్ని దున్నుతాడట. రైతుపొలందున్ని కొత్తవిత్తనాల్ని నాటి చక్కని పైరును ఇచ్చేటట్లు, శ్రీకృష్ణుడు మానవుల మనసుల్ని దున్ని, కలుపుమొక్కలవంటి అసత్య, అవైదికలక్షణాలను పీకి పారేసి, సత్యప్రతిష్ఠ గావిస్తాడు. వైదికలక్షణాలను నెలకొల్పుతాడు. పాపప్రక్షాళన చేస్తాడు.

సర్వవ్యాధినివారిణి అయిన వేదమాతను, వేదమాతృస్వరూపిణి అయిన పరాశక్తిని, వేదపురుషుడైన పరమేశ్వరుణ్ణి ఆరాధన చేసి ప్రజలందరూ తరించాలని వేదమాత ఉపదేశం. వేదాధ్యయనమే గాక, వేద శబ్దశ్రవణం గూడ పుణ్యమనీ, మహర్షుల వలే అందరూ వేదమంత్రశ్రవణం చేసి వేదమయులు, తద్వారా దేవమయులు కావాలనీ, ఇలా దైవానుగ్రహాన్ని సంపాదించే కాలమవడమే శ్రావణమాసవిశిష్టత!

# నవనీత హృదయుడికి నవనీతసేవ!

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

శ్రీకృష్ణుడు మధురాధిపతి. ఆయన పిల్లనగ్రోవిపై పలికించే పాట మధురమైంది. ఆయన ధరించిన పీతాంబరం మధురమైంది. ఆయన భుజించింది, నిద్రించిందీ మధురమైందే! ఆయన రూపం మధురం. ఆయన నుదుట ధరించే తిలకం మధురం. ఇలా ఆ మధురాధిపతియొక్క సర్వమూ మధురమైందే!


శ్రీకృష్ణుడు భుజించే ఆహారం, పదార్థాలు, ఫలాలు–అన్నీ ఎంతో మధురమైనవి. భగవంతునికి భుక్తిశేషం (నైవేద్యం పెట్టింది) భక్తులకు ఎంతో ఇష్టమైంది. అది అమృతంతో సమానమైంది. ఆయన తాగిన పాలు, తిన్నవెన్న, పెరుగు, నెయ్యి బహుశః ఏ అవతారంలోనూ, ఏ దేవతామూర్తులు సేవించ లేదనడం పరమసత్యం. శ్రీకృష్ణుని దివ్యరూపం ఎంతకాలం చూచినా ఇంకా చూడాలనేంత ఆకర్షణీయంగా ఉంటుంది. ఆ రూప మనోహరత్వం బ్రహ్మాదులకే దక్కని వస్తువు.

"పసిబిడ్డలో, పాడికుండలో కూడా పరమాత్మను దర్శించి ధన్యులు కండి" అనేనేమో శ్రీకృష్ణావతారంలో బాలగోపాలసందేశం అనిపిస్తుంది. స్తన్యాన్ని గ్రోలుతూ తల్లి కళ్లలోకి చూసే పసికందులో, అరికాలు నోట పెట్టుకునే బిడ్డలో, విత్తనంలో నుండి అప్పుడే మొలకెత్తిన మొలకలో, మిగులపండిన పండులో, ఎండుటాకులో, బుల్లిపిట్టగొంతులో నుండి వచ్చే అవ్యక్తమధురసంగీతంతో– ఇలా ఎన్నోచోట్ల పరమాత్మ సూక్ష్మతత్త్వం మనల్ని మంత్రముగ్ధుల్ని చేస్తూనే ఉంది.


బొటనవ్రేలు నోట పెట్టుకున్న బాలముకుందుడి దగ్గర నుండి, వేటగాడి బాణం బొటనవ్రేలులో దిగి అవతార పరిసమాప్తి వరకు ఆ లీలానాటకం జగదానందకారకం, జన్మ సాఫల్యసాధనం కూడా. ఆ బాల్యం లీలామాధుర్య విశ్వమోహన విభూతి.

నవనీతమంటే నూతనమైన పెరుగునుండి తీసిన వెన్న, కొందరు ఆవు ఈనిన నాటి జున్నుపాలనుండి తీసిన వెన్న అని గురుబాలప్రబోధిక అర్థాలు చెప్పింది. అంటే నిన్నటి, మొన్నటి పెరుగునుండి గాక ఏ రోజు పాలు ఆ రోజే తోడు వేయగా ఏర్పడ్డ పెరుగునుండి కవ్వంతో చిలకగా రూపొందిన వెన్న. పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఇవన్నీ గోవు నుండీ ఏర్పడ్డవే అయినా ఆయా పరిణామాన్ని బట్టి పేర్లు, రూపాలు, రుచి మాధుర్యాలు వేరువేరుగా ఉంటాయి. అన్ని అవతారాలకంటే ద్వాపరంలో వచ్చిన శ్రీకృష్ణావతారం ఈ నాల్గింటినీ పుష్కలంగా తిని, త్రాగి ఆనందించడం విశేషం.


శ్రీకృష్ణుని బాల్యమంతా నంద గోకులంలోనే జరిగింది. అప్పుడు ఆయన గోపాలకుడయ్యాడు. గోపబాలకులలో తానూ ఒకడై, ఆ పరమాత్మ లీలామానుష విగ్రహుడై చేసిన పనులు వర్ణనాతీతాలు. గోపాలన అయనవమ్ ఆయనకు అత్యంత ఆనందానుభూతిని ఇచ్చింది. భగవంతుడు గోపవనితలను అడిగి పాలు, పెరుగు, వెన్న, నెయ్యి తినడు. బాలచేష్టలతో తన మిత్రబృందాన్ని వెంట బెట్టుకుని, తాను తినడమే కాక, మధురమైన పదార్థం ఒక్కడే తినరాదనే నియమాన్ని పాటిస్తూ, తోటి బాలురకూ తృప్తిగా



తినిపించేవాడు. దొంగతనంలో దొరతనాన్ని వెలార్చాడు బాలకృష్ణుడు. గోవులు కురిపించే క్షీరాన్నీ, నవనీతాన్నీ నలుగురితో పంచుకోకుండా, ఉట్లమీద బానల్లో దాచే స్వభావం తగదని, ఆ మనసుల గురుతులెరిగిన దొంగ గోపాలుడై సర్వాంతరాత్మతత్త్వంగా ఆ గోకులంలో క్షీరామృతాన్ని వరదలుగా ప్రవహింపజేశాడు. అందుకే ఆ చిన్ని శిశువుతో పాటే గోకులంలో అమృతతత్త్వం వెల్లివిరిసింది.



గో సంబంధమైన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి- ఈ నాల్గింటిలో వెన్నలో చాలా తేలికగా జీర్ణమయ్యే లక్షణం ఉంది. ఇందులోని క్రొవ్వు మన శరీరాన్ని సౌందర్యవంతంగా, మృదువుగా ఉంచుతుంది. పసిమివన్నెను చేకూరుస్తుంది. పసిపిల్లల శరీరానికి బాగా వెన్న పూసి ఉదయం కాసేపు ఎండలో ఉంచితే, బిడ్డలకు చేతులు, కాళ్లుబలంగా వర్ధిల్లుతాయి. ఇలా అనేక వైద్యగుణాలు వెన్నలో ఉన్నాయి.



అందుకే గోపాలకృష్ణుడు దివి నుండి భువికి అవతరించి, వెన్న రుచి ఎలాంటిదో లోకానికి తెల్పాడు, ఆయన శరీరానికి వెన్న బాగా పూసుకుంటాడు. వెన్నముద్దలతో ఆడుకుంటాడు. అప్పుడే తీసిన వెన్ననే ఆహారంగానూ స్వీకరిస్తాడు. అందుకే శ్రీకృష్ణుడు నల్లనివాడైనా ఆ దివ్యశరీరకాంతి విశ్వాన్నంతా ఆకర్షించింది. త్రిజగన్మోహన నీలకాంతితో ప్రకాశించింది.

ఆనాటి శ్రీకృష్ణుడే ప్రస్తుతం తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడుగా భక్తుల్ని కాచి రక్షిస్తున్నాడు.

పదకవితాపితామహుడైన అన్నమయ్య కూడా శ్రీకృష్ణపరమాత్మలో శ్రీవేంకటేశ్వరుణ్ణి తిలకించి, పులకించి, తన పదాల్లో గమకించి, మైమరచిపోయాడు.

.................

**బలుపైన పొట్టమీద పాలచాఱల తోడ**
**నులివేడి వెన్న దిన్న నోరి తోడ**
**చెలగి నేడిదె వచ్చి శ్రీవేంకటాద్రిపై**
**నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ**

తన బలుపైన పొట్ట మీద వెదజల్లబడ్డ పాలచారికలతో, నులివేడివెన్న తిన్న జిడ్డుమూతితో అలరిస్తూ తిరుగుతున్నాడు ఈ త్రిజగన్మోహనశిశువు. ఆ బాలుడే కదా ఎంతో ఉత్సాహంతో, ఉద్వేగంతో వచ్చి నేడు శ్రీవేంకటాద్రి మీద మురిసేలా నిలిచి, లోకాలకు రక్షకుడై నిలిపిందీ, మరులూరించేలా నిలిచింది అని చిన్నారి శిశువైన, పొన్నారికృష్ణుణ్ణి శ్రీవేంకటేశ్వరుడిలో తనివారా దర్శించి వేనోళ్ల సంకీర్తించాడు అన్నమయ్య.






శ్రీమహావిష్ణువు తిరుమలలో మొదట ఉన్న రోజులలో ఒక నీలధేనువు రోజూ స్వామివారున్న పుట్టలో పాలు వర్షించేది. అవి త్రాగి స్వామి ఆకలి తీర్చుకున్నాడు. శ్రీకృష్ణావతారంలో గోసేవ, గోపోషణ చేస్తే, ఈ వేంకటేశ్వరుడి రూపంలో గోవుల చేతనే పోషించబడ్డాడు.

శ్రీవారికి రోజూ ఎన్నోసేవలు జరుగుతున్నాయి. వాటిలో 'నవనీతసేవ' అనేది ఒక దివ్యసేవ. దీన్ని 2021 సం॥ ఆగష్టు నెలలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రారంభించింది తిరుమల తిరుపతి దేవస్థానం.

యంత్రాలతో, పచ్చిపాలనుండీకాక, ఆనాటి గోకులంలో కుండల్లో పాలుకాచి, పేరబెట్టి, కవ్వాలతో చిలికి ఎలా వెన్న తీసేవారో, అదే పద్ధతిలో అందుకు అవసరమైన కొయ్యస్తంభం, కొయ్యకవ్వం, కుదురు, కవ్వపుతాళ్లు, కుండ క్రింద చుట్ట ఉంచి, సంప్రదాయబద్ధంగా పెరుగు చిలికి వెన్న తీయించి, శ్రీవారికి సమర్పించడం ఈ సేవలోని పరమార్థం.

నవనీతసేవలో వెన్న తీసుకువెళ్లి శ్రీస్వామివారికి సమర్పించేందుకు గాను ఒక కిలో పన్నెండు గ్రాముల బరువు గల వెండిగిన్నెను అప్పటి తి.తి.దేవస్థానం కార్యనిర్వహణాధికారి డా॥కే.ఎస్.జవహర్‌రెడ్డి విరాళంగా అందజేశారు.

ఈ సేవ ద్వాపరయుగాన్ని, బాలకృష్ణుణ్ణి తలపింపజేస్తుంది. శ్రీవారి సుప్రభాతంలో కూడా "పెరుగు చిలికే ధ్వనులు విన్పిస్తున్నాయి. తెల్లవారుతోంది" అని తెల్పారు. ఇప్పటికీ కొన్ని పల్లెలలో సంప్రదాయబద్ధంగానే పాలు, పెరుగు, వెన్న, నెయ్యి తయారుచేయడం ఉంది.






శ్రీకృష్ణ, శ్రీవేంకటావతారాలు సన్నిహితాలు. కనుక శ్రీవారిని శ్రీకృష్ణుడుగానే భావించి ఈ "నవనీతసేవ" చేయడం ఎంతో ప్రశస్తం! ప్రాచీన సంప్రదాయాన్ని రక్షించడమూ అవుతుంది.

భగవంతుడు అనేకరూపాలతో అనేక సేవలు చేయించుకుంటాడు. విశ్వమే తానయినపుడు ఇక ఆ స్వామికి కొరత ఏముంటుంది?

అన్ని దేవాలయాల్లో ఈ సేవ జరిగితే గోసంపద పెరుగుతుంది. గోసేవలు చేసే గృహస్థులూ ధన్యులవుతారు. "గోధనమే మహాధన"మనే మన ప్రాచీనభావాన్ని వ్యాపింప చేయడమూ జరుగుతుంది.

# శ్రీమద్భగవద్గీత



ధారావాహిక

## 17వ-అధ్యాయం (సారసంగ్రహం)

*విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్*

### శ్రద్ధాత్రయ విభాగయోగం

భగవద్గీతలోని పదిహేడవ అధ్యాయానికి శ్రద్ధా త్రయ విభాగ యోగమని పేరు. సత్త్వరజస్తమోగుణాలే ఇందులో బోధింపబడ్డాయి. ఇందులో శ్రద్ధ మూడువిధాలుగా విశేషించి నిరూపింపబడటం చేత దీనికి శ్రద్ధాత్రయవిభాగయోగం అనే పేరు అన్వర్థమై అలరారుతోంది.

ఈ అధ్యాయంలో సాత్త్వికశ్రద్ధ, రాజసశ్రద్ధ, తామస శ్రద్ధలను పేర్కొని శ్రద్ధగలవాని లక్షణాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు శ్రీకృష్ణపరమాత్మ. ఏ కార్యానికైనా శ్రద్ధ చాలా అవసరం. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని కృష్ణపరమాత్మ వచించాడు. ఈ వివరణలే ఈ అధ్యాయంలో చక్కగా నిరూపింపబడ్డాయి. ఈ యోగంలో కృష్ణపరమాత్మ మూడువిధాలైన ఆరాధన, ఆహారం, తపస్సు, యజ్ఞం, దానం అనేవాటిని నిరూపించి– ఓం తత్ సత్ అనే మూడు శబ్దాల అర్థాన్ని కూడా వివరించాడు. ఈ అధ్యాయం చదవటం వల్ల వైద్యులకు లొంగని తీవ్రమైన మనోవ్యాధులులాంటివి నిర్మూలమౌతాయి.

"కృష్ణా! ఎవరు శాస్త్రవిధిని అనుసరించకుండా శ్రద్ధతో దేవతల్ని అర్చిస్తారో అట్టివారి ప్రవృత్తి ఎలాంటిది? అది సాత్త్వికమా? రాజసమా? తామసికమా?" అని అర్జునుడు కృష్ణుణ్ణి ప్రశ్నిస్తున్నాడు.

### భగవంతు డంటున్నాడు

"అర్జునా! దేహాన్ని ధరించిన ఈ మనుజులకు– పూర్వ జన్మసంస్కారాన్ని బట్టి సాత్త్వికశ్రద్ధ, రాజసశ్రద్ధ, తామసిక శ్రద్ధ అని మూడురకాల శ్రద్ధలు కలుగుతుంటాయి. ఆ శ్రద్ధ యొక్క స్వరూపాన్ని ఇంకా బాగా వివరిస్తాను. విను.

ఓ భరతశ్రేష్ఠ! "ప్రతివ్యక్తికీ వారి వారి స్వభావాన్ని బట్టి సంస్కారాల ననుసరించే శ్రద్ధ కలుగుతుంది. అస లీ జీవుడున్నాడే వీడు శ్రద్ధాస్వరూపుడు. శ్రద్ధ వాని పూర్వజన్మ వాసన ననుసరించే కల్గుతుంది. పూర్వ జన్మలో ఎవడు ఎలాంటి శ్రద్ధ కలిగి ఉండేవాడో వా డిప్పుడు కూడా అలాంటి స్వభావంతోనే ప్రవర్తిస్తూ ఉంటాడు."

"సాత్త్వికులు దేవతలను ఆరాధిస్తారు. రాజసులు యక్ష రాక్షసులను ఉపాసిస్తారు. తామసికులైన జనులు భూతప్రేతాలను కొలుస్తారు. దారుణమైన తపస్సును చేసేవారు ఆసురస్వభావం కలవారు అని గ్రహించు."

అర్జునా! సత్త్వాది గుణభేదాల ననుసరించి పై మూడు రకాల మనుష్యులకు మూడురకాలైన ఆహారాలమీద ఇష్టం కలుగుతుంది. అలాగే యజ్ఞం, తపస్సు, దానం ఇవి కూడా మూడు పద్ధతుల్లో ఉన్నాయి. వాటిని గూర్చి చెప్తాను విను.

ఆయుర్దాయాన్ని, ఉత్సాహాన్ని, జ్ఞానాన్ని, బుద్ధిబలాన్ని, దేహబలాన్ని, ఆరోగ్యాన్ని, సుఖాన్ని, సంతోషాన్ని పెంపొందించేవీ, రసవంతములైనవీ, నేతితో కూడినవీ, చెడిపోకుండా ఉండేవీ దేహానికి సత్తువనిచ్చేవీ, దాహము కలుగచేయనివీ, ఆకలి తగ్గించి వేసేటువంటి ఇంపైన ఆహారపదార్థాలు సాత్త్వికులకు ఇష్టంగా ఉంటాయి. మిక్కిలి కారంగా, పుల్లగా, ఉప్పగా, చేదురుచులు కలవిగా, ఎక్కువవేడిగా, ఉద్రేకం పుట్టించేవిగా, ఎక్కువ దాహం కలిగించేవిగా ఉండి దుఃఖ శోక రోగాలకు హేతువైనవీ అయిన ఆహారాలు రాజసులకు ప్రియ మైనవిగా ఉంటాయి. ఎప్పుడో వండటంవల్ల చల్లారిపోయినదీ, ఎండిపోయి రుచి లేనిదీ, పాసిపోయి చెడువాసన కొట్టేదీ, చద్దివీ, ఒకరు తిని విడిచినదీ, అపవిత్రమైందీ అయిన ఆహారపదార్థాలు తామసులకు నచ్చుతుంది.

ఇక యజ్ఞ విషయాలను గూర్చి ఇలా వివరిస్తున్నారు శ్రీకృష్ణపరమాత్మ.

శాస్త్రవిధి ననుసరించి ఫలాపేక్షలేకుండా యజ్ఞం చేయడమే నావంతు అనే భావనతో చేసే యజ్ఞం సాత్త్విక యజ్ఞం అనబడుతుంది. అర్జునా! ఫలాపేక్షతో, ఆడంబరంగా పదిమందికి తెలియడానికి, గొప్పతనం ప్రకటించుకోవడం కోసం చేసే యజ్ఞం రాజసయజ్ఞం అని తెలుసుకో. శ్రద్ధ బొత్తిగా లేకుండా శాస్త్రమర్యాదల్ని ప్రక్కనబెట్టి, అన్నదానం లేకుండా, మంత్రోచ్చారణ లేకుండా, దక్షిణ ఇవ్వకుండా చేసేయజ్ఞాన్ని తామసయజ్ఞమంటారు. ఆహారయజ్ఞాలవలెనే, తపస్సుకూడా శారీరక వాచిక మానసిక తపస్సులని మూడువిధాలుగా ఉంటుం దని శ్రీకృష్ణ భగవానుడు చెబుతున్నాడు.



దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, జ్ఞానులను పూజించటం, పరిశుభ్రంగా ఉండటం, కపటం లేకుండా ఉండటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం, అహింస-ఇవి శరీరంతో చేసే తపస్సు అని చెప్పబడుతున్నది.

తనకు, ఎదుటి వారి మనసుకు బాధ కలుగకుండా మాట్లాడడం, ప్రియంగా, హితంగా సత్యం పలకడం, వేదాలను, స్తోత్రాలను తత్త్వజ్ఞాన విషయాల్ని అధ్యయనం చేయడం వాచిక తపస్సని చెప్పబడుతుంది.

మనసును చెడు తలంపులు లేకుండా ప్రసన్నంగా ఉంచుకోవడం, శాంతంగా ఉండటం, మౌనం వహించడం, ఇంద్రియాలను నిగ్రహించటం, పరిశుద్ధ భావాల్ని కలిగి ఉండటం, నెమ్మదితనం అనునివి మానసిక తపస్సు అనబడుతుంది.

దానంకూడా మూడు విధాలుగా ఉంది. దానాలలో ఉన్న తేడాలను కూడా వివరిస్తాను. గ్రహించు.

అర్జునా! ప్రత్యుపకారం ఆశించకుండా ఇవ్వడమే నా ధర్మం అనే భావనతో పవిత్ర ప్రదేశంలో, మంచి పుణ్యకాలంలో యోగ్యుడైన వ్యక్తికి చేసేదానం సాత్త్విక దానమవుతుంది. ఇలా దానం చేయడంవల్ల మంచి ఫలం కలుగుతుంది.

తిరిగి ఉపకారాన్ని పొందాలనేకాంక్షతోగానీ, ఆముష్మిక ఫలాన్ని ఉద్దేశించిగానీ, కష్టపడుతూ బాధతో చేసే దానం రాజస దానమౌతుంది. ఇది మధ్యమఫలితంగా ఉంటుంది.

అపవిత్రస్థలంలో, అకాలంలో, అపాత్రులకు, అగౌరవంతో, విసుగుతో, ఇష్టం లేకుండా సత్కారశూన్యంగా చేసే దానం తామసదానమని చెప్పబడుతుంది. ఇలా దానం చేయడం అనర్థదాయకం.

అర్జునా! పరబ్రహ్మం "ఓం, తత్, సత్" అని మూడు విధాలుగా చెప్పబడింది. ఈ బ్రహ్మం నుండే జగత్తు ఆవిర్భ వించింది. పరబ్రహ్మమే భగవత్స్వరూపం. ఆ భగవంతునివల్లనే బ్రాహ్మణులు, వేదాలు, యజ్ఞాలు సృష్టింపబడ్డాయి. వేద మంత్రాలకు ముందు ఎప్పుడూ కూడా ఈ ఓంకారం ఉచ్చ రింపబడుతూ ఉంటుంది.

అందువల్లనే బ్రహ్మవేత్తలు యజ్ఞం, దానం, తపస్సు అనే ఈ క్రియలను 'ఓం'కార ఉచ్చారణతోనే అనుష్ఠిస్తుం టారు. 'తత్' అంటే అవాఙ్మానసగోచరుడైన భగవంతుడని అర్థం, అలాగే 'తత్' అనే శబ్దాన్ని ఉచ్చరించి మోక్షం కోరేవాళ్లు ఫలాపేక్షను వదలి పలు విధాలైన యజ్ఞ దాన తపః క్రియలను నిర్వర్తిస్తారు.

పార్థా! బ్రహ్మము నిజంగా ఉంది. అది మంచిది అనే అర్థంలో 'సత్' శబ్దం ప్రయోగింపబడుతున్నది. యజ్ఞ దాన తపస్సులలోగల నిష్ఠకూడా 'సత్' అనే చెప్పబడుతుంది.

పార్థా! శ్రద్ధలేకుండా చేసే ఏ కార్యమైనా హోమం, దానం, తపస్సు 'అసత్' అనబడుతున్నవి. అవి ఇహపరాలలో సత్ఫలం ఇవ్వవు. కనుక ఏ కార్యమైనా శ్రద్ధతో చేసినపుడు మాత్రమే సత్ఫలితాలిస్తుంది.

జ్ఞానం లేకున్నా లోటుగాదు. శ్రద్ధలేకపోతే మాత్రం నిష్ఫలం.

శ్రీకృష్ణార్పణమస్తు.

**ఆగష్టు 30, శ్రీవరాహజయంతి**



# పుడమిని బ్రోచిన నారాయణా..!

– ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, 78939 82500

శ్రీహరి వరాహావతారాన్ని ధరించడానికి కారణం– విష్ణువు ద్వారపాలకులైన జయవిజయులు తమను విష్ణు సందర్శనానికి అడ్డగించారన్న కోపంతో సనకసనందనాదులు వారిని మూడుజన్మల్లో రాక్షసులుగా పుట్టమని శపిస్తారు. వారు "కరుణింపుడు" అని ఆ ఋషుల్ని ప్రార్థించారు. ఆ ప్రార్థనకు కరిగిన ఆ మహనీయులు మూడుజన్మల్లో శాపవిమోచనం కలుగుతుంది అని, విమోచనరూపమైన అనుగ్రహాన్ని ప్రదర్శించారు. ఆ కారణంగా జయవిజయులు హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులుగా జన్మించారు. విష్ణువు వరాహ, నరసింహావతారాల్లో వారిని నిర్జించాడు. రెండోజన్మలో రావణకుంభకర్ణులుగా అవతరించారు. శ్రీరామావతారంలో శ్రీహరి వారికి మరణరూపమైన ముక్తిని అనుగ్రహించారు. మూడవజన్మలో ఆ ద్వారపాలకులు శిశుపాల, దంతవక్త్రులుగా జన్మించారు. శ్రీకృష్ణావతారంలో జయవిజయులకు శాపవిమోచనం కలిగింది. ఇది స్థూలంగా వరాహావతారనేపథ్యం. దశావతారాల్లో మూడోది వరాహావతారం. శ్రీమహావిష్ణువు హిరణ్యాక్ష సహృతమైన భూమిని సముద్ధరించడం ఇందులో ప్రధానం. హిరణ్యకశిపుడికి అగ్రజుడైన హిరణ్యాక్షుడు లోకోపద్రవకార్యాలు చేస్తూ సమస్త భూమండలాన్నీ చాపచుట్టలాగా చుట్టి సముద్రంలో పడేస్తాడు. అపుడు శ్రీహరి ఆదివరాహరూపధారియై భూమిని ఉద్ధరిస్తాడు.

తెలుగుసాహిత్యంలో పురాణ, కావ్య, శతక, పద, చాటు, అవధానాదిప్రక్రియలో వరాహావతారవిశేషాలు కన్పిస్తున్నాయి.

ఎఱ్ఱన నృసింహపురాణంలో వరాహావతార విషయం గమనింపదగి ఉంది.

చంII గొరిజల త్రొక్కునం బ్రిదిలికుండలిభర్త యొదుంగ నూర్పులం
దెరలి మహార్ణవోదకము త్రిప్పుకొనం బటురోషతాడనన్
జిరిఁగి యజాండకర్పరము చిల్లులు వోవఁగ యజ్ఞ పోత్రివై
ధరపదిలంబుగా నిడిన తావకలీలఁ దలంతు మవ్యయా!

(3వఆశ్వాసం–36వ పద్యం)

ఎఱ్ఱన వరాహావతారాన్ని గూర్చి పూర్తి పద్యం రాయడమే గాక కొన్నిసందర్భాలల్లో పద్యపాదాల్లో కూడ సూచించాడు. ఉదాహరణకు ప్రహ్లాదాదులు నృసింహమూర్తిని స్తుతించే సందర్భంలో ఒక దండకం (5–110) చివరలో కూడా వరాహావతారాన్ని స్తుతించాడు.

భాగవతం తృతీయస్కంధంలో పోతన 'శ్రీయజ్ఞ వరాహావతారవర్ణనము' అని ప్రత్యేకంగా వర్ణించాడు. అఖిల జగత్కల్పనకు పూనుకొన్న బ్రహ్మ విశ్వంభరోద్ధరణకు పురుషోత్తముణ్ణి మనస్సులో ధ్యానిస్తాడు. అప్పుడు యజ్ఞవరాహమూర్తి విధాత నాసికారంధ్రాలనుంచి అంగుష్ఠమాత్రదేహంతో అవతరించి క్షణంలో గజప్రమాణాన్ని పొందుతాడు. మునులు, మునికుమారులు, మనువు మొదలైనవారు వరాహచర్యకు ఆశ్చర్యపోతారు. కొంతసేపటికి మహోన్నతమైన గండశిలోపమంగా ఆ మూర్తి అవతరించింది. బ్రహ్మ ఆ మూర్తి మహిమను వారికి వివరిస్తాడు. అప్పుడు ప్రళయకాలంలోని భయంకర జీమూతగర్జనలు దిక్కులు పిక్కటిల్లే శబ్దాన్ని శ్రీవరాహస్వామి చేస్తాడు. ఆ వరాహగర్జనకు మునులు మొదలైనవారు అందరు ఆనందిస్తారు. మాయామయ వరాహ ఘుర్ఘుర్ఘురారావం

బ్రహ్మాండ కోటర పరిస్ఫోటనం చేయగా విని జనతపసత్యలోక నివాసులైన మునులు వేదమంత్రాలతో వినుతించారు. ఆ స్వామి సత్పురుషపాలనదయాపరుడు కనుక దిగ్గజేంద్రలీలావినోదుడై ఆనందంతో భూమి ఉద్ధరణకు పూనుకొంటాడు.

ఆ దేవుడి ఆకారాన్ని పోతన భక్తితాత్పర్యాలతో ఆనంద పారవశ్యంతో తృతీయస్కంధంలో 413, 415 పద్యాల్లో రచించాడు.

భూమిని రక్షించనున్న ఆ యజ్ఞవరాహం కర్కశమైన తన మెడ మీద జూలు విదిల్చింది. దాని వల్ల పుట్టిన వాయు వేగానికి మేఘమండలమంతా చెల్లాచెదురైపోయింది. చురకత్తి వలే మిక్కిలి వాడియైన ఆ వరాహమూర్తి గిట్టల కొనల తాకిడులకు అడుగున ఉన్న ఆదిశేషుడూ, దిగ్గజాలూ తల్లడిల్లి పోయాయి. ఆ యజ్ఞవరాహం కఠోరాలైన కరకుకోరల రాపిడివల్ల పుట్టిన అగ్నిజ్వాలలకు వెండికొండ కైలాసమూ, బంగారుకొండ మేరువూ, కరిగి ద్రవించి పోతాయేమో అనిపించింది. ఆ ఆదివరాహం భయంకరమూ, గంభీరమూ అయిన తన ఘుర్ఘురారావం వల్ల సముద్రాలన్నీ అల్లకల్లోలం అయ్యేటట్లు చేస్తున్నది. ఈ విధంగా ఆ మహావరాహం పొరలుతూ, పొంగుతూ, సంతోషంతో గంతులు వేస్తూ, రొప్పుతూ ఆకాశానికి ఎగురుతూ విజృంభిస్తూ మూతిబిగిస్తూ నేలను మూచూస్తూ- ఇలా అనేకవిధాలుగా ఊగుతూ చెలరేగుతూ ఉంది.

ఆ యజ్ఞవరాహం ఒకసారి పదునాల్గుభువనాలూ దొంతులుదొంతులుగా దొర్లిపడిపోయేటట్లు కొమ్ములతో చిమ్ముతుంది. మరోసారి తన మూపురమనే ఒరగల్లుతో పసిడి కాంతులు ప్రసరించేటట్లు మేరుపర్వతానికి రుద్దుకుంటుంది. ఇంకోసారి సప్తసముద్రాలజలాలు బురదలైపోయేటట్లు ఎగిరి గంతులు వేస్తూ తిరుగుతుంది. వేరొక్కసారి మిక్కిలి భయంకరంగా తోకను తిప్పడంవల్ల పుట్టిన గాలితాకిడికి ఆకాశం దద్దరిల్లి బ్రద్దలయ్యేట్లు చేస్తుంది. ఒక్కొక్కమాటు కనుగొనల్లో అగ్నికణాలు కురిపిస్తూ మహాభయంకరంగా కన్పిస్తుంది. ఇంకొక్కమాటు మహాయోగులకు సేవ్యమైన భవ్యదివ్యవైభవంతో శోభిల్లుతుంది.

మహాప్రళయకాలంలో మహావిష్ణువు నిద్రలో ఉండగా జలంలో ఉన్న భూమి రసాతలంలోకి చేరింది. దానిని ఉద్ధరించడానికి శ్రీహరి యజ్ఞవరాహరూపం ధరించి సముద్రంలో ప్రవేశించాడు. వాడియై వంకరలు తిరిగిన కత్తుల వంటి గిట్టల కొనలతో సముద్రజలాలను చెల్లాచెదరు చేస్తూ పాతాళం వరకు వెళ్లి అక్కడ భూమిని చూచాడు. సముద్రంలో ఉన్న ఒక రాక్షసుడు ఆ యజ్ఞవరాహాన్ని ఎదుర్కొన్నాడు. మృగరాజు గజరాజును మట్టుపెట్టినట్లు ఆ వరాహమూర్తి తన వాడి కోరల అంచులతో ఆ రాక్షసుణ్ణి తుదముట్టించాడు. ఆ తర్వాత ఆ వరాహమూర్తి తన కోర చివర భూమిని ధరించి సముద్రంలో నుండి బయటకు వచ్చాడు.

అటువంటి యజ్ఞవరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతించారు. పోతనభాగవతంలో ఈ స్తుతి తృతీయస్కంధం 422వ పద్యం నుండి 439వ పద్యం వరకు ఉంది.

ప్రబంధయుగానికి యుగపురుషుడు, నాయకమణి సాహితీసమరాంగన సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో వరాహావతారవర్ణన ఈ క్రింది విధంగా చేశాడు.

**చ॥ ఒక మఱి బుద్దగింప విలయోదకముల్పయి కుబ్బి, చిప్ప ప్ర**
**చ్చుకొని, మహాప్రవీధిజన, సూకరతన్మెయి వెంచి, వెండి క్రిం**
**దికి గయిప్రాలు తత్సలీల నిర్మలధార నధః పరిస్ఫుర**
**త్ప్రకృతికి నీయజాండమునె బంగారుముంగఅగా నొనర్పవే**


**(చతుర్థాశ్వాసం-21వ పద్యం)**

ధరణిదేవుల రామయమంత్రి దశావతారాల్ని ఒక ప్రబంధంగా నిర్మించాడు. ఒక్కొక్క అవతారచరిత్రను ఒక్కొక్క రమణీయప్రబంధంగా భక్తిరసాత్మకంగా రామయమంత్రి తీర్చి దిద్ది అన్నిటినీ కలిపి ఏకప్రబంధంగా నిర్మించాడు. ఇందులో శ్రీవరాహస్వామి స్తుతి అత్యద్భుతంగా ఉంటుంది.

తాళ్లపాక అన్నమయ్యవరాహావతారవిషయాన్ని తన సంకీర్తనలలో అక్కడక్కడ ప్రస్తావించాడు. ఉదాహరణకు **"వొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి"** అని ఒక సంకీర్తనలో చెప్పాడు. "చేపట్టి" అనే పదంలో నిగూఢార్థముంది. భూమిని చేపట్టి అనగా భూదేవిని వివాహం చేసికొని అని అర్థం.

ఇలా మన తెలుగుసాహిత్యం శ్రీఆదివరాహమూర్తి వైభవాన్ని వేనోళ్ల కీర్తించింది!

ఆగష్టు 31,
వినాయకచవితి



# గణపతి నేర్పే పాఠాలెన్నో...

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 88975 47548

బొజ్జగణపయ్య... తొలిపూజలందుకునే దైవం. ఏ పని ప్రారంభించినా ముందుగా గణపతి పూజ చెయ్యాల్సిందే. తలచిన పని నిర్విఘ్నంగా సాగాలంటే ఆ విఘ్ననాయకుడి అనుగ్రహం తప్పనిసరి. అమ్మచేతిలో పసుపుముద్దగా అవతరించి, నేటికీ పసుపు గణపతిగా మనందరి పూజలందుకుంటున్న గణపతి స్వామి కేవలం విఘ్ననివారకుడు మాత్రమే కాదు... విద్యా ప్రదాత కూడా. అందుకే, *'కోరినవిద్యలకెల్ల ఒజ్జయై యుండెడి పార్వతీ తనయ, ఓయి! గణాధిప నీకు మ్రొక్కెదన్'* అంటూ భక్తకోటి గణపతిదేవరకు అంజలి ఘటిస్తుంది. అంతేకాదు... ఆ స్వామినుంచి నేర్చుకోవాల్సిన అంశాలు మరెన్నో ఉన్నాయి.

## చెదరని కర్తవ్యదీక్ష

పుట్టీపుట్టగానే మహత్తరమైన కార్యభారం వినాయకుడి మీద పడింది. తండ్రి శివయ్య రాక్షససంహారం చేసి విజయుడై వస్తున్నాడు. భర్తకు విజయహారతులు ఇవ్వటం కోసం తయారవుతూ స్నానానికి వెళ్లింది తల్లి పార్వతీదేవి. ఈలోగా వాకిలివద్ద కాపలా ఉండమని చెప్పింది. అమ్మ ఆజ్ఞను శిరసావహించి, వాకిలివద్ద కాపలాగా నిలబడ్డాడు వినాయకుడు. ఇంతలో, శివయ్య రానే వచ్చాడు. రావటంతోనే నేరుగా ఇంట్లోకి ప్రవేశించబోయాడు. నా ఆజ్ఞ లేకుండా లోపలికి వెళ్తున్నావు. ఎవరయ్యా నీవు? నీకు ప్రవేశం లేదంటూ అడ్డగించాడు పుత్రుడు. వచ్చినవాడు తన తండ్రే అని తెలియదు బాలగణపయ్యకు.

ఆయనకు తెలిసిందల్లా అమ్మమాట వినటమే. తల్లి ఆజ్ఞ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడటమే. సాక్షాత్తు తండ్రే వచ్చినా అడ్డగించాడు. పాపం! శివయ్యకూ అతడు తన బిడ్డే అని తెలియదు. తన ఇంట్లోకి వెళ్లద్దంటూ తననే అడ్డగిస్తున్నాడనే కోపంతో బాలుడి శిరస్సు ఖండించాడు. ఘోరం జరిగింది. బిడ్డను తండ్రే వధించాడు. కర్తవ్యనిర్వహణలో ప్రాణాలకు తెగించి అయినా సరే విధి నిర్వహణ చెయ్యాలనే సందేశాన్ని గణపయ్య మనకు ఈవిధంగా అందించాడు. అందులోనూ, తల్లి ఆజ్ఞను పాటించటం కోసం తండ్రిని సైతం ఎదిరించాడు. మాతృభక్తి కలిగి ఉండటమే కాదు, మాతృవాక్య పరిపాలన ఎలా చెయ్యాలో, తల్లి పట్ల ఎంతటి విధేయత కలిగిఉండాలో ఆచరించి చూపించాడు స్వామి. ఎటువంటి కష్టాలు వచ్చినా కర్తవ్యాన్ని మరిచిపోకూడదు. గణపయ్య మనకు నేర్పిస్తున్న మొదటిపాఠం ఇది.

## తల్లిదండ్రుల మీద భక్తి

గణాధిపతి పదవి కోసం అన్నదమ్ములమధ్య పోటీ ప్రారంభమైంది. మయూరవాహనాన్ని అధిష్ఠించి స్కందుడు ముక్కోటితీర్థాల్లో పుణ్యస్నానం చెయ్యటానికి బయల్దేరాడు అన్న కన్నా ముందుగా. ఇక, గణపయ్య పరిస్థితి... భారీవిగ్రహం కలవాడు కావటం వల్ల వేగంగా కదల్లేడు. పోనీ, వాహనం మీద వెళ్లొచ్చు కదా అంటే, ఆ వాహనమేమో మూషికమైంది. అంతపెద్ద లంబోదరుడు ఇంత చిన్నవాహనాన్ని ఎక్కి, ఎలా ముల్లోకాలు తిరిగి రాగలడు?

మరి, సమస్య ఎలా పరిష్కారం అవుతుంది? తాను విజయం సాధించటం ఎట్లా? గణపయ్య ఆలోచించాడు. తల్లి

దం(డులు సకల దేవతాస్వరూపులని చదువుకున్నాడు. ఆ సంగతి జ్ఞాపకం వచ్చింది. చెక్కుచెదరనిభక్తితో తల్లిదం(డులను సేవించాడు. వారికి (ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. అంతే...! ముల్లోకాల్లోని పుణ్యతీర్థాల్లో స్నానం చేసిన ఫలితాన్ని పొందాడు. ఈ ఘట్టంద్వారా అద్భుతమైన సందేశం మనకు అందుతుంది.

అమ్మానాన్నలమీద (పేమ ఉందంటే సరిపోదు. ఆ విశ్వాసం ఆచరణలోకి రావాలి. వారు దైవాలనే విషయంలో రెండో అభి(ప్రాయానికి తావు ఇవ్వకూడదు. (త్రికరణశుద్ధిగా మాతాపితరులను సేవించాలి. ఆ ఫలితంగా ఎంత గొప్ప విజయం లభిస్తుందో తాను స్వయంగా ఆచరించి, అనుభవించి చూపించాడు గణపయ్య.

అంతేకాదు... కష్టాలు ఎదురైన సమయంలో మన ఆలోచన ఎలా ఉండాలో కూడా ఈ ఇతివృత్తం మనకు బోధిస్తుంది. సాధారణంగా అసాధ్యమైన కష్టం గణపతికి వచ్చింది. ఊహించని కష్టానికి కుంగిపోలేదు గణపతి. కార్యాన్ని ఎలా సఫలం చెయ్యాలో ఆలోచించాడు. తనకు ఉన్న పరిమితమైన వనరుల్ని వినియోగించుకుని విజయంసాధించాడు. ఈ నేర్పరితనం, ఆలోచనల్లో వైవిధ్యం, వైదుష్యం, సమయస్ఫూర్తి... ఇవన్నీ గణపయ్య నేర్పే రెండోపాఠం.

## ఆత్మసౌందర్యం, క్షమాగుణం


గణాధిపత్యం లభించాక, ముల్లోకాలనుంచి భక్తులు సమర్పించిన (ప్రసాదాలు ఆరగించి, ఆయాసపడుతూ, సంధ్యా సమయంలో తల్లిదం(డులకు నమస్కరించటానికి బయల్దేరాడు గణపయ్య. విపరీతమైన కాయం కావటంతో చాలా ఇబ్బంది పడుతున్నాడు. అది చూసి నవ్వాడు శివుడి తలపై ఉన్న చం(దుడు. ఫలితంగా, అతడిని చూసిన వారికి నీలాపనిందలు వస్తాయనే శాపం పొందాడు. ఆ తర్వాత శాపానికి ఉపసంహారం కూడా వచ్చింది. అది వేరే సంగతి.


చం(దుడు చేసిన అపహాస్యం అతడికే చేటు తెచ్చింది. కానీ, గణపయ్యను లోకారాధ్యుడిని చేసింది. ఇందుకు కారణం, గణపతి ఆత్మసౌందర్యం. భౌతికరూపానికి నిందుదనం చేకూర్చేది ఆత్మసౌందర్యం మా(తమే అనే నానుడిని అక్షరసత్యం చేసి, నిరూపించాడు ఆ స్వామి. తనను అపహాస్యం చేసిన చం(దుడిని క్షమించి, శాపాన్ని ఉపసంహరించాడు. అతడిని ఒక్కమాట కూడా దూషించలేదు. సమున్నతమైన క్షమాగుణం (ప్రదర్శించాడు. మనిషి అలవర్చుకోవాల్సిన ఉత్తమగుణాన్ని పాఠంగా ఈ ఇతివృత్తం ద్వారా అందించాడు లంబోదరుడు.

విద్యవల్ల మనిషికి అధికసౌందర్యం లభిస్తుందని ఆర్ష వాక్యం. అన్ని విద్యలకు అధిపతిగా ఉన్న గణపతి అనంతమైన సౌందర్యానికి నిలయంగా మారాడు. మనిషికి గౌరవ మర్యాదలు, ఆదరణ లభించేవి అతని వ్యక్తిత్వంవల్ల మా(తమే గానీ, భౌతికసౌందర్యంవల్ల కావనే పాఠాన్ని ఈవిధంగా బోధించాడు గజముఖదేవుడు.

## దీక్ష, దక్షత

వ్యాసమహర్షి మహాభారతాన్ని రచించాలని సంకల్పించాడు. కానీ, తాను శ్లోకం చెప్పే వేగాన్ని అందుకుని రాయగలిగిన (వ్రాయసకాడు కావాలని ఆలోచించాడు. గణపయ్య కన్నా వేగంగా రాయగలిగిన వ్యక్తి మరొకడు లేడని అందరూ తీర్మానించారు. గణపతి కూడా 'సరే' అన్నాడు. అయితే, వ్యాసుడు ఒక షరతుపెట్టాడు. నేను చెప్పిన (ప్రతిశ్లోకాన్నీ పూర్తిగా





అర్థం చేసుకున్న తర్వాతనే రాయాలన్నాడు. ఒప్పుకున్నాడు గణపయ్య. వ్యాసుడు చెబుతున్నాడు. గణపయ్య రాస్తున్నాడు. పంచమ వేదమైన మహాభారతం అవతరించింది. జాతికి మహోపకారం జరిగింది. ఇంతటి ఘనత వెనకాల గణపయ్య అందించిన స్ఫూర్తిని మనం అందుకోకపోతే గణపతి ఆరాధనకు అర్థం ఉండదు. మహాభారతరచన ఒక మహాయజ్ఞం. తనువు, మనసు, బుద్ధి... అన్నీ ఏకకాలంలో ఏకీకృతంగా పనిచెయ్యాలి. ఏమాత్రం ఏమరుపాటు పనికిరాదు. ఏ చిన్నపొరపాటు జరిగినా మహోన్నతసంకల్పం వీగిపోతుంది. ఇదంతా జరగా లంటే, మనిషికి సన్నద్ధత కావాలి. తాను ఈ పని చెయ్యగలను అనే ధృఢదీక్షకావాలి. పని మొదలు పెట్టాక వచ్చే ఆటంకాలు చూసి బెదరిపోకూడదు. చివరదాకా నిలవాలి. అప్పుడే గొప్ప విజయాన్ని సాధించటం కుదురుతుంది. మహాభారతరచన ద్వారా గణపతి నేర్పించే పాఠం ఇదే.

### వినయం, పాత్రత, విజ్ఞత

షరతుప్రకారం పోటీలో గెలిచిన వినాయకుడికి గణాధి పత్యం ఇచ్చాడు పరమేశ్వరుడు. అఖండమైనశక్తి సామర్థ్యాలకు తోడు ముల్లోకాలను శాసించే అధికారం గణపతికి లభించింది. కానీ, ఆయన ఏమాత్రం పొంగిపోలేదు. ఒక్క సారిగా లభించిన పదవీగర్వానికి పట్టుబడలేదు.


లోకాల్ని శాసించే అవకాశం వచ్చినా, తండ్రి ఆజ్ఞకు బద్ధుడై నిలిచాడు. గణపయ్యనుంచి మనం నేర్చుకోవాల్సిన గొప్పపాఠం ఇది. కొద్దిపాటి పాండిత్యానికి, అధికారానికి విర్రవీగేలక్షణం చాలామందిలో ఉంటుంది. దీనివల్ల అనర్థమే కానీ, ప్రయోజనం లేదని గణపయ్య ఆరాధన ద్వారా మనకు అవగతమవుతుంది. గణపయ్య తన తొండాన్ని పైకి తిప్పి, ముడుచుకుని ఉంటాడు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే సందేశాన్ని ఆచరణాత్మకంగా బోధించాడు గణపతిస్వామి.

## పిల్లలకెంతో ఇష్టం...

**వినాయకుడు పిల్లల దేవుడిగా ప్రాచుర్యం పొందాడు. వినాయకచవితి వస్తోందంటే ఆ రోజుల్లో పిల్లల ఉత్సాహం చెప్పనలవి కాదు. డొంకల్లో దొరికే గరికనుండి శివాలయాల్లో దొరికే మారేడు దళాల దాక గణపతికి అన్నీ ఇష్టమే! పిల్లలు తెల్లారకుండానే గోనెసంచులతో పత్రి వేటకు బయలుదేరేవారు. కొండంత దేవుడికి కొండంత పత్రి పెట్టాలని తాపత్రయ పడేవయసది. అన్నిరకాల ఆకులుపోగయ్యేదాక విశ్రమించేవారు కాదు. చెరువుల్లో తామరపూలు సాధించడం, పాలవెల్లి తయారు చేయడం గొప్పగా భావించేవాళ్లు. రంగుకాగితాలతో వినాయకుడికి ముత్యాల గొడుగు చేసేవారు. బంకమన్నుతో తయారు చేసిన వినాయకమూర్తులను తెచ్చుకోవడం లేదా స్వయంగా తయారుచేసుకోవడం చేసేవారు. ఆ బొమ్మలకు పసుపువస్త్రాలు కట్టడం, ఎత్తుపీట మీద ఉంచి బోలెడు అలంకారాలు చేయడం ఇదంతా ఒక ఎత్తు. వంటింట్లో కుడుములు, ఉండ్రాళ్లు తల్లులు సిద్ధం చేయడం మరో ఎత్తు. అసలు పూజకంటే ఇవే ఎక్కువ సేపు పట్టేవి. ఇవన్నీ కలిస్తేనే పూజ. వినాయకుడంటే విఘ్నాలు పోగొట్టి జ్ఞానసంపద ఇచ్చేవాడు. అందుకనే వినాయకుడి పూజలో పిల్లలు పలకలు, పుస్తకాలు పెడతారు. గుంజీలు తీసి గణపతిని తమకు బాగా చదువు అబ్బేలా చేయమని మొక్కుకుంటారు.**

# ఏ లక్ష్మి కి... పూజ ఎప్పుడెప్పుడు?

- బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు




ప్రతి సంవత్సరం మనింటికి ధాన్యం వచ్చిన వేళ ఇంటి లోనికి లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ చేసేపూజ **'శుద్ధలక్ష్మీపూజ'**. ధాన్యం పండిం చేందుకోసం తెలియక కొన్ని క్రిముల్నీ, కీటకాల్నీ, తెలిసి కొన్ని క్రిమికీటకాల్నీ, జంతువుల్నీ సంహరిం చిన కారణంగా ఆ దోషం తొలగడానికీ– ఈ వచ్చిన ధాన్యసంపదశుద్ధం కావడానికీ చేసే పూజ ఇది. దీన్ని కొందరు మకర సంక్రాంతి నాడు చేస్తారు.

సంన్యసించాలని కోరుకున్నవాళ్లూ, సంన్యాసులైన వాళ్లూ మోక్షమనే సంపదని కోరుకుంటూ ప్రతి సంవత్సరం తొలిఏకాదశి (ఆషాఢశుద్ధఏకాదశి)అంటే దక్షిణాయనం రాగానే వచ్చే మొదటి ఏకాదశినాడు చేసే పూజ **'మోక్షలక్ష్మీపూజ'**.

ఎదుటివాళ్ల రాజ్యాన్ని జయించాలనే ఉద్దేశ్యంతో రాజులు యుద్ధాలకు బయలుదేరే ముందు చేసే పూజ **'జయలక్ష్మీపూజ'**.

ఆశ్వయుజమాసంలో అంటే దసరాపదిరోజుల్లో మూలానక్షత్రం వచ్చిన రోజున విద్యార్థులైనవాళ్లు తమకు విద్యాభివృద్ధి కలగాలనీ, విద్యాధికులైన వాళ్లు తమ తమ ప్రతిభ గుర్తింపుకు రావాలనీ సరస్వతీదేవిని ఉద్దేశించి చేసే విద్యాలక్ష్మీ పూజ **'సరస్వతీపూజ'**.

దీపావళినాడు ధనం అభివృద్ధి చెందాలని చేసే పూజ **'శ్రీలక్ష్మీపూజ'**.

ఇక, అనుకున్న అన్ని కోరికలూ వరాలరూపంగా సిద్ధించాలని ప్రార్థిస్తూ శ్రావణమాసంలో పూర్ణిమకు ముందొచ్చే శుక్రవారం నాడు చేసే పూజ **'వరలక్ష్మీపూజ'**.

ఈ వరలక్ష్మీపూజని ఏదో ఒక్కమారు మాత్రమే కాకుండా, జీవితాంతమూ నేను చేస్తూనే ఉంటానని మొదటిసారి పూజలో ప్రమాణం చేసిన కారణంగా ఈ వరలక్ష్మీపూజే వరలక్ష్మీవ్రతంగా' అయిందన్నమాట. అలాంటి ఈ వ్రతంలో ఏం చెయ్యాలో తెలుసుకుందాం!

## షోడశోపచారపూజ

ఇది ఓ వ్రతం కాబట్టి శాశ్వతంగా ఉండే విగ్రహానికి కాకండా, బిందెమీద కొబ్బరికాయని పెట్టి, చక్కగా అలంకరించి కూచున్న లక్ష్మీదేవిలా ఓ విగ్రహాన్ని సిద్ధం చేసి, ఆమెని ఒక పక్కన ఉంచాలి.

ఇంటికి నట్టనడిమి భాగంలో మంచిపీటని వేసి నూతన వస్త్రాన్ని పరిచి బియ్యాన్ని పోసి నలుచదరంగా చేసి దాని మీద పసుపు వినాయకుణ్ణి పెట్టి గణపతి పూజని పంచోపచారాలతో (స్నానం, పూజ, నైవేద్యం, ప్రదక్షిణం, నమస్కారం) ముగిం చాలి. ఇక్కడినుండి శ్రీవరలక్ష్మీవ్రతం ప్రారంభమౌతుంది. వినాయకునికి ఉద్వాసన చెప్పాక (ఆయన ప్రతిమని పక్కగా నైఋతిదిశకు జరిపాక) పీటనిండుగా పద్మపురేకులని గాని,

పంచపల్లవాలని (మర్రి, మామిడి, మేడి, రావి, జువ్వి చెట్ల చిగురుటాకులు)గాని వేయాలి. ఇక్కడ ఆ లక్ష్మీదేవిని కూచోబెట్ట బోతున్నామన్నమాట.

## షోడశోపచారపూజలో... (16 విధాల సేవలు)

**01)ఆవాహనం–** మొదటి ఉపచారం ఆవాహన. మనం ధ్యానించుకునేందుకు వీలుగా ఏ ఆకారమూ లేని ఆ పరమాత్మ స్వరూపానికి మనలాటి ఆకారాన్ని కల్పించి దానిలోనికి 'ఆవాహన' చెయ్యడం దీని భావం. ఆవాహనమంత్రం చదివామంటే మనం సిద్ధం చేసిన. ఆ విగ్రహంలోనికి మనం ధ్యానించబోయే ఆ తల్లి రూపం చేరినట్టు భావించాలి.

**02) 'ఆసనం'–** అప్పుడు ఆ తల్లికి ఆసనాన్ని సమర్పించాలి. పద్మపురేకులతో లేదా పంచపల్లవాలున్న ఆసనం ఆమెకిష్టం. "ఎప్పుడూ శ్రీమహావిష్ణువు వక్షఃస్థలమే నివాసంగా ఉన్న తల్లీ! ఈ ఆసనాన్ని అలకరించు" అనే అర్థమున్న మంత్రాన్ని చదివి ఆమెను ఈ పీట మీద భక్తిశ్రద్ధలతో కూచోబెడతాం. 'నట్టింట సిరి' ఉండడం అంటే ఇదే.

**03)పాద్యం–** "ఎప్పుడూ కల్పవృక్షపుష్పాల మీదనే నడిచేతల్లీ! నీ సుకుమారపాదాలను మా భూలోకజలంతో కడుగుతున్నా" నంటూ పాదాలను కడగడం పాద్యం.

**04)అర్ఘ్యం–** "దేవతాస్త్రీల నందరినీ ఆశీర్వదించే చేతులతోనూ, బ్రహ్మఇంద్ర రుద్రులక్కూడ సంపదలను అనుగ్రహించే హస్తాలతో ప్రకాశించే తల్లీ! నీ హస్తాలకు పవిత్ర జలాన్ని సమర్పిస్తున్నా'నంటూ గౌరవపూర్వకంగా జలాన్నియ్యడం అర్ఘ్యం.

**05)ఆచమనం.** 'శుద్ధమైన ఆకాశగంగాజలాన్ని మాత్రమే స్వీకరించే నీకు, నా యథాశక్తి లభించిన జలాన్ని ఇస్తున్నా'నంటూ తాగడానికి ఆమెకు అందిచ్చే శుద్ధజలం 'ఆచమనం'.

మనశరీరాలన్నీ నీళ్లు ప్రధానంగా ఉండి జీవించే శరీరాలు. ఆ తల్లిని మనలాంటి అమ్మయ శరీరంలోనికి ఆవాహన చేశాం కాబట్టి, శరీరంలో దిగువభాగమైన పాదాలకీ, మధ్యభాగమైన హస్తాలకీ ఊర్ధ్వభాగమైన ముఖానికీ జలాన్ని అందిస్తూ ఆ లక్ష్మీదేవిని కూడ మనలో ఉన్న ఒక స్త్రీగా భావిస్తూ పూజిస్తున్నామన్నమాట.

**06)అభిషేకం (లేదా) స్నానం–** ఇటువైపూ అటు వైపూ చెరొక ఏనుగూ, వాటి తుండాల్లో మానవ సరోవరజలం నిండిన బంగారుకుండలూ, వాటితో నిత్యాభిషేకాన్ని చేయించుకునే తల్లీ! నాకు లభించినంతలో ఉత్తమజలంతో అభిషేకిస్తున్నా' నంటూ స్నానాన్ని చేయించాలి తల్లికి.

**07)వస్త్రం–** మరింత తెల్లగా ఉండే వస్త్రాన్ని సమర్పిస్తూ 'ఏ విధమైన హింసనీ చేయకుండా లభించే అహింసా పట్టువస్త్రాలను ధరించే తల్లీ! దీన్ని స్వీకరించు' అని ప్రార్థించాలి.

**08)ఉపవీతం–** పురుషదేవతలకైతే యజ్ఞోపవీతాన్నిస్తారు. స్త్రీ దేవతలకైతే ఉత్తరీయాన్నిస్తారు. ఉత్తరీయమంటే భుజంమీద కప్పుకునే మరో వస్త్రమని అర్థం. ప్రాచీన దేవతా విగ్రహాలను పరిశీలిస్తే భుజం మీద ఉత్తరీయాన్ని చెక్కినట్లు కన్పిస్తాయి.

**09)గంధ– పుష్ప– అక్షతలు–** ఆ తల్లికి గంధాన్ని పూయడం లేదా చల్లడం. పూసినప్పుడున్న దానికంటే ఆరిన కొద్దీ సువాసన నిస్తుంది గంధం. అలంకరించినప్పటి కంటే కాలక్రమంలో వాడిపోతూ ఉంటాయి పుష్పాలు. ఇలా గంధంలా పెరగడం, అలా పుషాల్లా తరగడం కాక శాశ్వతంగా ఉండేవి 'అ–క్షతలు'. అక్షతలని రెండు విధాలుగా వేస్తారు. తమకంటే చిన్నవాళ్లని ఆశీర్వదిస్తూ తలమీదా, దేవతలని పూజిస్తూ పాదాల మీదాను. ఇక్కడ పాదాలమీద వేయాలి.

**10)అష్టోత్తర శతనామ– అంగ– తోరగ్రంథి పూజలు.** ఆ తల్లి గొప్పదనాన్ని వర్ణిస్తూ ఆమె మనకు కలిగించే నూట ఎనిమిది ప్రయోజనాలనూ వివరించే పూజ.

దీని మీదిది 'తోరగ్రంథిపూజ'. ఏ లక్ష్మీదేవిని మనమిక్కడ ఆరాధించామో ఆ తల్లిని మనలా భావిస్తూ, ఆ శరీరం ఆకారంలోనే నిలువుగా దారాలనుంచి వాటిని ఏడుచోట్ల ముడి వేస్తూ, ప్రతిముడిలోనూ ఓపువ్వును ఉంచి ఆ తోరానికి పూజను చేసి, కట్టుకుంటాం చేతికి. అంటే, ఏ లక్ష్మికి ఈ వరలక్ష్మీవ్రతం అయ్యాక ఉద్వాసన (వీడ్కోలు) చెప్తామో, అంతతో ఈ వరలక్ష్మీ వ్రతం ముగియలేదనీ, ప్రతి సంవత్సరం నేను చేస్తూనే ఉంటాను



రాతి నాతి చేసిన శ్రీరామ! రామ!

అని చెప్పడమన్నమాట. ఆ లక్ష్మీరూపం ఈ తోరంతో కూడిన గ్రంథుల్లో (శరీరానికున్న ముడులలో) ఉందనీ, ఆ కారణంగా లక్ష్మీదేవి నా కుడిచేతి మణికట్టుకి నిత్యం ఉందంటే ఆమె సన్నిహితంగా నాకుందన్నమాటేనని భావించడం దీని తాత్పర్య మన్నమాట.

**ఇప్పుడు చెప్పుకోవాల్సింది వ్రతకథ.** మగధదేశంలోని 'కుండిన' అనే నగరంలో చారుమతి అనే ఆమెకు కలలో లక్ష్మీ దేవి కన్పించడం– శ్రావణంలో పూర్ణిమకు ముందొచ్చే శుక్ర వారంనాడు వరలక్ష్మీపూజను చేసుకోవాల్సిందని ఆమెకు చెప్పడం, తానొక్కతె మాత్రమే ఆ ఆనందాన్ని అనుభవించడం కంటే పదిమందితో పాలుపంచుకోవాలని భక్తిశ్రద్ధలతో తోటి ముత్తైదువులతో కలిసి ఆమె పూజచేయడం, పూజానంతరం ఒక్కో ప్రదక్షిణానికీ ఒక్కొక్కటి చొప్పున మూడుప్రదక్షిణాల్లోనూ క్రమంగా బంగారుగజ్జెలు, హస్తకంకణాలూ, సర్వాభరణాలూ వాళ్లందరికీ లభించడం– ప్రతి సంవత్సరం ఈ పూజను చేస్తూ దీన్ని ఓ 'వ్రతం'గా మార్చుకోవాలని వాళ్లంతా అనుకోవడమనేదే వ్రతకథ.

ఒక్కరేకాకండా పదిమంది కలిసి పూజ చేసుకోవడంలో ఓ ఆనందం, అంతా ఒక్కచోట కలిసి భుజించడంలో ఓ సంతోషం, అలంకరించుకున్న అందర్నీ అందరూ చూసు కోవడం, పలకరించుకోవడంలో ఓ ధైర్యవిధానం, మానసిక ప్రశాంతతా అన్నీ లభిస్తాయి స్త్రీలకు ఈ వ్రతం వంకతో.

షోడశ(16) ఉపచారాల్లో వ్రతకథ భాగం కాదు. కాబట్టి కథ అయ్యాక దేవతకిచ్చే **ధూపం, దీపం, నైవేద్యం, తాంబూలం అనేవి క్రమంగా పదకొండు నుండి పధ్నాలుగు వరకూ ఉండే ఉపచారాలు అవుతాయి. నీరాజన, మంత్ర పుష్పాలు రెండూ కలిపి పదిహేనవ ఉపచారం**

తాను ఆరిపోతూ వెలుగును ప్రసాదించేదీ, అమ్మకున్న ముఖసౌందర్యాన్ని ఇనుమడింపచేస్తూండేదీ, తనలో ఉన్న పరమాత్మను దర్శించాలని చెప్పేదీ, తిరిగి పై సంవత్సరం తప్పక పూజను చేసుకోవాలనే బుద్ధిని కల్గించేదీ, క్రిములను హరించి సువాసనను నింపేదీ నీరాజనం. కర్పూరంలాగే, వ్యక్తి ఆయుష్యం తరుగుతున్నా తన ప్రకాశంలాగానే వ్యక్తికున్న ప్రతిభ కాంతి మంతంగా వెలుగుతూ ఉండాలనేది దీని భావం.

ఇప్పటివరకూ పూజచేసిన ఏ పరమాత్మస్వరూపం ఓ దేవిగా మన ముందుందో ఆ రూపం మన శరీరంలోనే ఉందంటూ వివరించి చెప్పేది మంత్రపుష్పం. ఇక్కడితో పది హేను ఉపచారాలు పూర్తయ్యాయి.

ఇంతటి దేవి మనలోనే ఉన్నప్పుడు మనం ఆమెకు భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణం చేయాలనుకుంటూ చేసేదే **ఆత్మ ప్రదక్షిణంతో కూడిన నమస్కారం** (తన చుట్టూ తానూ తిరు గుతూ నమస్కరిస్తూ ఉండడం). **ఇది పదహారవ ఉపచారం.**

చివరకు వాయనాన్నిస్తూ "ఓ తోటి ముత్తైదువా! ఈ వ్రతమంతా అయ్యాక నువ్వూ లక్ష్మివే. నేనూ లక్ష్మినే. మనందరి లోనూ లక్ష్మి ఉందని గ్రహించాను. మన చేతి తోరాల్లో లక్ష్మి ఉండి మనకు శుభాలను కల్గిస్తుందని అర్థం చేసుకున్నాను. కాబట్టి దీన్ని లక్ష్మీస్వరూపిణివై స్వీకరించు!" అనే అర్థం ఉన్న ఈ శ్లోకాన్ని చదవాలి.

**ఇందిరా ప్రతి గృహ్ణాతి ఇందిరా వై దదాతి చ ।**
**ఇందిరా తారికా ద్వాభ్యామ్ ఇందిరాయై నమో నమః ॥**

అఖండలక్ష్మీప్రాప్తిరస్తు, సమస్త సన్మంగళాని భవంతు.

## వైకుంఠపాళి

### :: 79 – సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 తి | | 2 గో | ద | | 3 కా | 4 శి | | 5 కా |
| రు | | వు | | 6 ప్ర | | క్ష | | ళ |
| 7 మ | ది | | 8 వి | కృ | తి | | 9 ఊ | హ |
| ల | | 10 కా | | తి | | 11 వ్యా | | స్తి |
| | 12 న | వ | మి | | 13 వి | సు | గు | |
| 14 అం | | డి | | 15 ఉ | | డు | | 16 చై |
| 17 దె | స | | 18 దీ | ప | ము | | 19 యా | త్ర |
| | | 20 జ | | కా | | 21 తా | | ము |
| | 22 అ | లం | కా | రం | | 23 ఫం | కం | |

# తిరువెళ్ళక్కుళై (శ్వేతగిరి)

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

**108** దివ్యదేశాలలో ఒకటి తిరువెళ్ళక్కుళై. ఈ క్షేత్రానికి శ్వేతగిరి అని కూడా పేరు. శ్రీరంగంనుండి ఉత్తమర్‌కోయిల్ మీదుగా తిరుచ్చిఉరయూర్ బస్సుమార్గంలో 15 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. ఈ దేవాలయం మూడు అద్భుతమైన పెద్దప్రాకారాలతో, సుమారు పదిఎకరాలస్థలంలో, కావేరీ తీర్థనదీసమీపంలో ఉంది.


ఇక్కడ వేంచేసి ఉన్నటువంటి మూలమూర్తి పుండరీకాక్షుడు. ఈయననే శెన్దామరైకణ్ణన్ అని కూడా అంటారు. పుండరీకాక్షుడు తూర్పుదిక్కున నిలుచున్న భంగిమలో భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. అమ్మవారైన శెన్బగవల్లికి ప్రత్యేకసన్నిధి కలదు. అమ్మవారికి పంకజవల్లి అనేనామం కూడా ఉంది. ఈ దేవాలయంలో దివ్యగంధం, క్షీరపుష్కరణి, కుశతీర్థం, చక్రతీర్థం, పుష్కలతీర్థం, పద్మతీర్థం, వరాహ, మణికర్ణికా అనే పవిత్రమైన తీర్థాలున్నాయి.

## స్థలపురాణం

త్రేతాయుగంలోని శిబిచక్రవర్తి రావణాసురుణ్ణి తన అధీనంలో పెట్టుకోవడానికి పెద్దసైన్యంతో లంకానగరానికి వెళ్తున్న సమయంలో ఈ దివ్యదేశసమీపంలో ఉన్న నీలికా అనే వనాన్ని చేరారు. అక్కడ వెండికొండను పోలినటువంటి ఒక తెల్లని వరాహం పరుగెత్తుతు కన్పించింది. ఆ వరాహాన్ని పట్టుకోవడానికి శిబి వెంటపడ్డాడు. ఆ వరాహం ఒక కలుగులోకి వెళ్లి అదృశ్యమయింది. ఆ సమయంలో అచ్చటే తపస్సు చేస్తున్న మార్కండేయమహర్షిని చూచి నమస్కరించాడు శిబిచక్రవర్తి. ఆ సమయంలోనే "నేను ఇక్కడే ఉన్నాను, ఈ పుట్టలోనే ఉన్నాను, మహాలక్ష్మికిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికే నేను ఈ భూలోకానికి వచ్చాను. అందువల్ల ఈ క్షేత్రంలో నిత్యవాసం చెయ్యాలని సంకల్పించుకున్నాను. నీవు ఈకోరికను పూర్తిచెయ్యి" అని భగవంతుడు అశరీరవాణిగా పలికాడు. ఈ శ్వేతవరాహ స్వరూపంలో ఉన్నది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అని నిర్ధారించుకుని శిబిచక్రవర్తి ఆ భగవంతుడికి చక్కటి దేవాలయాన్ని నిర్మించాలని సంకల్పించుకున్నాడు మార్కండేయ మహర్షియొక్క అనుగ్రహంతో. శిబిచక్రవర్తి పంకజవల్లీసమేతుడైన పుండరీకాక్షుని దివ్యదేవాలయాన్ని నిర్మించాడు. ఇది ఒక ఐతిహ్యం.

మరొకటి ముందు ఒక కాలంలో ఉత్తరదేశం నుండి సుమారు 3,700 బ్రాహ్మణులను మార్కండేయమహర్షి ఈ తిరువెళ్ళక్కుళై అనే దివ్యదేశానికి తీసుకువచ్చాడని, ఐతిహ్యం ఉంది. శిబిచక్రవర్తి ఆ బ్రాహ్మణులందరిని పోషించి వారి ద్వారా స్వామివారికికైంకర్యాలను చేయించాడని కూడా ఒక ఐతిహ్యం ఉంది. ఆ ఉత్తరదేశం నుండి బ్రాహ్మణులని ఎప్పుడైతే పిలుచుకొని రావడం జరిగిందో ఆ సమయంలో బ్రాహ్మణుడు ఒకరు దివంగతుడైనపుడు సాక్షాత్తు భగవంతుడే ఒక బ్రాహ్మణుడై ఇక్కడికి వచ్చినట్టుకూడా ఒక ఐతిహ్యం చెప్తున్నది. ఈ బ్రాహ్మణులనే తిరువెళ్ళక్కుళై వైష్ణవులు అని కూడా పిలుస్తుంటారు.

ఇచట అమ్మవారికి ఒక ప్రత్యేకత ఉంది. ఉత్సవకాలాదుల్లో మొట్టమొదటగా అమ్మవారు వేంచేపు చేస్తారు. వెనకాల భగవంతుడు వేంచేస్తాడు. ఇచ్చట దక్షిణాయన,



ఉత్తరాయణ ద్వారాలు ఉండడం విశేషం. మూలమూర్తి గర్భగృహానికి 18 మెట్లు ఉంటాయి. పద్దెనిమిది అనేది భగవద్గీత లోని 18 అధ్యాయాలకు ప్రతీకగా, తర్వాత ఉండే నాలుగుమెట్లు నాలుగువేదాలకు, దాని తర్వాత ఐదు మెట్లు పంచభూతాలకు ప్రతీకలు. తర్వాత ధ్వజస్తంభానికి పైన 8 మెట్లు అష్టాక్షర మహామంత్ర ప్రతిపాద్యంగాను, దాని తర్వాత 24 మెట్లు గాయత్రి మంత్రసారంగాను పెద్దలు చెబుతూంటారు. పుండరీకాక్ష స్వామి యొక్క ఆలయనిర్మాణంకోసం వేలాదిమంది బ్రాహ్మణులు గంగా, యమునా నదీతీరాల నుండి ఇక్కడకు వచ్చి నిరంతరవాసం చేసేటట్లు శిబిచక్రవర్తి ఏర్పాటు చేసినట్లుగా కూడా చెబుతారు. శ్వేతవరాహమూర్తిగా ఆ శిబిచక్రవర్తికి భగవంతుడు దర్శనభాగ్యాన్ని కలిగించాడు కనుక శ్వేతపురీనాథః అని, శ్వేతపురీక్షేత్రం అని కూడా వ్యవహరిస్తున్నారు. ఈ దివ్యస్థలంలో శ్రీదేవి భూదేవి సూర్యుడు, చంద్రుడు ఆదిశేషుడు మొదలగు వాళ్లందరూ కూడా మనుష్యరూపంగా వచ్చి దర్శనాన్ని పొందారట. ఈ దివ్యదేశాన్ని పెరియాళ్వార్లు తిరుమంగైయాళ్వార్లు వీరిరువురూ ఈ దివ్యక్షేత్రంలోనే అవతరించారు. వీరిరువురూ ఇక్కడి స్వామివారికి మంగళాశాసనం కూడా చేశారు. పంకజవల్లీనాయికాసమేత పుండరీకాక్షుణ్ణి దర్శించుకొని సకల సౌభాగ్యాలను పొందుదాం.



## శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు, తిరుపతి



**2022, సెప్టెంబరు 26 నుండి అక్టోబరు 05 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 26-09-22 | సోమ | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 27-09-22 | మంగళ | బంగారు తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 28-09-22 | బుధ | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 29-09-22 | గురు | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 30-09-22 | శుక్ర | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 01-10-22 | శని | పల్లకిలో మోహినీఅవతారం | గరుడవాహనం |
| 02-10-22 | ఆది | హనుమద్వాహనం<br>సా॥ వసంతోత్సవం,<br>సువర్ణరథరంగ డోలోత్సవం | గజవాహనం |
| 03-10-22 | సోమ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 04-10-22 | మంగళ | రథోత్సవం | అశ్వవాహనం |
| 05-10-22 | బుధ | పల్లకీ ఉత్సవం, తీర్థవారి, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

# హయగ్రీవావతార వైభవం

- డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు,
98850 03420

ఆగష్టు, 12
శ్రీహయగ్రీవ
జయంతి

భగవన్నామాలు అన్నీ ఆ భగవంతుని స్వరూప రూప గుణవిభవ లీలాదులను తెల్పుతున్నాయి. ఏ నామాన్ని మనం గమనించినా, అందులో భగవంతునకు సంబంధించిన రూపవిశేషం కానీ, స్వరూపవిశేషం కానీ, గుణవిశేషం కానీ, లేక లీలా విశేషం కానీ మనకు స్ఫురిస్తుంది. ఇలాంటి భగవన్నామాలను కీర్తించే స్తోత్రాలు అనేకం ఉన్నా, భీష్మాచార్యప్రణీతమైన శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం సాటిలేని ప్రసిద్ధిని పొందింది. ఇందులో ఉండే నామాలన్నీ భగవంతుని స్వరూపరూపగుణలీలాది విశేషాలను తెలియజేస్తున్నాయి. ఆ నామాలలో కొన్ని భగవంతుని అవతార విశేషాలను కూడా కీర్తిస్తున్నాయి. వాటిలో, ప్రస్తుతం, హయగ్రీవావతారాన్ని స్తుతించే నామాలను, వాటిలోని విశేషాలను గమనిద్దాం.



శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రంలో "గురుః" అని 495వ నామంనుండి "భోక్తా"అనే 502 నామం వరకు కల ఎనిమిది నామాలు హయగ్రీవావతారాన్ని తెలుపుతున్నాయి. ఇవి అన్ని ఆ అవతార చరిత్రను, రూపగుణవిశేషాలను కీర్తించడం మనం గమనించవచ్చు. ఈ నామాలలోని అర్థాలను ఆళ్వారులు కూడా దివ్య ప్రబంధాలలో అనుసంధించడం కూడా గమనించదగ్గ విషయం.

**1)గురుః-** ఇది 495వ నామం. భగవంతుడు హయగ్రీవుడై, అవతరించి బ్రహ్మ, మొదలైన దేవతలకు వేదాలను ఉపదేశించి, వారి వారి కర్తవ్యాలను వారికి తెలియజేశాడు అని ఈ నామం తెలియజేస్తోంది. ఈ విషయం మహాభారతంలోని హయగ్రీవోపాఖ్యానం మనకు తెలుపుతోంది.

భగవంతుడు హయగ్రీవ అవతారం ఎత్తి వేదాలను అనుగ్రహించిన సందర్భాన్ని తిరుమంగై ఆళ్వార్లు, "పరిముక మాయ్ ఇశైకొళ్ వేదనూల్ ఎండ్రు ఇవై పయన్దవనే" (పెరియ తిరుమొళి-5-3-2) (హయగ్రీవుడై స్వరాన్ని కలిగిన వేదం అనే శాస్త్రాన్ని అనుగ్రహించినవాడు) అని, "పన్ను కలై నూల్ వేదప్పొరుళై ఎల్లామ్ పరిముకమాయ్ అరుళియ ఎంబెరుమాన్" (పెరియతిరుమొళి-7-8-2) (వేదాలను హయగ్రీవుడై అనుగ్రహించినస్వామి) అని అనుసంధించారు.

**2) శరీరభూతభృత్-** ఇది 501వ నామం. ఈ నామానికి తనకు శరీరమైన ప్రకృతి మొదలు భూమివరకు కల ఇరవైనాలుగుతత్త్వాలను ధరించేవాడు- అని అర్థం. భగవంతుడు హయగ్రీవుడై అవతరించినప్పుడు ఈ విధంగా తత్త్వాలను అన్నిటిని రూపంలో కలిగి ఉన్నాడు అనే విషయాన్ని మహాభారతం శాంతిపర్వంలో కల హయగ్రీవోపాఖ్యానంలో కనిపించే "తస్య మూర్ధా సమ భవత్ ద్యౌః సనక్షత్రదేవతా" (ఆ హయగ్రీవుని శిరస్సు నక్షత్రాలతో, దేవతలతో కూడుకొన్న ఆకాశం) అని మొదలైన వాక్యాలు తెలుపుతున్నాయి. ఇందువల్ల హయగ్రీవుడు సకలతత్త్వ స్వరూపుడు అని తెలుస్తోంది.

భగవంతుని సకలతత్త్వ స్వరూపాన్ని నమ్మాళ్వారులు తిరువాయ్‌మొళి ప్రబంధంలో "తానే యాకి నిఱైందు ఎల్లా ఉలకు ముయిరుమ్ తానేయాయ్" (10-7-2) (జగత్తులో అంతటా తానే నిండి ఉండి, చేతనా చేతనపదార్థాలన్నీ తానే అయినవాడై) అని కీర్తించారు. అర్థైక్యాన్నిబట్టి ఈ వాక్యం హయగ్రీవావతార పరమని చెప్పవచ్చు.



శ్రీకరగుణోన్నత! శ్రీరామ

ఆగస్టు 13,
గాయత్రీజపం

# అమ్మలాంటి దైవం

- డా॥ యల్లాప్రగడ మల్లికార్జునరావు, 98485 43520



గాయత్రీమాత అచ్చంగా అమ్మలాగా లాలించే దేవత. గాయత్రీమంత్రమే ఆ అమ్మకు ప్రతిరూపం. గాయత్రీ మంత్రంలో ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్కశక్తి, ఒక్కొక్క అధిదేవీ మూర్తి, ఒక్కొక్క తత్త్వం ఉంటాయి. ఇంతటి మహోన్నతదేవతాశక్తినిధి కనుకనే గాయత్రీ మహామంత్రానికి అంత పవిత్రత!

గాయత్రి అనే పదానికి లోకాలను రక్షించేది అని అర్థ ముంది. "గాయత్రీ ఛన్దసా మహమ్" అని గీతావాక్యం. ఋగ్వేదంలోని గాయత్ర్యాది ఛందస్సులన్నిటిలో శ్రేష్ఠం, అగ్రగణ్యం గాయత్రీ ఛన్దస్సు. ఇది మహర్షులంగీకరించిన సంప్రదాయం.

శ్రేష్ఠత్వం జగత్తులో ఎక్కడ గోచరించినా భగవంతుని విభూతియే అవుతుందని శ్రీమద్భగవద్గీతలోని విభూతియోగం చెబుతుంది. అందువల్ల గాయత్రీయేతానని అంటే తన విభూతియే నని శ్రీకృష్ణభగవానుడంగీకరించడం వల్ల పైన పేర్కొన్న గీతావాక్యానికి అర్థం.

## మట్టిగణపతిని పూజిద్దాం! పర్యావరణాన్ని కాపాడుదాం!!



విఘ్నరాజైన వినాయకుడు ప్రకృతి స్వరూపుడు. ఆయనను ఇంటింటా కొలువుతీర్చి, భక్తితో కొలిచే వేడుక వినాయకచవితి, మరి అలాంటప్పుడు రసాయనాలు, హానికరరంగులతో రూపుదాల్చిన వినాయకుడిని ప్రతిష్ఠించడం ఎంత మాత్రమూ భావ్యం కాదు.

కనుక, మట్టితో రూపొందించిన వినాయకుడి విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠించుకుని పూజలు చేయా ల్సిందిగా విజ్ఞప్తి! ఆచరిద్దామా మరి!!

"గాయనాత్ త్రాయత్ ఇతి గాయత్రీ" అనే వ్యుత్పత్తి గాయత్రీ శబ్దానికుంది; గాయత్రిని గానం చేయడం వల్ల, అంటే జపించడం వల్ల దుఃఖసాగరం నుండి రక్షణ కలుగుతుందియే అని ఈ వ్యుత్పత్తి అర్థం. గాయత్రీమాత అనుగ్రహానికి గాయత్రీ మహామంత్రం, గాయత్రీ కవచం, హృదయం, అష్టోత్తర, సహస్రనామా వళి స్తోత్రాలున్నాయి. గాయత్రీమంత్రజపం వీలుపడని వారు కవచం, నామావళి, స్తోత్రాలను చదివినా చాలు. ఆ అమ్మ కటాక్షాన్ని పొందవచ్చు.

గాయత్రి అనుగ్రహంతో ఉపాసకులు భౌతిక, ఆధ్యాత్మిక సుఖసమృద్ధులను పొందుతుంటారు. నిత్యం మూడుసంధ్యలలోనూ సంధ్యావందనం చేసేవారు మూడు విభిన్నమూర్తులలో ఉండే గాయత్రీమాతను ఆరాధిస్తుం టారు. ఆ అమ్మ ఉదయసంధ్యవేళ ముక్తావిద్రుమ హేమ నీలధవళఛాయలు కలిగిన ముఖాలతో అలరారు తుంది. మధ్యాహ్నసంధ్యావందన సమయంలో సావిత్రి అనేపేరున దర్శనమిస్తుంది. అప్పుడాతల్లి తెల్లటిరంగులో

యువతిగా కటాక్షిస్తుంది. మూడుకన్నులతో వరద అభయ ముద్రలతో, అక్షమాల, త్రిశూలం ధరించి ఉంటుంది. వృష భాన్ని అధిరోహించి యజుర్వేద సంహితా రూపిణిగా కన్పిస్తుంది. అలాగే సాయంసంధ్యాసమయంలో వృద్ధసరస్వతిరూపంలో ఉంటుంది. నల్లటి శరీరఛాయతో, నల్లటివస్త్రాలనూ శంఖ, చక్ర, గద, పద్మాలనూ ధరించి గరుడవాహనాన్ని ఎక్కి కన్పిస్తుంది. రత్నాభరణాలతో రత్నకిరీటంతో గొప్పగా ప్రకాశిస్తుంటుంది. అప్పుడప్పుడూ పసుపుపచ్చని వస్త్రాలలో సచ్చిదానందరూపిణిగా, సామవేదస్వరూపిణిగా దర్శనమిస్తుంటుంది.

గాయత్రీమంత్రానికి ఎంతో గొప్పశక్తి ఉంది. ఈ మంత్రంలో ఇరవై నాలుగు అక్షరాలుంటాయి. ఒక్కొక్క అక్షరం అద్భుతశక్తినిధి. ఈ ఇరవైనాలుగుఅక్షరాలు ఉండే "ఓం భూర్భువ స్సువః..." అనే మంత్రాన్ని శుద్ధ గాయత్రీ మహామంత్ర మని అంటారు. వాల్మీకిమహర్షి గాయత్రీమహామంత్రాన్ని రామా యణంలో నిక్షిప్తం చేశాడు.

గాయత్రీమంత్రజపం వల్ల ఆయువు, వర్చస్సు, లక్ష్మీ కటాక్షం ప్రాప్తిస్తాయనీ, సంతానధనధాన్యసమృద్ధి కలుగు తుందనీ ఇది సర్వసంపదలను ఇచ్చే మహామంత్రమనీ మరీచి మహర్షి వివరించి చెప్పాడు. ఈ దివ్యమంత్రాన్ని నిత్యదీక్షతో అనుష్ఠించిన కారణంగానే గౌతమమహర్షికి గొప్పశక్తులు కలిగాయి. ఒకసారి భూలోకమంతటా పన్నెండుసంవత్సరాల పాటు కరవుకాటకాలు సంభవించాయి. కానీ గౌతమమహర్షి చేసిన నిరంతర గాయత్రీ జపం వల్ల ఆయన ఆశ్రమప్రాంతం మాత్రం సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉంది, అలా గాయత్రీ మంత్రజపంతో లబ్ధి పొందుతున్నవారు ఆనాడే కాదు ఈనాడూ ఉన్నారు.

# సుందరి వరలక్ష్మి

రచన, సంగీతం – వాణిశ్రీ
రాగం – సౌరాష్ట్ర,
తాళం – ఆది

**ప॥** సుందరి వరలక్ష్మి.. మా
వందనములు అందుకొనవే
సుందరి వరలక్ష్మి.. మా
వందనములు అందుకుని... మా
కందరికి దరిశనమిచ్చి కను
విందు చేయవే మందహాసిని

**చ॥** చందనము రుద్ది, నీకద్ది
చందముగ కుంకుమ బొట్టెట్టి..
చందబింబ సమ నీ వదనము
చిందించు సొగసులు చూసితిమి

అందముగ చీరను గట్టి.. అర
విందనయనముల కాటుకబెట్టి
ముందరకు కుచ్చులజడ తెచ్చి..
నీ సౌందర్యమును చూసి
మురిసితిమి



ఇందు, రవి భూషణములు చక్కగ
ఇందిర! నీ సిగయందు పెట్టితిమి
నందనవనపు పూవులు నీ జడ
యందు తురిమి అలంకరించితిమి

కొందరమేమో ఆనందముతో
బృందగానము చేస్తుంటే.. మరి
కొందరము ముత్యాలసరముతో
పందిరేసి నిన్నందుంచితిమి

బంధములందు మునిగినను.. అను-
బంధపాశములో చిక్కినను.. నీ
యందు కడుభక్తిని కలిగి.. భక్త
బాంధవి నీవని నమ్మితిమి

కుందనపు వరవాణిని పలికి
ఎందరెందరినో బ్రోచినట్టు.. గో
విందుని తోడ వేగమె వచ్చి నీ
నందనులను కావ వేడితిమి

# రక్షా బంధనం

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

## ఆగష్టు 11, రాఖీపండుగ

పూర్ణిమ నిండు చంద్రుని శోభలను పుడమి స్వీకరించే రోజు. రసమయమైన చంద్రకళలు షోడశంగా, పూర్ణంగా అందే ఈ దినం ధ్యానానికీ, ఆరాధనకీ అనుకూలమైన యోగకాలం. చంద్రకళలు మనసుపై ప్రభావం చూపిస్తాయని సూక్ష్మవిజ్ఞాన విషయం.

విశ్వరూపుని మనస్సే చంద్రునిగా దీపిస్తున్నదని పురుషసూక్తం చెబుతోంది. విరాట్పురుషుని మనఃకళలే చంద్రకళలుగా ప్రకాశించడం వల్ల మన మనస్సు పవిత్రమై, రసానందాన్ని అనుభవించే దిశగా ఎదుగుతుంది. అందుకే పూర్ణిమా రాధనలు, ధ్యానాలు విశేషంగా ఆచరించేది. వైదికక్రతువులలోను, మంత్రశాస్త్రాల ఉపాసనలోను, యోగ విద్యలోను కూడా పూర్ణిమసాధనలకు ప్రత్యేకత కన్పిస్తుంది. ప్రత్యేకించి అనేకవిధాలుగా ఆధ్యాత్మికప్రశస్తిని వహించిన శ్రావణపూర్ణిమ వివిధ ప్రాధాన్యాలను సంతరించుకుంది. వైదిక సంప్రదాయంలో దీనికి ప్రాముఖ్యం మరీ ఎక్కువ.

ముఖ్యంగా– ఈ పూర్ణిమ విద్యాధిదేవత అయిన హయగ్రీవస్వామి ఆవిర్భ వించిన రోజు.

ఈ పూర్ణిమనాడే రక్షాబంధన మహోత్సవం. మానవసంబంధాల్లో దివ్యత్వాన్ని నింపుకునే ఆచారాల్లో ఇది ఒకటి.


సోదరుని క్షేమాన్ని కోరే సోదరి జీవితకాలమంతా అన్నదమ్ముని ద్వారా పుట్టింటి మమకారంలోని రక్షణ పొందుతున్నది.



ఉత్తరాదివైపు సోదరీసోదరుల అను బంధానికి ప్రతీకగా భావించే ఈ పండుగ క్రమంగా దక్షిణాదిన ప్రాచుర్యం పొందింది. కానీ మన ప్రాచీన పురాణాది ధర్మశాస్త్రాలు ఇది భారతీయులందరి పర్వంగానే చెబు తున్నాయి. బొట్టుపెట్టి, హారతినిచ్చి, పూజిం చిన రక్షాబంధనాన్ని కుడిచేతి మణికట్టుకు కట్టడం సంప్రదాయం.

ఇది విష్ణుస్వరూపమైన రక్షా బంధనం. బలిని బంధించిన విష్ణుశక్తిచే ఇది కడుతున్నానని ఈ సమయాన చదివే మంత్రంలోని భావం. దేవతల రక్షణకోసం, బలిని నిగ్రహించి లోకకల్యాణం చేశాడు విష్ణువు. ఆయన బలంచేత బలి బంధితుడై నాడు. అలాంటి విష్ణుబలమే ఈ రక్షా బంధనంలో నిబద్ధమై ఉందని స్మరిస్తూ, విష్ణురక్షచేత పదిలమైన భద్రతను పొందా లనే శుభాకాంక్ష ఇందులో ఇమిడి ఉంది. ఈ పండుగకే 'భద్రా' అనే పేరు కొన్ని శాస్త్రాల్లో ఉంది.

# గరుడపంచమి



ఆగష్టు 2,
గరుడపంచమి

– ఆచార్య కోలవెన్ను మలయవాసిని, 73311 41505

గరుత్మంతుడు శ్రీమన్నారాయణుని సన్నిధిలో నిరంతరం కొలువుండి, స్వామికి వాహనంగా నిత్యం సన్నద్ధుడై ఉంటాడు. నారాయణునకు ఎన్ని వాహనాలున్నా గరుడవాహనం మీదనే ప్రీతి. నిత్యశూరుడు, భక్తాగ్రగణ్యుడు అయిన గరుత్మంతుని ప్రత్యేకంగా పూజించే ఆచారం ఆంధ్రదేశంలో నెలకొని ఉంది.


వ్రతరత్నాకరంలో 'గరుడపంచమి' ప్రస్తావన ఉంది. శ్రావణ శుద్ధపంచమిని నాగపంచమి అనీ, గరుడపంచమి అనీ కూడా వ్యవహరించడం వ్రతగ్రంథాల్లో ఉంది. నాగపంచమనే గరుడపంచమి అని కూడా అనడంలో ఔచిత్యమేమిటి అని ఆలోచిస్తే దీనికి సమాధానం బ్రహ్మాండ పురాణం చెప్తోంది. శ్రావణశుక్లపంచమినాడు మాతృమూర్తి దాస్యవిముక్తి కోసం గరుడుడు స్వర్గలోకం నుండి అమృతాన్ని తెచ్చి నాగులకు ఇచ్చాడు. అందువల్ల ఈ రోజును గరుడపంచమిగా పేర్కొన్నారు. నాగుల కొఱకు తెచ్చాడు గనుక నాగపంచమి అన్నారు.

గరుడుడు మాతృదేవికి దాస్యవిముక్తి కలిగించిన మహాపర్వదినంగా ఈనాడు గరుడ పంచమి వ్రతం నిర్వహిస్తారు. గరుడుని ప్రత్యేకంగా పూజిస్తారు. వినత కొడుకు కావడంవల్ల, గరుత్మంతునికి వైనతేయుడు అనే పేరు వచ్చింది. గోదావరి ఏడుపాయలుగా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఆ ఏడుపాయల్లో ఒక పాయకు వైనతేయ అని పేరు. ఈ పాయ వసిష్ఠగోదావరి నుండి గన్నవరం అనే ఊరివద్ద విడిపోతుంది. ఆ గన్నవరం దగ్గర గరుడేశ్వరస్వామికి ఒక ఆలయం ఉంది. గరుడపంచమినాడు ఇక్కడ పెద్ద ఉత్సవం జరుగుతుంది.

భారతదేశాన్ని ఆనుకుని ఉన్న నేపాల్ దేశంలో ఈ గరుడపంచమి ప్రత్యేకంగా జరుపుతారు. నేపాల్‌లోని దేవాలయాల్లో మనిషి ముఖం, గరుడుడి రెక్కలూ గల శిల్పాలు ఉంటాయి.

గరుడపంచమినాడు నేపాల్‌లోని 'చాంగు నారాయణ' అనే చోట ఒక వింత విషయం జరుగుతూ ఉంది. ఆ ఊరిలో గరుత్మంతుని విగ్రహం ఉంది. ఆ గరుడుని మీద విష్ణుమూర్తి కూర్చుని ఉన్నాడు. ఈ గరుడపంచమినాడు ఒక పంచమినాడు జరిగిన యుద్ధసంబంధమైన అలసటకి చిహ్నంగా చెమరుస్తూ ఉంటుంది. పూజారులు జేబురుమాళ్లతో ఈ చెమటను తుడిచి ఒక పాత్రలోకి పిండుతూ ఉంటారు. ఈ నీరు పాము కాటుకు పరమౌషధంగా వినియోగిస్తారు. గరుడ పంచమినాడే ఈ అద్భుతం జరగడం విశేషం. ఇలా గరుడపంచమి మహనీయమైన మహత్తుగల పర్వదినంగా పేరుపొందింది.


గణపతిని గూర్చి తెలియనివారుండరు. ఆబాలగోపాలం ఆరాధ్యదైవం ఆయన. గణపతి ఒక్కడే. కానీ ఆయన భక్తులు మాత్రం కోటానుకోట్లు. వారందరి కోరికలనూ గణపతి ఒక్కో రూపంలో నెరవేరుస్తుంటాడు. గణపతికి గల పదహారు విభిన్నరూపాలలో ఒక్కో రూపం భక్తులకు ఒక్కో ఫలాన్ని అనుగ్రహిస్తుంది. బాలగణపతి మొదలుకొని ఊర్ధ్వ గణపతి వరకు వీరందరూ నిత్యం మనకు ఎదురవుతున్న ఎన్నో సమస్యలకు పరిష్కారమార్గాల్ని చూపుతున్నారు. ఇలా షోడశగణపతులను ఆరాధిస్తే వచ్చే ఫలితాలు అన్నీ ఇన్నీ కావు. వినాయకచవితి పండుగ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు సప్తగిరి మాసపత్రిక పాఠకుల కోసం షోడశగణపతుల సమాహారం....




## 1 బాలగణపతి

బుద్ధివికాసం కోసం ఈ స్వామి ధ్యానశ్లోకాన్ని
నిత్యమూ 32 సార్లు పఠించి
ఈ స్వామికి 21 నమస్కారాలు చేయాలి.

## 2 తరుణ గణపతి




ఈ దేవుని ధ్యానశ్లోకాన్ని
నిత్యమూ 32 సార్లు పఠిస్తే,
కార్యసాధనకు అవసరమైన దీక్ష మరియు
మనోధైర్యం వృద్ధి పొంది సిద్ధి కలుగుతుంది.




## 3 భక్తగణపతి

ఈ దేవుని ఆరాధనచే ఉపాసకులలో
భక్తిభావం వృద్ధి పొంది సిద్ధి కలుగుతుంది.

## 4 వీర గణపతి




ఈ స్వామి ధ్యాన, ఆరాధనల వల్ల
భక్తునికి ధైర్యశౌర్యాలు కలుగుతాయి.




## 5 శక్తి గణపతి

ఈ దేవుని
ధ్యాన ఆరాధనల వల్ల
ఆత్మస్థైర్యం కలుగుతుంది.



## 6 ద్విజగణపతి

ఈ స్వామి
ధ్యాన, ఆరాధనలు
సమగ్రంగా ఆలోచించే శక్తిని కలుగజేస్తాయి.



## 7 సిద్ధి గణపతి

సిద్ధి బుద్ధులనే తన శక్తులుగా చేసుకునియున్న
ఇతడి ఆరాధన, ధ్యానాలు భక్తునికి సకలకార్యాల్లోనూ సిద్ధిని
ప్రసాదిస్తూ ఓటమే ఎరుగని విజేతగా నిలుపుతాయి.




## 8 ఉచ్ఛిష్ట గణపతి

ఈ స్వామి మంత్రమూర్తి. ఎంత వేగంగా కోరికలు తీరుస్తాడో,
అశ్రద్ధ, అనుమానాలకు తీవ్రశిక్షను కూడా అంతే వేగంగా విధిస్తాడు.
ఏ చిన్నలోపాన్ని కూడా ఇతడు సహించడు.

## 9 విఘ్న గణపతి

ఈ స్వామిని ధ్యానించి, ఆరాధిస్తే
భక్తుల విఘ్నాలు తొలగించి,
వారికి యశస్సు కలుగజేస్తాడు.






## 10 క్షిప్ర గణపతి

ఈ స్వామి ఆరాధనచే
ఇష్టార్థసిద్ధి కలుగుతుంది.

## 11 హేరంబ గణపతి


ఈ స్వామి ఆరాధనచే
ప్రయాణాలలో కలుగు గండాంతరాలచే
భక్తులు రక్షింపబడతారు.





## 12 శ్రీ లక్ష్మీగణపతి

ఈ స్వామి ఆరాధనచే
భక్తులు విశేషమైన
ధన, ధాన్య సమృద్ధి పొందుతారు.



## 13 మహాగణపతి

ఈ గణపతి భక్తులపాలిటి కామధేనువు.
సకల సంకష్టాల నుండి, గ్రహబాధల నుంచి
భక్తులను ముక్తులను చేసే మహాదేవుడితడు.




## 14 విజయగణపతి

ఈ స్వామిని
ధ్యానిస్తే, ఆరాధిస్తే భక్తులకు
అంతటా జయాలు కలుగుతాయి.



## 15 నృత్తగణపతి

కల్పవృక్షపు క్రింది విభాగంలో ఉన్న
ఈ స్వామిని ఆరాధిస్తే సంతృప్తి,
మనశ్శాంతి కలుగుతాయి.



## 16 ఊర్ధ్వగణపతి

ఈ స్వామి ఆరాధనచే
మహాపాపాల నుండి, బాధలనుంచి,
కారాగారశిక్షల నుండి విముక్తి కలుగుతుంది.

చిత్రసౌజన్యం: శ్రీకందుకూరి వేంకటసత్యబ్రహ్మాచార్య

మన దేవాలయాలు

ఆగస్టు 19, కృష్ణాష్టమి



# తిరుమలలో.. శ్రీకృష్ణజయంతి

- డా॥ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

శ్రీకృష్ణాష్టమినాటి రాత్రి శ్రీవారిఆలయంలో తోమాల సేవ జరుగుతుంది. పిదప శ్రీదేవి భూదేవిసహిత ఉగ్రశ్రీనివాసమూర్తిని బంగారు వాకిలి ముందు ఉన్న తిరుమామణి (ఘంటా మండపం) మండపంలో స్నానపీఠంపై వేంచేపు చేయిస్తారు. మరొకపీఠంపై శ్రీకృష్ణస్వామి వారిని కూడ తూర్పుముఖంగా వేంచేపుచేసి, తిరుమంజనం (అభిషేకం) చేస్తారు.

ఇటు ఉగ్రశ్రీనివాసమూర్తికి, ఆ ప్రక్కన శ్రీకృష్ణస్వామివారికి అభిషేకం ఏకాంతంగా మాత్రమే జరుపబడుతుంది. కేవలం అర్చకులు, ఆచార్యపురుషులు మాత్రమే చుట్టూ తెరలు గట్టి ఈ అభిషేకాన్ని నిర్వహిస్తారు. కృష్ణాష్టమి సందర్భంలో జరిగే ఈ అభిషేకాన్ని ద్వాదశ తిరువారాధనం అంటారు. అనగా శ్రీ(వాసుదేవ) కృష్ణభగవానుని ద్వాదశ మంత్రబీజాక్షరాలను (ఓంనమోభగవతే వాసుదేవాయ) సంపుటీకరిస్తూ చేసే ఆరాధనమే "ద్వాదశ తిరువారాధనం".

అభిషేక, నివేదనానంతరం ఉగ్రశ్రీనివాస మూర్తివారిని దేవేరులతోకూడ మళ్లీ ఆనంద నిలయంలోనికి వేంచేపు చేస్తారు. తర్వాత తిరు మామణిమండపంలోనే సిద్ధం చేసి అలంకరించిన బంగారు సర్వభూపాలవాహనంలో శ్రీకృష్ణస్వామి (వెన్నముద్దకృష్ణుని)వారిని శయనించినట్లుగా వేంచేపుచేసి అలంకరిస్తారు. ఇలా అలంకారం ఏకాంతంగా జరుగుతుండగా జియ్యంగార్లు, వైష్ణవాచార్యులు దివ్యప్రబంధపారాయణ చేస్తారు.

ఈ పారాయణను సేవాకాలం అంటారు. ఇలా అలంకారం పూర్తయిన వెంటనే శ్రీకృష్ణ స్వామివారికి నైవేద్యాలు నివేదించి కర్పూరహారతి ఇస్తారు. పిదప జియ్యంగార్లు అందించిన తులసితో అర్చకులు శ్రీకృష్ణుణ్ణి అర్చిస్తారు. తర్వాత అర్చకులు శ్రీకృష్ణునిపై అక్షతారోపణం (కుంకుమాక్షతలు) చేస్తారు. ఈ అర్చకులకు శఠారి మర్యాదలు జరుగుతాయి.

ఈ సందర్భంగా శ్రీమద్భాగవతం, తృతీయాధ్యాయంలోని శ్రీకృష్ణావతారఘట్టాన్ని చదువుతూ హృదయంగమంగా పురాణశ్రవణం చేయిస్తారు. పురాణపఠనం తర్వాత పండితునికి శఠారి మర్యాద జరుగుతుంది. పిదప శ్రీకృష్ణస్వామికి కర్పూర హారతి ఇస్తారు. ఆ తర్వాత, దేవాలయ అధికారులకు తాంబూలం, హారతి ఇవ్వబడుతుంది.

మళ్లీ అక్కడ ఉన్న భక్తుల తరపున ఒక్కొక్కరిచేత వసూలుచేసిన రూపాయలకు గాను "రూపాయిహారతి" ఇస్తారు. పిదప జియ్యంగారికి



కార్యనిర్వహణాధికారికి, శఠారి మర్యాదలు జరిగిన తర్వాత చందన, అక్షతలు వినియోగం చేస్తారు. ఆ తర్వాత ప్రసాద వితరణ ఆస్థానం పూర్తవుతుంది. వెంటనే శ్రీకృష్ణస్వామిసన్నిధి లోనికి వేంచేస్తారు.

## తైలకాపు సమర్పణ

ఆ తెల్లవారుజామున సుప్రభాతం, కొలువు, తోమాల సేవానంతరం శ్రీకృష్ణస్వామివారిని బంగారువాకిలి దగ్గర వేంచేపు చేసి నువ్వులనూనెతో తలంటుతారు. దీన్నే తైలకాపు సమర్పణ అంటారు. అప్పుడే జన్మించిన బాలకృష్ణుని సన్నిధి వీథిగుండా, మహంతుమఠం, దక్షిణమాడ, మున్నగు ఆలయ మహాప్రదక్షిణ మార్గంలో ఊరేగిస్తుండగా శ్రీకృష్ణునికి తైలకాపు చెయ్యగా మిగిలిన పురిటితైలాన్ని నాలుగువీథుల్లో భక్తులకు పంచుతారు. దాన్ని భక్తులు తలంటుకొని అభ్యంగన స్నానం చేస్తారు. శ్రీకృష్ణస్వామిసన్నిధి చేరుకోగానే మొదటిగంట నైవేద్యం, బలి శాత్తుమొర జరుపబడతాయి. పిదప భక్తులకు దర్శనం జరుగుతుంది. ఇక ఆ మధ్యాహ్నం అర్చన, రెండవ నివేదనలు పూర్తవుతాయి. తర్వాత మలయప్పస్వామివారిని ఒక బంగారు శ్రీపీఠం లోను, శ్రీకృష్ణస్వామిని మరొక శ్రీపీఠంపైన వేంచేపుచేసి ఆభరణాలతో, పుష్పమాలలతో అలంకరిస్తారు. పిదప ఛత్రచామర, మంగళవాద్యపురస్సరంగా, ఆనందనిలయాన్ని వీడి విమాన ప్రదక్షిణంగా బయటకు వచ్చి ధ్వజస్తంభానికి నేరుగా, ఉత్తరంగా వున్న యామునాత్తురై పుష్ప అరలో శ్రీస్వామివారు వేంచేస్తారు. అలాగే అక్కడి పోటు దగ్గర ఉన్న నాలుగుకాళ్లమండపంలో శ్రీకృష్ణస్వామి వేంచేపు చెయ్యగా ఆస్థానం జరుగుతుంది. దోశ, చక్కెరపొంగలి నివేదనచేసి కర్పూరహారతి జరిగి, ప్రసాద వినియోగం జరుగుతుంది.

## తిరుమలలో ఉట్ల ఉత్సవం

ఇక శ్రీస్వామివారు, శ్రీకృష్ణస్వామివారు అక్కడి నుంచి కదలి సన్నిధివీథిలో శ్రీబేడిఆంజనేయస్వామివారిదగ్గరలో గల శ్రీపెద్దజియ్యంగార్‌మఠంలోనికి వేంచేస్తారు. అక్కడ ఆస్థానం జరిగి, దోశెలు నివేదన జరుగుతాయి. శ్రీబేడిఆంజనేయస్వామి వారి దగ్గర కట్టిన ఉట్లను, తిరుమలలోని యువకులు ఉత్సాహంగా కొడతారు. ఆ తర్వాత శ్రీస్వామివార్లు మహంతుమఠానికి రాగా అక్కడ ఆస్థానం జరుగుతుంది.




అక్కడ ఉట్లఉత్సవాన్ని తిలకిస్తారు. ఉట్లు కొట్టబడతాయి. మళ్లీ శ్రీస్వామివారలు దక్షిణమాడవీథిలో ఊరేగుతూ అక్కడక్కడ కట్టబడిన ఉట్లను, ఉట్లను గొడుతున్న యువకులను ఆనందంగా అనుగ్రహిస్తూ, కర్పూరహారతులందుకుంటూ ముందుకుసాగుతారు.

ఇలా మహాప్రదక్షిణమార్గంలో శ్రీస్వామివారలు, శ్రీచిన్నజియ్యంగార్ మఠంలోను, మైసూరుసత్రంలోను, పూజలందుకొంటూ, భక్తులను అనుగ్రహిస్తూ ఉత్తరమాడవీథిలో, అర్చకులు, తరిగొండ, తాళ్లపాకవారిచేత, శ్రీవరాహస్వామిచెంత హారతులందుకొంటూ చివరకు ఆలయంలో ప్రవేశిస్తారు.

*(ముఖచిత్రకథనం)*

# శ్రీమన్నారాయణునికి మార్చి మార్చి సేవ చేస్తుంటాడు!

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

దశావతారాలలో శ్రీరామచంద్రమూర్తి అవతారం తర్వాత వచ్చేవి, బలరామ, కృష్ణావతారాలు. రెండూ ఒక వరుస క్రమంలో వచ్చిన అవతారాలు. దేవకీవసుదేవుల కడుపున శ్రీకృష్ణభగవానుడు జన్మిస్తే వసుదేవుడు రోహిణుల కడుపున జన్మించినవాడు బలరాముడు.

విశేషమైన బలం కలవాడగుటచేత బలభద్రుడు అని, దేవకీ గర్భం నుండి సంకర్షణమై రోహిణీ గర్భాన పుట్టాడు కనక సంకర్షణుడని బలరాముడికి పేర్లు వచ్చాయి. తెల్లనివర్ణంతో ఉంటాడు. సాక్షాత్తు శేషుని అంశ. ఆయన చేతిలో పట్టుకునే ఆయుధాలు రోకలి, నాగలి.

ఇన్ని పేర్లతో పిలవబడ్డ బలరాముడు శేషాంశ. ఆయన శ్రీమన్నారాయణునికి మార్చిమార్చి సేవ చేస్తుంటాడు. ఆయనే స్వామి కూర్చునే ఆసనం, పడుకోవడానికి శయనం అవుతాడు. ఛత్రమవుతాడు. అనేక విధాలుగా పరిచర్య చెయ్యడంలో సిద్ధహస్తుడు.

బలరాముడు, రెండు ప్రధానమైన రాక్షససంహారాలు చేస్తాడు. ఒక రాక్షసునికి ప్రలంబాసురుడు అని పేరు. ఆయన కంసుని పనుపున వచ్చిన రాక్షసుడు. ఎంతమంది వచ్చినా కృష్ణుని నిర్జించలేకపోయారని, శ్రీకృష్ణుని అన్నగారు బలరాముణ్ణి నిర్జిస్తే శ్రీకృష్ణుడు ఉండలేడని, బలహీనుడవుతాడు కనుక గొడవ వదలిపోతుందని వచ్చి, గోకులంలోని పిల్లలతో కలిసి ఒక పిల్లవాడుగా మారిపోయాడు. శ్రీకృష్ణపరమాత్మ దీన్ని కనిపట్టేశాడు. బలరాముని వద్దకు వెళ్లి "అన్నయ్యా! వీడు మనతో ఉన్న స్నేహితుడు కాడు. మారువేషంలో వచ్చి మనతో ఆటలకు చేరిన రాక్షసుడు" అన్నాడు.

ఒక విచిత్రమైన ఆటని చెప్పాడు. పిల్లలందరు రెండు పక్షాలుగా విడిపోయి ఆడుతుంటారు. గెలిచినపక్షంవాళ్లను ఓడిపోయినపక్షంవాళ్లు మోసి తీసుకుని వెళుతుండాలి. ఒక మర్రిచెట్టుని హద్దుగా పెట్టుకుని మొయ్యాలి. కృష్ణుణ్ణి ఎలాగు నిర్జించలేరు కనక బలరాముని పక్షంలో చేరి ఓడిపోయినప్పుడు బలరాముణ్ణి తాను ఎత్తుకునిపోయి దూరంగా వెళ్లి చంపేయవచ్చు అని అతని పక్షం చేరినట్లుగా నటించాడు.

లోకంలో కొంతమంది భగవత్పక్షంలో ఉన్నట్లుగా ఉండి స్వార్థం చూసుకుంటూ ఉంటారు.

కృష్ణుడి పక్షంలో చేరినప్పుడు బలరాముడి బృందం గెలిచింది. ఓడిపోయిన బృందం కాబట్టి గెలిచిన బృందాన్ని మోయాలి. బలరాముణ్ణి తాను మోస్తానని ఎక్కించుకుని దూరంగా తీసుకుని వెళ్లిపోతుండగా, సహజస్వరూపం పొందాడు. వడివడిగా తీసుకుని వెళుతుంటే బలరాముడు గమనించి, రాక్షసుణ్ణి నాలుగు పిడిగుద్దులు గుద్దేటప్పటికి ప్రలంబాసురుడు అక్కడికక్కడే మరణించాడు. అది ఒక వధ.

దానికన్నా ప్రధానమైంది భాగవతంలో ఒకటి చేస్తాడు. దాన్ని గార్దభాసురసంహారం అని పిలుస్తారు. వినడానికి చాలా చిన్నకథలాగ ఉంటుంది. ఏమిటి ఈ లీలలు అనిపిస్తుంది. గాడిదరూపంలో ఉండే రాక్షసుడు. తాటిపండుకు చాలా సువాసన. బాగా మగ్గిన తాటిపండు కింద పడిపోతే పైన నల్లగా అయిపోతుంది. అది కొంచెం పెట్లితే లోపలనుండి కొంచెం బంగారురంగు కనపడుతుంటుంది. కాలిస్తే ఇంకా సువాసన. అందమైన రంగుతో రుచిగా, ఆకర్షణీయంగా ఉంటుంది. గాడిదరూపంలో ఉండే రాక్షసుడు, పైనించి కింద పడిన తాటిపళ్లను అది గాడిద కనుక ఎవరినీ ముట్టుకోనివ్వడు, తాను తినదు. ఈ గోపబాలురు అది తినాలని ఆశ కొద్దీ లోపలకు వెడితే, వెనుక కాళ్లతో తన్ని చంపుతుంటాడు. అందరూ వెళ్ళి శ్రీకృష్ణపరమాత్మకు చెప్పారు. ఆయన "తప్పకుండా మీకు తినే ఏర్పాటు చేస్తా"నని బలరాముణ్ణి విశేషమైన స్తోత్రం చేసి, "అన్నయ్యా ఈ పని నీ వలనే జరగాలి" అన్నాడు.


బలరాముడు ఆ తాటిచెట్లను పట్టుకుని బలవంతుడు కనుక ఊపితే, తాటిపళ్లు కిందపడ్డాయి. ఆ చప్పుడు వినగానే గాడిద పరిగెత్తుకుని వచ్చి బల రాముణ్ణి తన వెనుక కాళ్లతో తన్నింది. వెంటనే బలరాముడు ఆ గాడిద కాళ్లు పట్టుకుని గిరగిరా కిందకొట్టి చంపేశాడు. దీన్నే గార్దభాసురసంహారం అంటారు. గాడిద చనిపోగానే దాని మిగిలిన సైన్య మంతా వచ్చింది.

ఒక పంచె ఉంటే అందులో దారాలు ఉంటాయి. దారాలే పంచెగా మారినట్లు పరమేశ్వరుడే ప్రపంచంగా మారాడు. అయినప్పుడు గార్దభసైన్యాన్ని సంహరించడం ఒక లెక్కా? అందుకనే చంపేశాడు. గార్దభాసురవధ పూర్తయి పోయింది. దాన్ని బలరాముడు చేసిన ఉత్కృష్ట మైన లీలలలో ఒకటిగా పరిగణిస్తారు. బలరాముడు చేసిన రాక్షససంహారం చాలా తక్కువయినా చాలా విశేషంగా ఉంటాయి.

బలరాముడు చాలా గంభీరమైన స్వభావంతో, ఎప్పుడూ శ్రీకృష్ణునికి రక్షకత్వ మన్న కోరిక ఉన్నవాడు. ఆ కారణం చేత ఆయనతో కలిసే ఉంటాడు. మహా భారతంలో గదాయుద్ధం నేర్పినవాడు బలరాముడే.

కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభంలో కృష్ణుడు పాండవుల పక్షాన నిలబడడానికీ, అర్జునునికి సారథ్యం చెయ్యడానికి అంగీకరిస్తాడు. కృష్ణుడు ఇవతలి పక్షంలో ఉండగా, తాను దుర్యోధనుని పక్షంలో ఉండలేక తీర్థయాత్రలకు వెళ్లి పోతాడు బలరాముడు.

కురుక్షేత్రసంగ్రామమయ్యేటప్పటికి బలరాముడు తిరిగివస్తాడు. ఆయన భీముడు, దుర్యోధనుడు గదాయుద్ధానికి సిద్ధపడుతున్న సమయానికి తిరిగి వచ్చాడు. భీమ, దుర్యోధనుల మధ్య ఘోరమైనయుద్ధం జరుగుతుండగా, భీమసేనుడు తన గదాయుద్ధంతో దుర్యోధనుని తొడలు విరగ కొట్టగానే, ఆయన పడిపోయాడు.



“గదాయుద్ధంలో నాభి కిందభాగంలో కొట్ట కూడదని నియమం. నా శిష్యుణ్ణి ఇంతమంది సమక్షంలో నాభి కింద భాగంలో కొట్టి పడగొట్టావు కనక నిన్ను చంపేస్తా”నని నాగలీ, రోకలీ పట్టుకుని భీముని మీదకు వెళ్లాడు.

అలా వెళుతున్నప్పుడు కృష్ణుడు బలరాముణ్ణి శాంతింప చేస్తాడు. “అన్నయ్యా ఇది మోసంతో చేసింది కాదు. దుర్యోధనునికి తొడలు విరిగి పడి పోవాలని మైత్రేయీమహర్షి శాపం ఉంది. ఇందు వల్ల దుర్యోధనుడు పడిపోయాడు” అంటాడు. శాంతించిన బలరాముడు శ్రీకృష్ణునితో విభేదించలేక అలిగి వెళ్లిపోతాడు.

చివరికి, గాంధారి శాపానికి శ్రీకృష్ణభగవానుడు శరీరం విడిచి పెట్టే సమయంలోనే బలరాముడు ఒక చెట్టుకింద కూర్చుని ధ్యానం చేస్తుండగా, ఆయన నోట్లో నుండి ఒక తెల్లని సర్పం బయటికు వచ్చి సముద్రంలోకి వెళ్లిపోతుంది. ఆ పాము సముద్రంలోకి వెళ్లిపోగానే బలరాముని

శరీరం పడిపోతుంది. బలరాముడు సాక్షాత్తుగా సహస్రఫణుడైన ఆదిశేషుడు.

బలరాముడు దశావతారాలలో ఒక అవతారంగా శ్రీకృష్ణపరమాత్మతో కలసి ఉన్నవాడు. వసుదేవుని కొడుకు అయిన కారణం చేత తమ్ముడితో ఉంటూ తమ్ముణ్ణి రక్షించుకుంటూ కనపడతాడు. బలరామకృష్ణులది అవినాభావ సంబంధం. కృష్ణపరమాత్మని సేవించి ఆయనతో ఉన్న అవతారం బలరామఅవతారం. బలరాముడు పక్కనలేకుండా కృష్ణుడు ఎక్కడా కనపడదు. ఒకవేళ కనపడ్డాడు అంటే ఏదో ఒక విశేషమైన లీల జరుగుతున్నదని గుర్తు.

కాళియమర్దనం జరుగుతున్నప్పుడు బలరాముడు పక్కన ఉండడు. కాళియుని పడగలలో చుట్టబడ్డ శ్రీకృష్ణుడు చనిపోతాడని మిగిలినవాళ్లు భయపడతారని, వాళ్లకు ధైర్యం చెప్పడానికి బలరాముని విడిచిపెట్టి వెళ్ళాడు. వారందరూ యమునానదిలో దూకిప్రాణాలు విడిచిపెడతామని అన్నప్పుడు, గోపబాలురను, గోపకాంతలను రక్షించినవాడు బలరాముడు.

“మీరు బెంగపెట్టుకోవద్దు. కృష్ణుడు కాళియుని పడగలలో నుండి విడివడి కాళియమర్దనం చేసి పైకి వస్తాడు” అని చెప్పి ఆపుతాడు.

బ్రహ్మదూడలను దాచేసిన సందర్భంలో కృష్ణుడు అన్నిటినీ సృజిస్తే ఆవులు, దూడల మధ్య అపారమైన ప్రేమను గమనించి, ఇవి బ్రహ్మ సృష్టిలోనివి కావనీ, తన తమ్ముడు సృష్టించాడని కనిపెట్టింది బలరాముడే.

వాళ్లిద్దరి మధ్య ఎంతో అన్యోన్యమైన సంబంధం ఉంటుంది అన్నది గమనించడానికి బలరామావతారం శ్రీకృష్ణావతారానికి పక్కనే ఉంటుంది.

ఏడవ గర్భం బలరాముడు, ఎనిమిదవగర్భం శ్రీకృష్ణ పరమాత్మ. యోగంలో అలాగే చెపుతారు. యోగమార్గంలో అష్టాంగస్థాయిని సమాధిస్థాయి అంటారు. ఆ ఎనిమిదవమెట్టు అయిన సమాధిస్థాయి కృష్ణపరమాత్మ అయితే, ఏడవమెట్టు బలరాముడు. అంత దగ్గరగా ఉంటారు. దశావతారాలలో శ్రీబలరామావతారం చాలా విశేషంగా స్తుతించబడ్డ అవతారం.

## శ్రీకృష్ణామృతం

**నీ గుణమే కీర్తింతు నీ పదమే అర్చింతు**
**నిరతము నినె తలతు నారాయణా**
**నళినాంబుజాక్ష నీ భక్తి బాసట**
**నీరధి జగతిన నారాయణా...**
**నీ గుణమే కీర్తింతు...**

**నీ మహిమ బోధింతు నీ లీలె జపియింతు**
**నీ సేవ తరియింతు నారాయణా**
**నీ ఆజ్ఞ లేకున్న నిను తెలియ నా తరమ**
**నిండుగ మదినిండ నారాయణా..**
**నీ గుణమే కీర్తింతు...**

**నీ నామమే పిలతు నీ జపములే చేతు**
**నిదురను మెలకువను నారాయణా**
**నిలువెత్తు నీ రూపే నా ఎదుట నిలుచున్నా**
**నీరుబుకు నయనముల నిను చూతునా ..**
**నీ గుణమే కీర్తింతు...**



**నా యందు కృపయుంచు నా మనవి మన్నించు**
**నీ కీర్తనమే సేతు నారాయణా**
**నే చూడ నువు నిలువు నా మనసునందున**
**నిరతము మనసార నిను కొలువగా..**
**నీ గుణమే కీర్తింతు...**

*–“అనంత”*
*(కృష్ణసుందరి సత్తిరాజు),*
*85955 87451*

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

*గతసంచిక తరువాయిభాగం...*

మంత్రాణాం అంటే 'మననాత్త్రాయతే' ఇతి మంత్రః, మననం ఆలోచించి ఆ విషయాన్ని మన మనస్సుల్లో స్థిరపరుచుకుంటే ఆ విషయం మనల్ని కాపాడుతుంది. అటువంటి దానికి మంత్రం అని పేరు ఆ మంత్రాలు చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ చెప్తుంటాయి, ఎందుకంటే మనస్సులో ఆవిషయం స్థిరపడాలి. ఆత్మయొక్క స్వరూపం మనసులో స్థిరపడాలి. ఆ స్థిరపడటం కోసం మంత్రాలు చెప్పిన దాన్ని మళ్లీ చెప్పకూడదు అనే నియమాన్ని ఉంచుకోవు అని శంకరాచార్యులవారు వంటి మహనుభావులందరూ ఆ విషయాన్ని స్థిరపరిచారు. కాబట్టి 'పునరుక్తి' అనుకోవటానికి లేదు. కష్టమైన విషయాలలో 'పునరుక్తి' ఒక గుణమే. పునరుక్తి సరైంది అని, సరైంది అని నాలుగుసార్లు చెప్పుకున్నాం.

పునరుక్తి దోషం కాదు. సరైందే అనే విషయం స్థిరపరచుకోవటం కోసమే ఇది దోషం కాదు, ఇది మంత్రాల యొక్క రీతికాదు, పరమాత్మయొక్క విధానం ఇది కాదు.

పునరుక్తి అనేది ఇక్కడ సరైన గుణం. పరమాత్మ యొక్క రీతికాదు, పరమాత్మ పునరుక్తి చేసిన ప్రతిసారి, ప్రతి చోటా యేదో ఒక చిన్నవిశేషాన్ని, చిన్నసందేహాన్ని పోగొట్టటం కోసం చిన్నవిశేషాన్ని తప్పకుండ పెడతాడు. ఇంతవరకు 'ఆత్మా అవినాశి' అని తెలిసింది. లేదు అని ఏ రకంగా నిరూపించుకోవాలి? అంటే నేను ఏ క్రియకూ కర్తనుకాను అని అనిపించాలి. నేను సంహారం కావచ్చు, మరొక క్రియకావచ్చు ఆ క్రియకునేను కర్తనుకాను నాకూ ఆ క్రియకు సంబంధంలేదు, క్రియలన్నీ దేహంలోనివే. నేను క్రియలతో సంబంధంలేని శుద్ధమైన ఆత్మస్వరూపుణ్ణి అని అనిపిస్తే నేను చెప్పింది నీకు అర్థమైనట్లు అనిపించకపోతే నీవు దీని మీద ఇంకా ప్రయత్నం చేయాలి అన్నట్లు. ఆ విషయాన్ని సూచించటం కోసం 'కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కం' అని ఒక ప్రశ్న వేస్తున్నాడు. "నేను చెప్పిన విషయం మనస్సులో స్థిరపడేట్లు ప్రయత్నం నేను చేయిస్తాను, మీరు కూడ తప్పకుండ చేసుకోండి" అని సూచన చేస్తూ -

వేదావినాశినం నిత్యం య ఏన మజమవ్యయమ్।
కథంసపురుషః పార్థ కాంఘతయతి హంతి కమ్॥

అని అంటున్నాడు.

ప్రతి సందర్భంలోను చిన్న విశేషాన్ని జోడిస్తాడు. అదే సమయంలో మనకు చెప్పిన విషయం గనుక కఠినమైతే ఆ విషయాన్ని మన మనస్సులో స్థిరపరిచేంతవరకు చెప్తూనే ఉంటాడు పరమాత్మ. ఈ విషయాన్ని మళ్లీ మళ్లీ ఇలాంటి పునరుక్తితో అలరారుతున్నటువంటి పునరుక్తి అనే గుణంతో ఉన్న ఈ శ్లోకాన్ని ఒక పాఠంగా తీసుకుంటూ పైశ్లోకంలో కూడ దగ్గరదగ్గరగా ఇదే భావాన్ని దేహాలు అనిత్యాలు అనే భావంతో కలిపి మనకు పరమాత్మబోధిస్తున్నాడు

*(ఇంకా ఉంది)*

**46వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



# వెంగమాంబ దర్శించిన శ్రీకృష్ణుడు

– డా॥ సంగీతం కేశవులు,
90146 57722

ఆగష్టు 6, తరిగొండ వెంగమాంబ వర్ధంతి

మాతృశ్రీ తరిగొండవెంగమాంబ రచించిన గ్రంథాల్లో పన్నెండవది శ్రీభాగవతం. వెంగమాంబ భాగవతంలోని దశమ స్కంధంలో శ్రీకృష్ణుని జననం మొదలుకొని రాసలీలలు వరకు చోటు చేసుకున్నాయి. శ్రీభాగవతం దశమస్కంధ ప్రారంభంలో పోతనవలే ఈమె కూడా తనకు ఇష్టమైన శ్రీకమలాధీశుడిని తలచుకొని శ్రీభాగవతరచన చేసింది.

వెంగమాంబ ద్విపదభాగవతదశమస్కంధ పూర్వభాగంలో దేవకీ వసుదేవుల కథ, శ్రీకృష్ణజననం, కాళియుని కథ, పూతన, శకటాసురుడు, తృణావర్తుడు, యశోదతెల్పిన రామకథ, యశోదనందుల పూర్వజన్మవృత్తాంతంవంటి కథలు ఉన్నాయి.



శ్రీకృష్ణుణ్ణి వెంగమాంబ ఇలా వర్ణించింది. "ఈలోకంలో ఉన్న కపటరాక్షసులు అనే ఏనుగులకు సింహం వంటివాడు" అని చెప్పింది. శేషాచలశిఖరవాసుడై, నాపాలిట తరిగొండ నారసింహుడై, లెక్కించ డానికి వీలుకాని ప్రకాశం కల్గిన దివ్యమణి కాంతుల బంగారుకిరీటంతో, విశాలమైన ఫాలభాగంతో, మెరిసేటి కనుబొమ్మల జంటతో అందమైన ముక్కుతో, ఎర్రనిపెదవులతో, తళతళ మెరిసే దంతాలవరుసతో, ఆనందం కలిగించే అందమైన నవ్వుతో, చంద్రుని వంటి ముఖంతో, రత్నాలతో పొదగబడ్డ కుండలాలతో, అందంగా ప్రకాశించే చెక్కిళ్లతో చతుర్భుజాలతో, గొప్పదైన కౌస్తుభమణిని ధరించిన కంఠంతో, లక్ష్మీకి నెలవైన వక్షఃస్థలంతో, మేఘం వంటి శరీరఛాయతో, శోభవంతమైన దివ్యకాంతుల కళ్లతో, చీకటి వీధుల్లో నిరంతరం వెలిగే దివ్యపాదాలతో, కోటి చుక్కలు తళతళ మెరిసే ప్రకాశంతో ధీరుడై దేవకీ గర్భాన- అష్టమి రాత్రి, రోహిణీనక్షత్రంలో ప్రకాశవంతమైన చంద్రుడివలే శ్రీకృష్ణుడు జన్మించాడు.

తరిగొండ వెంగమాంబ శ్రీకృష్ణావతారప్రయోజనాలు శ్రీకృష్ణుని ఆవిర్భావం, గోకులంలో శ్రీకృష్ణుని ప్రకటనం, పూతనోద్ధరణం, శకటభంజనం, తృణావర్తుని ఉద్ధరణం, ఉలూఖలబంధనం, యమళార్జునభంజనం వంటి పలు ఘట్టాల్ని చక్కని ద్విపదపాదాలల్లో తెలియజేసింది.

వెంగమాంబ భాగవతంలో శ్రీకృష్ణతత్త్వం తెలియజేయడానికి వృషభాసురుని వధ, బృందావనలీలాతత్వం ఒక ఉదాహరణగా చెప్పవచ్చు శ్రీకృష్ణుని మధురాగమనం, శ్రీకృష్ణుని కల్యాణాలు రమణీయంగా తీర్చి దిద్దబడ్డాయి.

తన త్రిజగన్మోహన రూపాన్ని ప్రతి జీవీ దర్శించి, తరించడానికి వీలుగా ఆ జీవుల ఉద్ధరణ కోసం శ్రీకృష్ణునిగా ఆవిర్భవించడాన్ని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తన ద్వివద భాగవతంలో తెలిపింది.





# పండుగపూట

# పసందైన నైవేద్యాలు

- శ్రీమతి వైజయంతి పురాణపండ, 80085 51232

శ్రీకృష్ణజయంతి లోకకల్యాణార్థం జరుపుకుంటాం. అష్టమినాడుపుట్టిన అష్టమ శిశువు అయిన ఆ గోపాలబాలుడు అష్టకష్టాలను ఆనందంగా అనుభవించి, అష్టైశ్వర్యాలను మనకు ప్రసాదిస్తాడు. ఆయన జన్మదినాన్ని అంటే శ్రీకృష్ణ జన్మాష్టమిని దేశవ్యాప్తంగా ఆనందోత్సాహాలతో సంబరంగా జరుపుకుంటారు. కొందరు భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉంటారు. శ్రీకృష్ణలీలలు గానం చేస్తూ కోలాటం ఆడతారు. శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రమైన మధురపదార్థాలను తయారుచేసి నివేదనచేస్తారు.

శ్రీకృష్ణుని భక్తులకు ఇది నిజంగా పండుగరోజు. తెల్లవారుజామున ప్రారంభ మయ్యే ఉపవాసదీక్ష అర్ధరాత్రి వరకు కొనసాగుతుంది. ఈ ఉపవాస సమయంలో అర్ధరాత్రి పన్నెండు గంటలకు దీక్షవిరమిస్తారు. ఉల్లి, వెల్లుల్లి, ముడిబియ్యం పూర్తిగా నిషేధం. ఆ సమయంలో శ్రీకృష్ణుడిని ఆహ్వానిస్తూ పూజ ఆచరించి, నైవేద్యాలు సమర్పిస్తారు. చందమామను దర్శించి, అప్పుడు ఉపవాసవిరమణ చేస్తారు. ఉపవాస సమయంలో పండ్లు, పాలు తీసుకుంటారు. వీటితో పాటు సగ్గుజావ, శ్రీఖండ్, అటుకులు, ఇడ్లీ, సెనగలు తినవచ్చునని శాస్త్రం చెబుతోంది.

ఈ పండుగను ఒంటరిగా కాకుండా సామూహికంగా జరుపు కుంటారు. కొందరు శ్రీకృష్ణమందిరాలకు వెళ్లి, భజనలు చేస్తూ భక్తితో అర్చిస్తారు. ఇంటి దగ్గరే పండుగ చేసుకోవాలనుకునేవారు కూడా ఉంటారు. శ్రీకృష్ణుడిని భక్తిపూర్వకంగా ఇంట్లోకి ఆహ్వానించాలి.

ఇందుకు ముఖ్యంగా రెండుమార్గాలు అవలంబిస్తే బాల గోపాలుడు సంబరపడతాడు. ఆయనకు మిఠాయిలంటే ఇష్టమని తెలిసిందే కదా. మధురాధిపతి అయిన శ్రీకృష్ణుని... 'అధరం మధురం, వదనం మధురం...' అంటూ మధురపదార్థాలతోనే పోల్చుతారు. ఆయన నివసించే మధురానగరం అనే పేరులోనే మధురం ఉంది.

శ్రీకృష్ణుడు బాలకృష్ణుడిగా ఉన్న రోజుల్లో గోకులంలో ఇంటింటికీ వెళ్లి, పాలు, పెరుగు, వెన్నతో పాటు మిఠాయిల కోసం గాలించి, దొంగిలించేవాడట. అందువల్లే శ్రీకృష్ణభక్తులు పాలతో మిఠాయిలు

తయారుచేసి మధురాధిపతికి నివేదన చేస్తారు. శ్రీకృష్ణజన్మాష్టమినాడు కొన్ని రకాల మధురపదార్థాలు మాత్రమే తయారుచేసి, ఆయనను పూజించిన పిదప వాటిని నివేదన చేస్తారు.

రబ్రీ, ఖీర్, పాలకోవా, గోపాల్‌కాలా, మిస్టీదోయ్, కలాకండ్.... వంటివి ఆ చిన్నికృష్ణుడు ఇష్టంగా తింటాడని ఒక నమ్మకం. వీటినే కాకుండా ఆయాప్రాంతాల ఆచారాలను అనుసరించి రకరకాల మిఠాయిలను కూడా తయారుచేసి నివేదన చేస్తారు. కొబ్బరితురుము, చిక్కటి పాలమీగడ, పంచదారలతో తయారుచేసే చిక్కటి పాలలడ్డును తయారుచేస్తారు. ఉపవాసం ఉన్నవారు ఈ ప్రసాదాన్ని సాయంత్రం సమయంలో శ్రీకృష్ణునికి నివేదన చేసి ఆ తరవాత భుజిస్తారు.

కేసరి, కోవా, హల్వా, సేమ్యా... అబ్బో ఎన్ని రకాలో. మహారాష్ట్రవాసులు తయారుచేసే బాసుంది.. మనం తయారు చేసే ఖీర్‌లాంటిదే. బియ్యాన్ని నీళ్లలో నానబెట్టి, రవ్వ తయారు చేసి, పాలలో ఉడకబెట్టి, డ్రైఫ్రూట్స్ వేసుకుని చల్లగా తింటారు. నల్లనివానికి ఇష్టమైన చల్లటివంటకంగా భావిస్తారు.

## బాదం ఫిర్నీ...

ఈ వంటకాన్ని ఉత్తరాదివారు ఎక్కువగా తయారు చేస్తారు. వాస్తవానికి ఇది కశ్మీరదేశంనుంచి వచ్చింది. బియ్యప్పిండితో తయారుచేస్తారు. బెల్లం జతచేసి, బాదంపప్పులు వేసి ఆ బాదరాయణునికి నివేదిస్తారు.

## గులాబీ ఖీర్...

కేవలం అరగంటలో తయారుచేసి ఆకలి వేస్తున్న వెన్నపిల్లవానికి తినిపిస్తారు. బోలెడన్ని పాలు, వెన్న వేసి తయారు చేస్తే ఈ వంటకాన్ని ఆ బాలగోపాలుడు తినకుండా ఉండగలడా.

## మలై చంచం...

ఈమధురపదార్థాన్ని కుంకుమ పువ్వు జత చేసి, మీగడ బాగా దట్టించి, రంగురంగులలో... తయారుచేసి, బెంగాలీలు శిఖిపింఛమౌళికి ప్రేమగా సమర్పిస్తారు. ఆ వెన్నదొంగను వెన్నతో ఆహ్వానిస్తే.. పరమానందపడతాడు. ఆయనను కన్నబిడ్డలా భావించాలి. పూజ గదిని అందంగా అలంకరించాలి. మీ పిల్లవాడికి కృష్ణుడివేషం వేయాలి. అలాగే గోపికలను కూడా తయారుచేయాలి. వారితో ఆటలు ఆడించాలి. అప్పుడే ఆ పరంధామునికి పరమానందం.



శొంఠిపొడి, పంచదార, మిరియాల పొడి, వాము, ధనియాలు, బెల్లం కలిపి పొడిగా చేసి శ్రీకృష్ణునికి కాయం అనే నైవేద్యాన్ని తయారుచేస్తారు. ఆషాఢంలో బలంగా ప్రారంభమైన వర్షాలు, శ్రావణమాసానికి మరింత తీవ్రంగా కురుస్తాయి. ఈ కాయం ఉండను అతి తక్కువ మోతాదులో ఒక్కసారి తీసుకున్నా చాలు, ఎటువంటి అనారోగ్యాలు దరిచేరవు కనుక, తనకు ఆ ప్రసాదాన్ని నివేదన చేసి స్వీకరించమని జగద్గురువు చెబుతున్నాడు.

శ్రావణమాసంలో పౌర్ణమిముందు వచ్చే శుక్రవారానికి అత్యంతప్రాధాన్యత ఉంది. అమ్మవారిని వరాలిచ్చే వరలక్ష్మీతల్లిగా భావనచేసి ఆ తల్లిని పూజిస్తారు. నూతన వస్త్రాలు, నగలు ధరించటమే కాకుండా, ఆ తల్లిని కూడా సర్వాలంకార భూషితురాలిగా అలంకరించి, అర్చించటం అనాదిగా వస్తోంది.

ఈ రోజున ముఖ్యంగా నవకాయ పిండివంటలు తయారు చేసి అమ్మవారికి నివేదన చేయటం పలుప్రాంతాలలో సంప్రదాయంగా వస్తోంది. ముఖ్యంగా బియ్యానికి సంబంధించిన వాటితో ప్రసాదాలు తయారు చేస్తారు. తొమ్మిదిరకాల పిండివంటలు, తొమ్మిదిచొప్పున ఆ తల్లికి నైవేద్యంగా పెడతారు.

ముఖ్యంగా పులిహోర, ఉండ్రాళ్లు, బూరెలు, గారెలతో పాటు చక్కెరపొంగలి, కట్టెపొంగలి, పరమాన్నం, బెల్లం, కొబ్బరికాయలను భగవంతునికి అర్పిస్తారు. మరి కొందరు బియ్యప్పిండితో చెక్కవడలు, చేకోడీలు, బజ్జీలు, జంతికలు వంటివి కూడా తయారుచేస్తారు. ఆ ఇంటి సంప్రదాయాన్ని అనుసరించి ప్రసాదాలు వండుతారు.

చైత్రమాసంలో ఉగాది, శ్రీరామనవమి పండుగల తరవాత సుమారు మూడునెలలతరవాత మనకు శ్రీవరలక్ష్మీవ్రతంతోనే పండుగల మాసం ప్రారంభమౌతుంది. ఇంతకాలం తరువాత వచ్చే పండుగే కాకుండా, వర్షాకాలంలో వచ్చిన పండుగ కనుక కాలానుగుణంగానే ఆ తల్లి మనకు ఈ పిండివంటలను ప్రసాదంగా ప్రసాదించింది.




తొమ్మిదిరకాలు చేయటంలో కూడా ఒక విశిష్టత ఉంది. అంకెలు మనకు తొమ్మిది మాత్రమే ఉన్నాయి. నవగ్రహాలు, నవవిధ భక్తిమార్గాలు, నవరాత్రులు, నవదుర్గలు... ఇలా తొమ్మిదిసంఖ్య అత్యంత శక్తిమంతమైంది. తొమ్మిది రకాల పిండివంటలను వండుకునే ధనశక్తితో పాటు, తొమ్మిదిరకాలను భుజించి, అరిగించుకోగల శక్తిని సైతం ప్రసాదించే ఆరోగ్యవరప్రదాయిని శ్రీవరలక్ష్మీమాత.

పండుగలంటేనే పదిమందికలిసి ఒకచోట చేరి, సంతోషంగా గడిపి, కడుపు నిండా పిండివంటలు తిని, హాయిగా గడపాలి. ప్రతిరోజూ ఇన్ని వంటకాలను భుజించకుండా, పండుగలసమయాలలో మాత్రమే ఈ విధంగా ఆహారం తీసుకోవటంవల్ల సంతృప్తిగా ఉంటుంది, ఆరోగ్యమూ సమకూరుతుంది.

అందువల్లే మనపెద్దలు పండుగలసమయాలలో మాత్రమే పిండివంటలు తినాలని నిర్దేశించారు. అవి కూడా దైవానికి నివేదన చేసి, ప్రసాదంలా సేవించాలే కానీ, భోజనం చేసినట్లుగా భుజించకూడదని చెబుతున్నారు. పరిమితంగా తీసుకోవటంవల్ల శ్రీవరలక్ష్మీదేవి ఆరోగ్యాన్ని వరంగా ప్రసాదిస్తుంది.

ఇక శ్రావణం వెళ్లగానే వచ్చే పండుగ వినాయకచవితి. గణేశచతుర్థినాడు కుడుములు, ఉండ్రాళ్లు తయారుచేసి వినాయకుడికి నివేదనచేసి, ప్రసాదం తీసుకోవటం సంప్రదాయంగా వస్తోంది. వినాయకచవితిపండుగలో మానవులు ఎంత సామాన్యులుగా జీవించాలో బోధపడుతుంది. ప్రకృతిలో సహజంగా దొరికే ఆకులు, కాయలు, గరికతో వినాయకుడిని అర్చించటంతో పాటు, ఎటువంటి రుచిలేని కుడుములు, ఉండ్రాళ్లను బియ్యప్పిండి, బియ్యపు రవ్వలతో తయారుచేస్తారు. అది కూడా ఆవిరి మీద ఉడికించుతారు. అందులో నూనె, కారంవంటి పదార్థాలు ఉండవు. కేవలం చిటికెడు ఉప్పు మాత్రమే జతచేసి వీటిని తయారుచేస్తారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తూ, కొంత ఆహార వైరాగ్యాన్ని అలవాటు చేసుకోవాలని గణనాయకుడు స్వయంగా ఆచరించి, మనకు అనుసరించమని సూచిస్తున్నాడు. మనకు లభించిన పదార్థాలను తగు మోతాదులో భుజించి, తృప్తిగాజీవించాలని వినాయకుని నైవేద్యంలోని అంతరార్థం.



పండుగలు, ప్రసాదాలు, పిండివంటలు... సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. పిండివంట లలో అంతరార్థాలను, పరమార్థాన్ని అర్థం చేసుకోవాలి. మితంగా తినటం ఆరోగ్యం. అందుకే పిండివంటలను ప్రసాదంగా సేవించాలని పండుగలోని పరమార్థాన్ని పండితులు, ఆధ్యాత్మికవేత్తలు బోధపరుస్తున్నారు.

## శ్రీవేంకటేశ్వరలీలలు



# భక్తులతో మాట్లాడే స్వామి!

- శ్రీ ఎస్.వి.నరసింహం, 63003 29245

శ్రీవేంకటేశ్వరస్వామి మాట్లాడుతాడా? అంటే అవుననే సమాధానమొస్తుంది. లేకపోతే ఇన్నికోట్లమందిభక్తులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి స్వామిదర్శనానికి ఎందుకు వస్తారు? భక్తులంతా స్వామివారిని అనన్యభక్తితో సేవిస్తున్నారు, దర్శిస్తున్నారు, తరిస్తున్నారు.

వేటూరిప్రభాకరశాస్త్రిగారు తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో 1939 సం॥ చివరన చేరారు. వారు దేహాన్ని వదిలేంతవరకు అంటే 29-8-1950 వరకు తి.తి.దే.లోనే పనిచేశారు.


శ్రీప్రభాకరశాస్త్రిగారు సాహిత్యపరంగానేగాక ఆధ్యాత్మికంగా గూడా ఎంతో ఎత్తుకెదిగారు. యోగశాస్త్రంలో ఎంతో ఉన్నతస్థితికి చేరుకున్నారు. వారి ఆధ్యాత్మికశక్తి ఎంత పటిష్ఠమో తెలుపుటకొక యధార్థసంఘటనను ఉదహరిస్తున్నాను. అన్నమాచార్యవర్థంతిఉత్సవాలు జరుపుట వీరితోనే మొదలైంది. ప్రథమ వర్థంత్యుత్సవాలు తిరుపతిలో మహావైభవంగా సాగుతున్నాయి. అప్పటి మద్రాసుప్రధాన న్యాయమూర్తులు పి.వి.రాజమన్నార్ ఆ ఉత్సవాలకు అధ్యక్షులు. రెండవరోజు సాయంకాలం టంగుటూరి సూర్యకుమారి పాటకచ్చేరి జరుగుతూ ఉంది. వేలకొలది జనంతో సభాస్థలం క్రిక్కిరిసి పోయారు. ఇంతలో కాఱుమబ్బులు కమ్ముకున్నాయి. తుఫానువాయువులు వీచసాగాయి. ప్రాంగణమంతా గాలి దుమారం. జనాల్లో ప్రాణభీతి! సభంతా గగ్గోలెత్తిపోయింది. సభ రసాభాసమౌతుందని గ్రహించిన శ్రీశాస్త్రిగారు వెంటనే మైకు దగ్గరకు వెళ్లి "వర్షంరాదు! మనమందరం తిరుమలశ్రీవారిని ఏకమనస్కతతో ప్రార్థిస్తున్నప్పుడు తద్విరుద్ధంగా వర్షమెట్లు రాగలదు? మబ్బులు విచ్చిపోగలవు! గాలి హోరు తగ్గును! కూర్చుండుడు! వానరాదు! రాదు! రాదు!" అని ముమ్మారు నొక్కిచెప్పారు. ఆశ్చర్యం! శ్రీవారిదివ్యసంకల్ప బలమేమో వెంటనే మబ్బులు తొలగిపోయాయి. గాలిహోరు తగ్గింది. వర్షం రాలేదు. కచ్చేరి విజయవంతమైంది.

శ్రీశాస్త్రిగారు ఒకసారి ఆయన శిష్యుడైన శ్రీ ఏ.వి.శ్రీనివాసాచార్యులగారిని పిలిచి "నేను శ్రీవేంకటేశ్వరస్వామిని ఏకాంతంగా దర్శించాలని ఉంది. దానికి వీలు కల్పించ"మని కోరారు. గురువుగారి కోరికమేర శ్రీ ఏ.వి. శ్రీనివాసాచార్యులుగారు కొండపైన మిరాశిదార్లతో మాట్లాడి ఒప్పించి ఒక శుక్రవారం ఏకాంతదర్శనానికి ఏర్పాటుజేశారు. శ్రీప్రభాకరశాస్త్రిగారు గుడిలోపలకు వెళ్లారు. గుడితలుపులు మూసి శ్రీ శ్రీనివాసాచార్యులుగారు బంగారుద్వారం వెలుపలనున్నారు. ఆ సమయంలో వారికి శ్రీశాస్త్రిగారినుద్దేశిస్తూ ఒక స్వరం వినబడింది. "ఇప్పుడా నన్ను చూడటానికొచ్చేది" అనే మాటలు వారికి వినిపించాయి. వెంటనే వారు ఇవతలకువచ్చి దూరంగా ఉండిపోయారు. కొంతసేపటికి శ్రీశాస్త్రిగారు గుడిలోపలనుండి బయటకొచ్చారు. దీన్ని బట్టి చూస్తే స్వామి ఆయనభక్తులతో, మాట్లాడుతారనే సత్యం విదితమౌతుంది.

అదేవిధంగా నేను పేష్కారు కార్యాలయంలో పనిచేసేటప్పుడు జరిగిన ఒక యదార్థగాథ- నేను ఆ కార్యాలయంలో 1990-1992 సం॥ మధ్యలో ఎగువశ్రేణిగుమస్తాగా విధులు నిర్వర్తిస్తున్నాను. నేను పనిచేసేటప్పుడు ఇతరవిధులతో బాటు స్వామివారికి(మూలవిరాట్టు) మేల్‌చాట్‌సేవకు డబ్బుకట్టే భక్తులకు ఉత్తర్వులు జారీజేయడంగూడా ఒకటి. ఒకరోజు వృద్ధదంపతులిద్దరు గుడికి ఎదురుగా ఉన్న పేష్కారు ఆఫీసుకు వచ్చారు. ఆయన రిటైర్డు కో-ఆప్‌టెక్స్ మేనేజరు. వారు మొదట మా కార్యాలయం సూపరింటెండెంటును కలిశారు. ఆయన వారిని నా దగ్గరకు పంపారు. వాళ్లు వచ్చి "ఏమండీ! మేము స్వామికి (మూలవిరాట్టుకు) వస్త్రంకట్టాలి. ఆయన మాకు కలలో కనిపించి నాకు పట్టుచీర కట్టండి" అని చెప్పారు. "మీరు స్వామికి ఎలాంటి చీరలు కడ్తారు" అని అడిగాడు. నేను వారికి ఒక ఆఫీసు అసిస్టెంటును తోడుగా పంపి గుడిలోపలనున్న బొక్కసం గదిలోవున్న పట్టువస్త్రాలను చూపించి వారిని ఆఫీసుకు

తీసుకురమ్మని పంపాను. బొక్కసంలో పనిచేసే శ్రీశేషాద్రిగారు స్వామికి సమర్పించే పట్టువస్త్రాలను వారికి చూపించారు. వాటిని చూసిన ఆమె "నన్ను కట్టమన్న చీర వీటిల్లో లేదు" అని చెప్పి, "అయ్యా! స్వామికి ఆ చీరకట్టకపోతే మా అబ్బాయికి ఉద్యోగం రాదు. మా అమ్మాయికి పెండ్లికాదు" అంటూ బాధ పడసాగింది. నేను దానికి స్పందించి "అమ్మా మీ మనసులో ఉన్న చీరను గురించి మాకేమి తెలుసు" అని అన్నాను. దానికి ఆమె "నాకు! కలలో స్వామివారు చెప్పిన చీరను సికిందరాబాదు అంతా వెదకి అదే డిజైనుగల ఒక నూలుచీరను పట్టాను. అది నా దగ్గరేవుంది" అన్నారు. నేను వెంటనే "అమ్మా మీరు స్వామి వారికి సమర్పించాలనుకున్న డిజైను మాదగ్గరలేదు. అయితే మాకు వస్త్రాలను సరఫరా చేసే వ్యాపారికి ఒక జాబు ఇస్తాను. వారిది సేలం. వారైతే మీర డిగిన డిజైనుతో నేయించి ఇస్తారు." అని అన్నాను.

దానికి వారు "సరే! అని చెప్పి మేమిచ్చిన జాబు తీసుకొని నేరుగా సేలం వెళ్లి మా సరఫరాదారుణ్ణి కలిశారు. వారు వీళ్లు కోరుకున్న ప్రకారం డిజైన్ వేసి చూపించారు. దానికి వాళ్లు సంతృప్తి చెంది కొంత అడ్వాన్సు చెల్లించి వచ్చారు. ఆ వర్తకుడు చెప్పిన తేదీకి ఆ దంపతులు సేలం వెళ్ళి చీర తీసుకొని, ఒక బుధవారంరోజు మా ఆఫీసుకు వచ్చి "తాము మేము సేలం నుంచి తెచ్చుకున్న పట్టుచీరను వచ్చే శుక్రవారం స్వామికి కట్టాలన్నారు. దానికి నేను "అమ్మా వచ్చే శుక్రవారం కట్టువస్త్రం ఇంతకు ముందే రిజర్వు అయిపోయింది. మీది అయిదోవస్త్రమౌతుంది. కనుక మీ వస్త్రాన్ని ఆరోజు కట్టడానికి వీలుపడదన్నాను. దానికి ఆమె "ఏమండీ స్వామికి చీరకట్టకపోతే మా అమ్మాయికి పెళ్లికాదు, మా అబ్బాయికి ఉద్యోగం రాదు అంటూ" దీర్ఘాలుతీసింది. నాకేమీదిక్కుతోచలేదు. మొదటి వస్త్రంగా రిజర్వుజేసుకున్న గృహస్థు వారిచీరనే కట్టాలని అభి లషిస్తారు. అది నిబంధన కూడా. ఈమేమో మొండికేస్తోంది. చివరకు మధ్యస్తంగా ఒక సలహానిచ్చాను. "అమ్మా! మీరు తెచ్చిన వస్త్రాన్ని ఇంతకుముందు రిజర్వు (ఒకటవ వస్త్రంగా) చేసుకొన్న వ్యక్తికిస్తాం. వారికివ్వాల్సిన వస్త్రం మీకిస్తాము అని అన్నాను. ఎందుకంటే మొదటవస్త్రాన్ని డబ్బుగట్టిన గృహస్థుకు వారి చేతులతో ఇచ్చిన పట్టువస్త్రాన్ని స్వామికి కట్టారనే తృప్తి ఉంటుంది. అదే విధంగా మీరు తెచ్చిన వస్త్రం స్వామికి కట్ట బడిందనే సంతోషం మీకూ ఉంటుంది" అని అన్నాను. ఆమె



ఎందుకో నా సలహాకు అంత సుముఖంత చూపలేదు. "మేము మళ్లీ వచ్చి ఏ విషయం చెబుతాం" అని చెప్పి వెళ్లిపోయారు.

వారు మరలా మరుసటి బుధవారం వచ్చారు. దీన్ని బట్టి చూస్తే వారు వారం రోజులు కొండమీదే ఉన్నట్టున్నారు. బహుశః వస్త్రాన్ని మరుసటి శుక్రవారం కట్టమని అడగడానికి వచ్చారనే తలంపుతో "అమ్మా! రేపు శుక్రవారం మీరు వస్త్రాన్ని కడుతున్నారా" అని అడిగాను. వెంటనే ఆమె "సార్! నేను స్వామితో మాట్లాడాను". దానికి ఆయన "అమ్మా! నీ చీరను వేరేవాళ్లు సమర్పిస్తే నీవు సమర్పించినట్లు ఎలా అవుతుంద న్నారు! వారి చేతికిచ్చిన వస్త్రం వారు సమర్పించినట్లే అవుతుంది కదా" కాబట్టి ఏ తేదీ ఖాళీగా ఉందో చూచి ఆ తేదీనే మాకు ఖరారు జేసి, మొదటివస్త్రంగా ఇప్పించండి. ఆ వస్త్రంను స్వామి వారికి సమర్పించగా మేము చూసి ఆనందించాలి" అని అంది. వారి కోరికమేరకు, 1992 అక్టోబరునెలలో కాబోలువారికి తేదీ నిర్ణయించి ఉత్తర్వులు జారీజేశాం. అయితే నేను 1992 సం॥ మే నెలలో పదోన్నతిమీద సూపరింటెండెంటుగా గృహసముదా యాలవిభాగానికి బదిలీ అయ్యాను. విచారించగా ఆ తేదీనేవారు వచ్చి స్వామివారికి మేల్‌చాత్‌ను సమర్పించారని తెలిసింది. దీన్నిబట్టిచూస్తే స్వామి తన భక్తులతో ఇప్పుడుకూడా మాట్లాడు తున్నాడనేది సుస్పష్టం.

భాస్కర శతకం

# రసజ్ఞత లేని చదువు వ్యర్థం

– డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు

ఉ. చదువదియెంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న యా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటం
బదనుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచిపుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా!

**తాత్పర్యం:**

భాస్కరా! ఎంత చదువు చదివినా, ఆ చదువు యొక్క సారాన్ని గ్రహించగలిగే నేర్పు కొంచెమైనా లేకపోతే, ఆ చదువు వ్యర్థం. మంచికూరను నలుడివలే ఎంత చక్కగా వండినప్పటికీ, అందులో ఇంపుగూర్చే ఉప్పువేయనట్లయితే అది ఏ మాత్రమూ రుచిగా ఉండదు.

చదువు చదివినందుకు మనిషికి కలగాల్సిన ఫలం వివేకం, సంస్కారం. ఇదే చదువులసారం. భాగవతంలో ప్రహ్లాదుడు తన తండ్రితో– "చదువుల లోన సారమెల్ల చదివితి తండ్రీ!" అని చెపుతాడు కదా!



కొందరు చదువుకున్నప్పటికీ సంస్కారహీనంగా, వివేకరహితంగా ప్రవర్తించడం కనిపిస్తుంది. అటువంటి వారికి వారు చదివిన చదువుల వల్ల ప్రయోజనం శూన్యం. కనుక సంస్కారాన్ని, వివేకాన్ని ఇవ్వలేని చదువు వ్యర్థం.

శతకకవి ఈ విషయాన్నే చెబుతున్నాడు 'రసజ్ఞత' అన్నమాట సారాన్ని గ్రహించ గల్గిన తెలివి కొంచెమైనా లేక పోతే ఆ చదువు ఎందుకూ పనికిరాదు అని చెబుతోంది.

ఇందుకు దృష్టాంతంగా మంచి తాజా ఆకుకూరనో, కాయగూరనో తీసికొని చక్కగా సంస్కరించి రకరకాల దినుసులు వేసి నూనెలో వేయించి చక్కగా వండినప్పటికీ, అందులో ఇంత ఉప్పువేయకుంటే ఆ కూర రుచిని ఇవ్వదు. తినడానికి పనికి రాదు.


ఆ విధంగానే సంస్కారాన్ని అలవరచుకోగలిగిన తెలివి లేకపోతే చదివిన చదువంతా వ్యర్థమే అని భావం.

**నలపాకం–** లోకంలో నలభీమపాకం అనే మాట వ్యవహారంలో ఉంది. అత్యంతరుచికరమైన పదార్థాన్ని ఆస్వాదించినపుడు 'అహో! నలభీమపాకంలా ఉంది'. అనడం వింటుంటాం.

మహాభారతంలో– భీముడు విరాటరాజు కొలువులో వలలుడు అనే పేరుతో వంటలవాడిగా అజ్ఞాతవాసం గడిపాడు. వికారరూపాన్ని పొందిన నలచక్రవర్తి చేతివంటను రుచిచూచి ఆయన భార్య దమయంతీదేవి, ఇతడు తన భర్త నలుడేనని అనుమానిస్తుంది. బహుశః ఈ ఉదంతాల వల్ల నలుడు, భీముడువంట చేయడంలో సుప్రసిద్ధులన్న ప్రసిద్ధి వచ్చి ఉంటుంది. మనదేశంలో వంటశాలను గృహిణులకే అప్పజెప్పినప్పటికీ ఇతరత్రా దేశాలలో వంటలలో మగవారిదే పై చేయిగా కనిపిస్తుంది.



# కొండంత దేవునికి.. గోరంతపత్రి!




- శ్రీమతి అన్నంగి వేంకటశేషలక్ష్మి, 99439 62812

ఆదిదేవుడు వినాయకుడు ప్రకృతిజీవనానికి ప్రతీక. ఆయన రూపం, ఆకారం, అభిరుచులు అన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ఇరవైఒక్కరకాల పత్రులతో అంటే ఆకులతో విఘ్నేశ్వరుడికి పూజచేస్తారు. ఈ ఆకుపూజలో వినియోగించే ఆకులన్నిటిలోనూ అద్భుత ఔషధగుణాలున్నాయి. ఇలాంటి ఔషధ లక్షణాలున్న ఆకులను బాల్యం నుంచే పసిపిల్లలకు పూజ పేరుతో పరిచయం చేస్తే, వారు పెద్దయ్యాక, వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ ఇరవైఒక్కరకాల ఆకుల ఔషధగుణాలను తెలుసుకుందాం!

| పత్రంపేరు | తెలుగుపేరు | ఉపయోగాలు |
|---|---|---|
| మాచీపత్రం | మాచిపత్రి | అన్నిచోట్ల దొరుకుతుంది. ఇది నులిపురుగులు, కుష్టు, బొల్లి, దప్పికను పోగొడుతుంది. ఆకుల్ని కళ్లపై పెట్టుకుంటే నేత్రదోషాలు పోతాయి. శిరస్సు పై పెట్టుకుంటే తలనొప్పి తగ్గుతుంది. |
| బృహతీపత్రం | నేలమునగ | కఫాన్ని, వాతాన్ని తగ్గించి జ్వరం, శ్వాసశూల, హృదయదోషాలను హరిస్తుంది. దగ్గు, మలబద్దకాన్ని తగ్గిస్తుంది. |
| బిల్వపత్రం | మారేడు | రోజూ రెండు లేదా మూడు ఆకులను నమిలి రసాన్ని నిదానంగా మింగితే చక్కెరవ్యాధి నయమౌతుంది. గాలి సోకని గర్భాలయాల్లో కూడా దుర్వాసన పుట్టకుండా కాపాడుతుంది. |
| దూర్వారయుగ్మం | గరికె | రక్త పైత్యానికి, మూత్రసంబంధవ్యాధులకు ఇది చక్కగా పనిచేస్తుంది. |
| దత్తూరపత్రం | ఉమ్మెత్త | దీని ఆకులు, కొమ్మలు, కాయలు, గింజలు, వేళ్లు అన్నీ ఉపయోగమైనవి. ఉమ్మెత్తరసాన్ని తలకు మర్దనచేస్తే ఊడిపోయిన వెంట్రుకలు మొలుస్తాయంటారు. మానసికరోగాలవైద్యానికి దీన్ని ఉపయోగిస్తారు. |
| బదరీపత్రం | రేగు | ఇది శ్లేష్మం. ఎముకలకు బలాన్నిస్తుంది. బాలరోగాలను నయంచేస్తుంది. |
| అపామార్గపత్రం | ఉత్తరేణి | చర్మరోగాలను నివారిస్తుంది. దీని పుల్లతో పళ్లు తోముకుంటే దంతవ్యాధులు నివారింపబడతాయి. |
| తులసీపత్రం | తులసి | శ్లేష్మాన్ని హరించి, క్రిములను నాశనం చేస్తుంది. దగ్గు, వాంతులు అరికడుతుంది. మూత్ర బాధల్ని పోగొడుతుంది. దీని గాలి ఉల్లాసాన్నిస్తుంది. |
| చూతపత్రం | మామిడి | లేతఆకుల్ని పెరుగుతో తింటే అతిసారంవంటి వ్యాధులు హరిస్తాయి మామిడిచెట్టు జిగురులో ఉప్పుకలిపి వేడిచేసి కాళ్లపగుళ్లకు రాస్తే అమోఘంగా పని చేస్తుంది. మామిడి జీడిరసంతో పసుపు కలిపి రాస్తే ఒరిసిన పాదాలపుండ్లు మానుతాయి. |

| పత్రంపేరు | తెలుగుపేరు | ఉపయోగాలు |
|---|---|---|
| **కరవీర పత్రం** | **గన్నేరు** | ఏ జాతి గన్నేరు ఆకులనైనా కొమ్మనుంచి తుంచి పాలు లేకుండా ఒక తడిగుడ్డలో పెట్టుకుని శరీరానికి కట్టుకుంటే జ్వరతీవ్రత తగ్గుతుంది. |
| **విష్ణుక్రాంతపత్రం** | **అవిసె** | కఫం, వాతం, వ్రణాలను, క్రిములను హరించివేస్తుంది. దీని ఆకుల్ని నిమ్మరసంతో నూరి తామర ఉన్న చోట పూస్తే తామర తగ్గుతుంది. |
| **దాడిమీపత్రం** | **దానిమ్మ** | హృదయానికి బలాన్ని చేకూరుస్తుంది. |
| **దేవదారుపత్రం** | **దేవదారు** | దీని తైలం వాపులను హరిస్తుంది. ఎక్కిళ్లను చర్మరోగాలను తగ్గిస్తుంది. |
| **మరువకపత్రం** | **మరువం** | ఇంపైన వాసన కలిగి, వాత, శ్లేష్మ, దోషాలను హరిస్తుంది. తేలు, జెర్రి మొదలగు విష పురుగులవిషాన్ని హరిస్తుంది. శ్వాస, హృద్రోగాలను తగ్గిస్తుంది. దీనిని పసుపుతో, మారి రాస్తే గజ్జి, చిడుము మొదలగు చర్మవ్యాధులు తగ్గుతాయి. |
| **సింధూవారపత్రం** | **వావిలి** | ఈ ఆకుల్ని పురిటిస్నాన సమయంలో నీటిలో వేసి కాచి, ఆ నీటితో స్నానం చేయిస్తే బాలింతలకు వాతం చేయదు. దీన్ని నుదుటకు పట్టిస్తే తలపోటు తగ్గుతుంది. |
| **జాజిపత్రం** | **జాజి** | తరచుగా తింటే శరీరానికి మంచి తేజస్సునిస్తుంది. కంఠస్వరాన్ని బాగు చేస్తుంది. నోటి దుర్వాసన పోగొడుతుంది. |
| **గండకీపత్రం** | **అడవిమొల్ల** | దీనిరసం అపస్మారకస్థితిని, పైత్యవికారాలను, మూర్ఛలను తగ్గిస్తుంది. |
| **శమీపత్రం** | **జమ్మి** | అతిసారం, కుష్ఠు, రక్తపాతాలను శమింపచేస్తుంది. దీనిరసం వెంట్రుకలను నల్లబరుస్తుంది. ఆకురసాన్ని పిప్పళ్లలో పెడితే నొప్పి తగ్గి పన్ను ఊడిపోతుంది. దీని గింజలచూర్ణం పాలతో తాగితే వీర్యవృద్ధి అగుతుంది. |
| **అశ్వత్థపత్రం** | **రావి** | దీని గాలి శ్లేష్మం, గర్భదోషాలను నివారిస్తుంది. ఈ చెట్టు కింద కూర్చొని చదువుకుంటే జ్ఞానవృద్ధి అవుతుంది. |
| **అర్జునపత్రం** | **మద్ది** | దీనిలో తెలుపు, నలుపు రకాలున్నాయి. వాత రోగాలను పోగొడుతుంది. కఫరోగాలను శమింప చేస్తుంది. వ్రణాలను మాన్పు తుంది. |
| **అర్కపత్రం** | **జిల్లేడు** | శరీరాన్ని కాంతివంతం చేస్తుంది. ఆకు లను తలపై పెట్టుకొని స్నానం చేస్తే జలుబు తగ్గుతుంది. శిరోదోషాలు, వ్యాధులు, విషదోషాలుపోతాయి. దీంతో 64రకాలవ్యాధులకు చికిత్స చేయవచ్చు. |



ధారావాహిక

# తిరుమల సమయాచారములు

**(తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)**

**తెనుగు అనువాదకులు:**
**కీ.శే. డా॥ఎన్.సి.వి. నరసింహాచార్యులు,**
**కీ.శే. శ్రీమాన్ టి.ఏ. కృష్ణమాచార్యులు**


*గత సంచిక తరువాయి....*

వేరే స్థలాల నుండి వచ్చినట్టివై దేవాలయానికి భోగ్యాలని చెప్పబడ్డ పదార్థాలను స్థలవాసులు తమ తమ ఇండ్లలో పాకము చేయకుండ దేవాలయంలోనే పాకం చేయించి శ్రీవేంకటాచలపతికి నివేదన చేయించిన తర్వాత ఆ ప్రసాదాన్ని తీసుకొని వెళ్లి ఇంటిలో దేవతలకు నివేదనచేసి, ఆ యా కాలాలకు తగిన దేవతార్చన, పితృదేవతారాధన జరిపించి శరీర పోషణము చేసికోవాలి.

తిరుమలకొండపై నివసించే ముందుగా దేవార్పితములైన గంధమాల్యాదులతో, హవిస్సుతో విష్ణువును ఆరాధించేవారు అని బ్రహ్మోత్తరపురాణంలో ఏడవ అధ్యాయంలో ఉన్నందున స్థలవాసులు తమ గృహ ఆరాధనకోసం దివ్యోద్యానంనుండి పత్రపుష్పాలను సంగ్రహించకుండా శ్రీవేంకటేశ్వరునికి సమర్పించి గ్రహించిన పత్రపుష్పాదులనుకునే ఇంటి దేవతార్చన కోసం ఉపయోగించుకొంటూ భగవన్నివేదిత శేషంతోనే తాము జీవయాత్ర సాగించుకోవాలి. ఇది ఉపలక్షణం. ఈ సూచనప్రకారం భగవంతుని నోటికి భోగ్యంగా చేసే పాలు, పరమాన్నం, సూపం, పిండివంటలను క్షేత్రవాసులు తమ తమ ఇండ్లలో వండుకోరాదు. దేవాలయాచారాలకు విరుద్ధాలైన కూరలు, పండ్లు, గడ్డలు మొదలైనవానిని క్షేత్రవాసులు తమ తమ ఇండ్లలో ఉపయోగించుకోకూడదు.

కలికాలంలోని వారందరూ అన్నాశ్రితులు. సకల మానవులకు ఎల్లప్పుడూ దేహధారణకు అన్నమే మూలం. అందువల్ల అన్నాన్ని మాత్రమే ఇండ్లలో వండుకోవాలి. తిరుమలపై నివసించేవారికి సంతానప్రాప్తి, మృతి సంభవించే సూచనలు కనిపిస్తే ముందుగనే వారిని వేరే స్థలాలకు తీసుకెళ్లాలి. హఠాత్తుగా మరణం ప్రాప్తిస్తే అడివారానికి తీసుకుని వెళ్లి శరీరానికి దహనసంస్కారాలు చేయించాలి.

పరాత్పరుడు మృగం, పక్షి, చిలుక మొదలైన రూపాలు ధరించి, రమాదేవితో క్రీడిస్తున్నాడు. నిత్యసూరులతో ఆ పర్వతంపై నివసిస్తున్నాడు అని వామనపురాణం. **(ఇంకా ఉంది)**



బాలనీతి

# రాజదండన పొందితే... యమదండన తప్పుతుంది!

- శ్రీ నారంశెట్టి ఉమామహేశ్వరరావు


బహుదానదీతీరంలో శంఖుడు, లిఖితుడు అనే సోదరులు ఉండేవారు. ఇద్దరూ చెరొక ఆశ్రమం నిర్మించుకుని తపస్సు చేసుకుంటూ కాలాన్నంతా దైవధ్యానంలోనే గడిపే వారు.

అలా రోజులు గడుస్తుండగా ఒకనాడు శంఖుడు ఆశ్రమంలో లేనప్పుడు అక్కడకు వెళ్లాడు లిఖితుడు. అక్కడ మంచి పండ్ల గెలలతో వేలాడుతున్న అరటిచెట్టు కన్పించింది. అరటిపండ్లు చూడగానే లిఖితుడుకి నోరూరింది. అతడు వాటిని తినకుండా నిగ్రహించుకోలేకపోయాడు. అన్న లేనప్పుడు అతడి ఆశ్రమంలో ప్రవేశించడమే కాకుండా అరటిచెట్టుకి ఉన్న పండ్లను కోసుకొని తిన్నాడు.

లిఖితుడు అరటిపండ్లను తింటున్న సమయంలోనే శంఖుడు అక్కడకు వచ్చాడు. తమ్ముడిచేతిలోని పండ్లను చూసి "తమ్ముడూ ఆ పండ్లు నీకెక్కడివి?" అనడిగాడు.

"ఇక్కడివే. నీ ఆశ్రమంలో పెరిగిన అరటి చెట్టువే కోశాను" అని బదులిచ్చాడు.

తమ్ముడు చెప్పింది విన్న శంఖుడు "నన్ను అడగకుండా పండ్లు కోయవచ్చా? అలా కోసినట్లయితే దొంగతనం అవుతుంది. నువ్వే దొంగతనం చేసినట్లు నీ నోటితోనే చెప్పి అంగీకరించావు. కాబట్టి చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసు కొని నీ పాపాన్ని పోగొట్టు కోవాలి. వెంటనే ఈ రాజ్యపు రాజుగారిని కలుసుకుని జరిగింది చెప్పి దండన అనుభవించు. పాపం పోగొట్టుకున్న తరువాతనే మళ్లీ ఇక్కడకు రా" అని తమ్ముడికి సలహా ఇచ్చాడు.



లిఖితుడు రాజుగారైన సుద్యుమ్నుడుని కలుసుకుని, తాను చేసిన దొంగతనం గురించి చెప్పి తగిన దండన విధించ మన్నాడు.

లిఖితుడి మాటలకు ఆశ్చర్యపోయాడు సుద్యుమ్నుడు. "అంతటి ఘోరమైన పని చేయలేను. మీరు తపస్వులు. మిమ్మల్ని శిక్షించడం నా తరమా? ఇంకెవరినైనా ఈ పని కోసం కలవండి" అని బదులిచ్చాడు.

మహారాజుకు ఎంత మాత్రమూ ఆయణ్ణి శిక్షించడం ఇష్టం లేదు.

"రాజా! రాజదండన పొందినవాడు తిరిగి యమ దండన పొందడని పెద్దలమాట. కనుక తగిన దండన విధించి నన్ను పాపరహితుణ్ణి చెయ్యండి" అని అనేకవిధాలుగా బ్రతిమా లాడాడు లిఖితుడు.

ఇక చేసేది లేక మంత్రులతో, న్యాయాధిపతులుతో చర్చించాడు సుద్యుమ్నుడు. సుదీర్ఘచర్చల తరువాత వారంతా ఏకాభిప్రాయానికి వచ్చి లిఖితుడి రెండుచేతులను ఖండించమని తీర్పు చెప్పారు. ఆ శిక్షను అమలుపరిచాడు సుద్యుమ్నుడు. ఆ శిక్షను సంతోషంగా అనుభవించాడు లిఖితుడు.

తమ్ముడు చేసిన పనికి ఎంతగానో సంతోషించి "ధర్మ మార్గాన్ని ఎవరూ తప్పకూడదు. కాబట్టి ప్రాయశ్చిత్తం చేసుకోవడం న్యాయమే. నీ వల్ల మనవంశమూ పవిత్రమైంది. నువ్వు బహుదానదికి పోయి స్నానంచేసి ఆ నీటితో మునులకు, దేవతలకు, పితృదేవతలకు

తర్పణాలు విడిచిపెట్టు. సురాపానం, గురుపత్నితో సంగమం, బ్రాహ్మణుడిని చంపడం, బ్రాహ్మణుని ధనాన్ని దొంగిలించడం అనే నాలుగూమహాపాపాలు. అటువంటివారితో కలసి ఉండటం కూడా మహాపాపమే అవుతుంది. రాజదండన పొందినవారు పుణ్యాత్ములై ఉత్తమగతులు పొందుతారు. నువ్వు సుద్యుమ్న మహారాజు చేత శిక్షించబడ్డావు కాబట్టి పుణ్యం పొందుతావు” అన్నాడు శంఖుడు.

అన్న చెప్పినట్లే బహుదానదిలో దిగి మునిగాడు లిఖితుడు. అతడు నీటినుండి బయటకు వచ్చేసరికి మునుపటి లాగానే రెండుచేతులు మొలిచాయి. అక్కడ జరిగిన అద్భుతానికి ఆశ్చర్యపోయాడు లిఖితుడు. పరుగుపరుగున అన్న ఆశ్రమానికి వెళ్లాడు. తనకు ఎప్పటిలాగానే రెండు చేతులు మొలిచాయని అన్నకు చూపించి సంబరపడ్డాడు లిఖితుడు.

శంఖుడు “నువ్వు ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఇది నా తపోవనం. అదంతా భగవంతుడు చేసిన అద్భుతం. నీవు రాజు గారినుండి దండన పొందావు కాబట్టి నువ్వుచేసిన దొంగతనం యొక్క పాపం కూడా తీరిపోయింది. ఈ పుణ్యకార్యాచరణవల్ల రాజు సుద్యుమ్నుడు కూడా పవిత్రుడయ్యాడు” అని చెప్పాడు.

కురుక్షేత్రయుద్ధంలో అన్నదమ్ములను, బంధువులను, కొడుకులను, తాతలను, గురువులను కోల్పోయిన ధర్మరాజు రాజ్యం వదిలేసి అడవికిపోయి తపస్సు చేసుకుంటానని, రాజ్యాన్ని తమ్ములకి విడిచిపెడతానని చెప్పినప్పుడు ధర్మరాజుకు నచ్చజెప్పేందుకు వ్యాసుడు చెప్పిన కథ ఇది. రాజరికం గొప్ప ధర్మమని, మునులు కూడా రాజువిధించే శిక్షవలన పాపాలను పోగొట్టుకున్నారని తెలిపాడు. ప్రజలను చక్కగా పాలించి కీర్తి మంతుడు కావాలని ప్రోత్సహించాడు.


## గ్రంథసమీక్ష

# గతం గతః

**(ఆధ్యాత్మిక కథలు)**

**రచయిత–** **శ్రీ ఆర్.సి.కృష్ణస్వామిరాజు,** **సైజు–** 1/8 డెమ్మీ, **పుటలు–**xi+116; **ప్రతులకు–** రచయిత, ఇ.నెం.22–4–71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలని, మంగళం రోడ్డు, తిరుపతి–517 501. **మూల్యం–** 160/–; **సెల్–** 93936 62821.

శ్రీఆర్.సి.కృష్ణస్వామిరాజు బాలకథాసాహిత్య రంగంలో లబ్ధప్రతిష్ఠులు ఇటీవల రాజుగారు పాఠకులకు అందించిన ‘గతంగతః’ 40 ఆధ్యాత్మిక కథలసంపుటం.




ఈ రోజుల్లో విద్యార్థులకు కథా సాహిత్యమందించేవారు ఎడారిలో ఒయాసిస్సు లాగా అరుదుగా కనబడుతూ ఉన్నారు. ఎవరెన్ని చెప్పినా విద్యలలో ‘ఆధ్యాత్మికవిద్య ఒక్కటే సర్వశ్రేష్ఠం. ఈ ఆధ్యాత్మికతను పిల్లలకు హత్తుకొనేలా చెప్పడం ఒక కళ. ఇందులో ఆర్.సి.కె.రాజు మిక్కిలి నేర్పరి.

రాజుగారికథలలో రాజులున్నారు. ప్రాచీనఆశ్రమాలున్నాయి. పాఠశాలలున్నాయి. నేటి సామాన్య కుటుంబాలూ ఉన్నాయి.

ఈ కథలన్నిటిలోను చాలావరకు పిల్లలే ప్రశ్నించడం, పెద్దలు విద్యార్థులకు పరిచయమైన దృశ్యాలను స్మరింపచేస్తూ ఆధ్యాత్మికతను పెంచడం కనిపిస్తుంది. ఈ బోధన నేలవిడిచిన సాము కాదు. రాజుగారి కథలలో ప్రసిద్ధులభావనలున్నాయి. తార్కికమైన సమాధానాలు కనిపిస్తాయి. “మనం మనంగా ఉండాలి” కథలో మామిడిచెట్టు. టెంకాయచెట్టు ఉపమానం; “బంగారు బాల్యం మళ్లీ తెచ్చుకోవాలి” కథలో ‘అద్దం’ ఉపమానం; గతంగతః కథలో ‘సాటినది మరోనది’ని ఆశ్వాసించిన వైనం; మార్గదర్శికథలో ‘ఇంజనీరు’ ఉపమానం; దైవాను గ్రహంలో ‘కమలోపమానం’.

ఇలా ఈ కథలలోని ఆధ్యాత్మికాంశాలను పరిశీలిస్తే పరోపకారం, ఆత్మవిమర్శ, నిగ్రహం లాంటివి గాక నేటి సమాజంలో వినిపించే ‘యోగ’ ప్రాణాయామాదులున్నాయి. పాఠశాలల్లో పాఠాలు బోధించేవారు తమ బోధనలో పాఠ్యాంశాలకు తగిన రీతిలో ఈ కథలకు జోడించి పాఠప్రవచనం చేస్తే ఈ కథలకు చిరంజీవిత్వం. తల్లిదండ్రులైనా ఈ కథలను పిల్లలకు చెబితే సామాజిక ప్రయోజనం, రచయిత కృషి, సాఫల్యం మూడూ నెరవేరు తాయి.

**– ఆచార్య కె.సర్వోత్తమరావు,**
***97041 04000***

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం**–భూమి కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇంట్లో శుభకార్యాచరణ కల్గుతుంది. విద్యార్థులకు వైద్యవిద్యల్లాంటి అసమానప్రతిభ చూపాల్సిన చదువులలో అవకాశం వస్తుంది. శుభకార్యాల్లో తరచు పాల్గొంటారు.



**వృషభం**– ఆకస్మికధనలాభం. భార్యాభర్తల మధ్యమాట కలుస్తుంది. దైవకార్యాలలో పాల్గొం టారు. కోర్టు వ్యవహారాలు కలసిరావు. క్రీడలలో రాణిస్తారు.



**మిథునం**– సమాజంలో ప్రత్యేకస్థానం వస్తుంది. మీ మాటకు విలువ పెరుగుతుంది. పెద్దల మాటను గౌరవిస్తారు. స్థిరాస్తుల కొనుగోలు ప్రయత్నాలు నెరవేరుతాయి. అనుకున్న లక్ష్యాలు నెరవేరు తాయి. కుటుంబవాతావరణం అనుకూలం.



**కర్కాటకం**–అనారోగ్యసూచన. పరీక్షాకాలం, తొట్రు పాటులేకుండా నిదానం అవసరం. ధనాదాయా నికి లోటులేదు. శుభకార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆనందమయంగా జీవనంసాగుతుంది. ఉద్యోగంలో ఉన్నతి కల్గుతుంది. ఆదాయమార్గాలు పెరుగుతాయి.



**సింహం**– గ్రహస్థితి సామాన్యం. కుటుంబవిష యాలు ప్రోత్సాహకరం కాదు. నీలాపనిందలు వస్తాయి. కోపతాపాలకు లోనవండా ఉండండి. భూస్థిరాస్తులవిలువలు ఇబ్బడి ముబ్బడిగా కలసివస్తాయి.



**కన్య**–మీరు పనిచేసే కార్యాలయాల్లో పనిఒత్తిడి పెరుగుతుంది. ధనవృద్ధి అవుతుంది. అపరిష్కృత సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. విందు వినోదాల్లో పాల్గొంటారు.



**తుల**– ఉద్యోగస్తులకు అధికారపరిధి విస్తరణ మరియు వృద్ధియగును. సంస్థలను సక్రమంగా నడిపి మీ బాధ్యతలను నెరవేరుస్తారు. ధనలాభం మాసాంతంలోకల్గును. ఆరోగ్యవిషయంలో జాగ్రత్త అవసరం.



**వృశ్చికం**–గురుబలం కలదు. అన్నిదోషాలు తొలగుతాయి. సర్వకార్యసిద్ధి, శత్రుజయం. చేతి నిండా ధనం లభిస్తుంది. కుటుంబసమస్యల పరి ష్కారమార్గాలు కలసివస్తాయి.



**ధనుస్సు**– గ్రహస్థితిఅనుకూలం. ఇతరులపై మీప్రభావం అమోఘం. కార్యజయం. గృహ నిర్మాణాదులు, కొత్తఇల్లు నూతన వస్తువాహనాలు కొనుగోలు చేయడం జరుగుతుంది.



**మకరం**–గ్రహస్థితి మిశ్రమం. వృత్తివ్యాపారాలు సామాన్యం, శరీరఆరోగ్యం సామాన్యం. ధన వ్యయం. జన్మరాశిలో శని సంచారప్రభావం తొల గుటకు శనైశ్చర సంబంధ ధ్యానశ్లోకాలు, రుద్రాభిషేకం, హనుమాన్‌చాలీసాలాంటి దివ్యమైన స్తోత్రాలు పఠించుట మంచిది.



**కుంభం**– ప్రణాళికతో ప్రతీ పనిలోనూ ముంద డుగు వేస్తారు. విజయలక్ష్యం వైపు దూసుకు పోతారు. తొందరాబాటు నిర్ణయాలుండవు. శుభ యోగాలు కలసివస్తాయి. విద్యార్థులకు అనుకూల సమయం.





**మీనం**– ఉన్నతవిద్యలలోనివారు రాణిస్తారు. పరిశోధనరంగంలోని ప్రముఖులు అత్యంత ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తారు. విద్యావేత్తలకు గుర్తింపు వస్తుంది. అన్నదానాదిక్రతువులలో పాల్గొంటారు.

చిత్ర కథ


# చవితి చంద్రుణ్ణి చూస్తే..!

కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ




రుక్మిణీ! ఈ నీలాపనిందను తొలగించుకోడానికి నేను వెళ్ళదలచాను. అంతవరకూ వినాయక వ్రతాన్ని చేస్తూ ఉండు. నేను త్వరగా వస్తాను.
అలాగే..స్వామీ!
శ్రీకృష్ణుడు అడవుల్లో గాలిస్తూ వెళ్లాడు. శమంతకరత్నం జాంబవంతుడు సంగ్రహించినట్లు గుర్తించాడు. జాంబవంతుని గుహకు చేరాడు...
జాంబవంతా.. ఆ మణిని నాకివ్వు..
ఇవ్వకుంటే...
యుద్ధం తప్పదు...
సరే! యుద్ధమే నాకూ ఇష్టం...
శ్రీకృష్ణుడే నాటి శ్రీరాముడని జాంబవంతుడు గుర్తించాడు
మహాత్మా! మన్నించు. శమంతకంతో పాటు నా పుత్రికారత్నమైన జాంబవతిని కూడా స్వీకరించు...
సత్రాజిత్! ఇదిగో నీ శమంతకరత్నం.
కృష్ణా! నన్ను మన్నించు. శమంతకరత్నంతో పాటు సత్యభామామణినీ స్వీకరించు..
2
శ్రీకృష్ణుడు భార్యలతో వినాయక వ్రతాన్ని నియమంగా ఆచరించి నీలాపనింద నుండి విముక్తుడయ్యాడు. సంవత్సరానికొకసారి ఎవరైతే చవితినాడు వినాయకపూజ చేస్తారో, చవితి చంద్రుణ్ణి చూడరో వారికి నిందలు తొలగి, సుఖశాంతి సంపదలు కలిగి, శ్రీకృష్ణునిలా అలరారుతారు.
శుభం

విశ్వదాభిరామం　　వేమన పద్యసూక్తి



## తల్లిదండ్రులసేవ..

తల్లిదండ్రిమీద దయ లేనిపుత్రుండు
పుట్ట నేమి వాడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా?
విశ్వదాభిరామ! వినురవేమ!

**అర్థాలు:** పుత్రుడు= కొడుకు; దయ= కనికరం; పుట్ట నేమి= పుట్టి ప్రయోజనం లేదు; గిట్టనేమి= చచ్చి నష్టంలేదు; చెదలు= పుట్టపెట్టుచీమ, సమీపంలోని వస్తువుల్ని తినివేస్తుంది.

**భావం:** తల్లిదండ్రులమీద కనికరం లేనికొడుకు పుట్టి ప్రయోజనం లేదు. చస్తే నష్టం లేదు. పుట్టలో చెదలు పుడుతుంది, చస్తుంది. దానివల్ల లోకానికి ఏమీ ప్రయోజనం ఉండదు కదా.

**వివరణ:** అనేకకారణాలవల్ల సంతానం తల్లిదండ్రుల్నిసరిగా ఆదరించడం లేదు. పెద్దతనంలో వారు బాధలు పడాల్సివస్తున్నది. అటువంటి సంతానం పుట్టలో చెదల లాగా ఎక్కువమంది కలిగినా, ఆ తల్లి దండ్రులకు ప్రయోజనం లేదు. తల్లిదండ్రులను ప్రేమగా చూచుకునే కొడుకు ఒక్కడు ఉన్నా చాలు. ఇంక నేటిసమాజంలో రకరకాల కారణాలవల్ల కొడుకులొక చోట తల్లిదండ్రులింకో చోట బ్రదుకుతున్నారు. పెక్కుకారణాలతో వృద్ధాశ్రమాలు ఏర్పడుతున్నాయి. పిల్లలు పితరులను ప్రేమతో ఆదరించాలి.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## వైకుంఠపాళి 79

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | ■ | 3 | 4 | ■ | 5 |
| | ■ | | ■ | 6 | ■ | | ■ | |
| 7 | | ■ | 8 | | | ■ | 9 | |
| | ■ | 10 | ■ | | ■ | 11 | ■ | |
| ■ | 12 | | | ■ | 13 | | | ■ |
| 14 | ■ | | ■ | 15 | ■ | | ■ | 16 |
| 17 | | ■ | 18 | | | ■ | 19 | |
| ■ | ■ | 20 | ■ | | ■ | 21 | ■ | |
| ■ | 22 | | | | ■ | 23 | | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

2)ఆండాళ్ తల్లిని ఇలా కూడా అంటారు (2); 3)గంగానది ఒడ్డున గల ప్రసిద్ధ శైవక్షేత్రం (2); 7)మతి(2); 8)ప్రకృతికి వ్యతిరేకం(3); 9)ఊహించుటకు ఇలా అంటారు(2); 12)చైత్రమాసంలో ఈ తిథి రోజున శ్రీరాముడు జన్మించాడు(3); 13)చికాకు కల్గినపుడు ఇది పుడుతుంది(3);17)దిక్కు(2);18)సంధ్యాసమయంలో మన హిందువులు దీన్ని పెడతారు(3); 19)మనవారు పుణ్యక్షేత్రాల్ని సందర్శించడాన్ని వ్యవహారంలో ఇలా అంటారు(2); 22)శివుడు అభిషేక ప్రియుడు మరి విష్ణువు?(4); 23)బురద(2)

### నిలువు

1)ఏడుకొండలు దిగువభాగాన్ని తిరుపతి అంటారు. స్వామి ఉన్న ప్రాంతాన్ని ఏమంటారు(4); 2)భూలోకంలో కామధేనువు(2); 4)తప్పుచేసినవాడికి ఇది వేస్తారు(2); 5)తిరుపతికి దగ్గరలో ఉన్న శైవక్షేత్రం(4); 6)నేను తండ్రివంటి వాడను. ఇది తల్లివంటిదని గీతాచార్యుడు చెప్పాడు(3); 10)పల్లెల్లో చెరువుకు వెళ్లి దీన్ని భుజాన వేసుకుని రెండుబిందెలతో నీరు తెచ్చుకుంటారు(3); 11)అష్టాదశ పురాణాల్ని వ్రాసిన మహర్షి(3); 14)స్త్రీల కాలినగ(2); 15)సుమతికారుడు అపకారికైనను ఇది చేయమన్నాడు(4); 16)తెలుగుమాసాల్లో మొదటిది(3); 20)నీరు(2); 21)వేసవికాలంలో ఇది ఎక్కువ(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

# క్విజ్

01) పారిజాతాన్ని ఇంద్రలోకం నుండి తెచ్చినవారెవరు?
జ) ...........................................

02) లక్ష్మణ ఎవరిభార్య?
జ) ...........................................

03) గోపాలకులు చేసిన ఇంద్రయాగాన్ని నిలిపించినదెవరు?
జ) ...........................................

04) అన్నాదుని తండ్రి?
జ) ...........................................

05) ద్వారక ఎవరి నగరం?
జ) ...........................................

06) నవనీతచౌర్యాన్ని చేసిందెవరు?
జ) ...........................................

07) పంచజనుడు ఎవరిచేతిలో మరణించాడు?
జ) ...........................................

08) శిఖిపింఛమౌళి ఎవరు?
జ) ...........................................

09) యమళార్జునభంగాన్ని చేసిందెవరు?
జ) ...........................................

10) రుక్మి ఎవరి బావమరిది?
జ) ...........................................

11) సుధర్మ సభ ఎవరిది?
జ) ...........................................

12) సునందుడు ఎవరి అనుచరుడు?
జ) ...........................................

13) ఉద్ధవుడు ఎవరి మంత్రి?
జ) ...........................................

14) కువలయాపీడం ఎవరి చేతిలో మరణించింది?
జ) ...........................................

15) గర్గుడు జాతకర్మాదులను చేసిందెవరికి?
జ) ...........................................

16) సాందీపుని వద్ద చతుఃషష్టికళలు నేర్చిందెవరు?
జ) ...........................................

17) తృణావర్తుడు ఎవరి చేతిలో మరణించాడు?
జ) ...........................................

18) ఉద్ధవునికి ధ్యానయోగాన్ని ఎవరు బోధించారు?
జ) ...........................................

19) నృగుడికి శాపవిముక్తి కలిగించిందెవరు?
జ) ...........................................

20) శకటాసురుని వధించిందెవరు?
జ) ...........................................

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) క్విజ్ జవాబులను, ప్రశ్నలక్రింద నిర్దేశించిన స్థలంలోనే రాసి పంపాలి.

04) క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పరిగణించబడవు.

05) సమాధానాల్లో ఎలాంటి కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండ కూడదు.

06) జవాబులు చేరాల్సిన చివరితేది 25-08-2022.

07) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలిక లలో ముగ్గురిని మాత్రం విజేతలుగా లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తాం.

08) విజేతలపేర్లు సెప్టెంబరునెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

09) తి.తి.దే. ప్రధాన సంపాదకుల కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్ పోటీలో పాల్గొనకూడదు.

10) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్ ద్వారా ఇవ్వబడదు.

11) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్ పెన్నులతో రాయకూడదు.

12) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరిమాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధానపత్రంలో ఈ క్రింది వివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

**చందాసంఖ్య:** .......................... **వయస్సు:** ..............
**పాఠశాల:** .......................... **తరగతి:** ..............
**పేరు:** ..........................................
**చిరునామా:** ..........................................
..........................................
..........................................
.......................... **పిన్‌కోడ్:** ..............
**ఫోను నెంబరు:** ..........................................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక,
తి.తి.దే. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507.
తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### శ్రీమహావిష్ణువు ద్వారపాలకులు

01)జయుడు 02)విజయుడు 03)ప్రచండుడు

04)చండుడు 05)నందుడు 06)సునందుడు

07)కుముదుడు 08)కుముదాక్షుడు

### ఇందులో ఏ సామెత దాగుంది..?




జవాబు:
ఎలుకలు ఉన్నాయని.. ఇల్లు తగలబెట్టినట్లు

### అన్నీ నామాలే!

పక్కనున్న పట్టికలోని వినాయకుడి పేర్లు పట్టుకుంటారా?

| | | | | | |
|---|---|---|---|---|---|
| వి | నా | య | క | లం | ఏ |
| ఘ్న | య | వి | తి | బో | క |
| శ్వ | క | తి | ప | ద | దం |
| రు | చ | గ | ణ | రు | త |
| డు | శు | ణే | గ | డు | డు |
| పా | ర్వ | తీ | సు | తు | డు |

**వినాయకుడి పేర్లు**

వినాయక,
ఏకదంతుడు,
విఘ్నేశ్వరుడు,
గణేశుడు,
గణపతి,
పార్వతీసుతుడు,
లంబోదరుడు

### గజిబిజి!!

పిల్లలూ.. ఇక్కడున్న అక్షరాలను చదివి సరైన పదాలు రాయండి

1) రంగుపాణ ..........................
2) ధాలనంవ ..........................
3) నంన్యాస్థాయ ..........................
4) లుజంతెతేగు ..........................
5) తంరభాహామ ..........................

జవాబులు: 1)గుణపారం 2)అవధానం 3)న్యాయస్థానం 4)తెలుగుతేజం 5)మహాభారతం

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

స మే యం జ త్య

జవాబు:
సత్యమే
జయం

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.











అమెరికాలో స్థిరపడిన భారతీయులు, ప్రవాసాంధ్రుల కోసం...
2022, జూన్ 18వ తేదీ నుంచి జూలై 09వ తేదీ వరకు
శాన్‌ఫ్రాన్సిస్కో, సియోటెల్, డల్లాస్, సెయింట్ లాయిస్, చికాగో, న్యూ ఆర్లిన్, వాషింగ్టన్ డి.సి.,
అట్లాంటా నగరాల్లో జరిగిన శ్రీనివాస కల్యాణోత్సవ దృశ్యాలు.

ఈ ఉత్సవాలలో తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు
శ్రీ వై.వీ.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-07-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.



ఘనసంపదలొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గనిన రమాసతి యీపె
అనిశముఁ బాయనిమహాహరిప్రియ యీపె
ధనధాన్యరూపపుశ్రీ తరుణి యీపె

- అన్నమయ్య